www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 28-4-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 12

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్ల పక్షం, తిథి: పాడ్యమి రా.9:11 తదుపరి విదియ, నక్షత్రం: భరణి రా.9:38 తదుపరి కృత్తిక, వర్జ్యం: ఉ.9:02-10:26, దుర్ముహూర్తం: మ.12:37-1:28, మ.3:09-3:59, అమృతఘడియలు: సా.5:26-6:50, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 5:54, సూర్యాస్తమయం: 6:31

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## 22 గంటలు ట్రెక్కింగ్ చేసొచ్చి ఘాతుకం!

కొండలు, గుట్టల్లో నడిచి వచ్చి పర్యాటకులను చంపిన ఉగ్రవాదులు.. రెండు సెల్‌ఫోన్లు చోరీ

ఏకే-47, ఎం-4 ఎసాల్ట్ రైఫిల్‌తో మారణకాండ

దాడిని చెట్టుపై నుంచి చిత్రీకరించిన స్థానిక ఫొటోగ్రాఫర్.. దర్యాప్తులో ఆ వీడియోనే కీలకం



2

## అతివకు కోరినంత రుణం!



- వినూత్నంగా డ్వాక్రా రుణ ప్రణాళిక రూపకల్పన
- క్షేత్రస్థాయి అవసరాలు ప్రతిబింబించేలా తయారు
- స్వయం సహాయక బృందాల సభ్యులకు ఆర్థిక ఊతం
- ఎన్యుమరేటర్లుగా 1.25 లక్షల మంది సభ్యులకు శిక్షణ
- మొత్తం 88,48,109 మంది సభ్యులకు 61,964 కోట్లు
- 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు అందజేత
- అత్యధికంగా వ్యవసాయ రంగంలో రూ.11,319 కోట్లు
- అప్పుతో పాటు కోరుకున్న రంగాల్లో శిక్షణ అందజేత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

స్వయం సహాయక సంఘాల మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఈ బృందాల్లోని సభ్యులకు పెద్దఎత్తున రుణాలు ఇవ్వడంతో పాటు వాటి ద్వారా వారు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు చర్యలు తీసుకుంటోంది. డ్వాక్రా మహిళల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఈసారి రుణ ప్రణాళికను వినూత్నంగా రూపొందిస్తున్నారు. గతంలో ఉన్నత స్థాయిలో

మిగతా 10వ పేజీలో...

## అమరావతి రాష్ట్ర ప్రజల

# ఆత్మగౌరవం

### కుట్రలతో ప్రజా రాజధాని స్వప్నాన్ని చెరిపేయలేరు

- విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం
- మే 2 రాష్ట్ర చరిత్రలోనే గొప్ప మలుపు కానుంది
- అమరావతి సంపద సృష్టి కేంద్రంగా మారుతుంది
- అన్ని వర్గాలకూ ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది
- 'నా రాజధాని అమరావతి' అని ప్రతి పౌరుడూ చెప్పుకోవాలి: సీఎం చంద్రబాబు
- ప్రధాని సభ ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష



మోదీ పర్యటనపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నిన్నటి విధ్వంసం నుంచి రేపటి వికాసం వైపు రాజధాని ప్రయాణం సాగనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. మే 2న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభ కార్యక్రమంపై చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. బహిరంగ సభ, భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా

మిగతా 11వ పేజీలో...

## మోదీ సభకు చకచకా ఏర్పాట్లు

- మండుటెండలో శ్రమిస్తున్న వందల మంది
- ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు
- లక్ష మంది కూర్చునేలా సభా ప్రాంగణం



## పహల్గాం ఉగ్ర దాడితో దేశ ప్రజల

# రక్తం మరుగుతోంది

- బాధిత కుటుంబాలకు న్యాయం చేసే పూచీ నాది
- ఉగ్రవాదులకు, కుట్రదారులకు అత్యంత కఠిన శిక్ష
- కశ్మీర్ కళకళలాడుతుండడాన్ని చూసి శత్రువులు ఓర్వలేకపోతున్నారు.. అందుకే ఇంత కుట్ర: మోదీ
- అరేబియా సంద్రంలో నౌకా విధ్వంసక క్షిపణి పరీక్షలు
- యుద్ధానికి సిద్ధంగా ఉన్నామంటూ 'ఎక్స్'లో నేవీ పోస్ట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి చిత్రాలు చూసి దేశంలోని ప్రతి పౌరుడి రక్తం మరుగుతోందన్న విషయం తనకు అర్థమవుతోందని.. బాధిత కుటుంబాలకు తగిన న్యాయం జరుగుతుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. వారికి న్యాయం చేసే పూచీ తనదని.. పర్యాటకులపై దాడికి పాల్పడ్డవారికి, దాడి వెనుక సూత్రధారులకు అత్యంత కఠిన శిక్ష విధిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. 'మన్ కీ బాత్' 121వ ఎపిసోడ్‌లో ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించి విచారాన్ని వ్యక్తం చేసిన ప్రధాని.. దేశ ప్రజలందరి హృదయాలనూ ఉగ్రదాడి తీవ్రంగా బాధించిందని చెప్పారు. ఈ దాడిలో తమవారిని కోల్పోయిన బాధితుల ఆవేదనను.. రాష్ట్రాలకు, భాషలకు అతీతంగా దేశంలోని ప్రతి ఒక్కరూ అనుభవిస్తున్నారని, ఈ క్రూర దాడిని ముక్తకంఠంతో నిరసిస్తున్నారని

మిగతా 2వ పేజీలో...

### 48 గంటల్లోగా కోతలు పూర్తిచేయండి

- పొలాలను ఖాళీ చేయండి
- పంజాబ్‌లో సరిహద్దు వెంబడి రైతులకు బీఎస్ఎఫ్ ఆదేశాలు!

### మా 130 అణ్వస్త్రాలు.. మీకే గురిపెట్టాం

- మా ఆయుధాలు ప్రదర్శనకు కాదు
- భారత్ సింధు నీళ్లను ఆపేస్తే పూర్తిగా యుద్ధానికి సిద్ధమైనట్టే..
- పాక్ మంత్రి అబ్బాసీ వ్యాఖ్యలు

**పాక్‌కు అండగా ఉంటాం: చైనా**





గుంతకల్లు శివారులో ఇన్నోవా వాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

## టిప్పర్‌తో ఢీకొట్టి.. కొడవళ్లతో నరికి

### ఎమ్మార్పీఎస్ సీమ అధ్యక్షుడి దారుణ హత్య

- గుంతకల్లు నుంచి చిప్పగిరికి కారులో వెళ్తుండగా లక్ష్మీనారాయణపై దాడి
- కుమారుడు, బంధువుకూ గాయాలు.. గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స
- టీడీపీ నేత శ్రీరాములు దంపతుల హత్య కేసులో లక్ష్మీనారాయణ నిందితుడు

3

### భూవివాదంలో రెచ్చిపోయిన వైసీపీ కార్యకర్తలు

పెద్దాపురంలో టీడీపీ కార్యకర్తపై కత్తులతో దాడి

12

### తమిళనాడులో ఇద్దరు మంత్రులు ఔట్

- బాలాజీ, పొన్ముడి రాజీనామా
- స్టాలిన్ సిఫారసుకు గవర్నర్ ఓకే
- నేడు కేబినెట్‌లోకి తంగరాజ్
- ఈడీ కేసులో ఏడాది జైల్లో బాలాజీ
- అనారోగ్య కారణంగా సుప్రీం బెయిల్
- ఆ వెంటనే కేబినెట్‌లో చేరడంపై ఫైర్
- మహిళలపై వ్యాఖ్యలు.. పొన్ముడి ఔట్

3

## పాకిస్థాన్‌కు అండగా ఉంటాం

**» భారత్ చర్యలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం: చైనా**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: పహల్గాం ఉగ్రదాడి, భారత్ చేపడుతున్న చర్యలను తాము క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని.. ఈ అంశంలో పాకిస్థాన్‌కు అండగా ఉంటామని చైనా పేర్కొంది. పాక్ ఉప ప్రధాని మహమ్మద్ ఇషాక్‌తో ఫోన్‌లో మాట్లాడిన సందర్భంగా చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి ఈ మేరకు భరోసా ఇచ్చారు. "చైనా మిత్రదేశం, వ్యూహాత్మక భాగస్వామి అయిన పాకిస్థాన్ భద్రత గురించిన ఆందోళనను మేం అర్థం చేసుకోగలం. పాక్ తన సార్వభౌమత్వాన్ని నిలుపుకోవడంలో అండగా ఉంటాం. పహల్గాం దాడిపై నిష్పక్షపాత దర్యాప్తు జరపాలన్న పాక్ డిమాండ్‌కు మద్దతు ఇస్తాం" అని పేర్కొన్నారు. మరోవైపు, పహల్గాం ఉగ్రదాడి, పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందంటూ భారత్ కఠిన చర్యలు చేపట్టడంతో.. ఈ అంశాన్ని వివాదాస్పదం చేసేందుకు పాకిస్థాన్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. పహల్గాం ఉగ్రదాడి అంశంలో రష్యా, చైనా జోక్యం చేసుకోవాలని, భారత్ చెబుతున్నది నిజమా, అబద్ధమా తేల్చాలని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. రష్యా అధికారిక వార్తా సంస్థ 'ఆర్ఐఏ నొవొస్తి'తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "కశ్మీర్‌లో జరిగిన ఘటన కుట్రదారులు ఎవరో తేలుద్దాం. రష్యాగానీ, చైనాగానీ, యూరోపియన్ దేశాలుగానీ ఈ విషయంలో చాలా కీలక పాత్ర పోషించగలవని అనుకుంటున్నాను. ఆ దేశాలు ఒక విచారణ బృందాన్ని నియమించి.. భారత్, మోదీ నిజం చెప్తున్నారా, అబద్ధం చెబుతున్నారా అన్నదానిపై దర్యాప్తు చేయాలి. అసలు విషయం ఏమిటో అంతర్జాతీయ బృందంతో తేల్చాలి.." అని పేర్కొన్నారు.

### భారత్‌ను వీడకుంటే మూడేళ్ల జైలు.. 3లక్షల ఫైన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: విధించిన గడువులోగా భారత్‌ను విడిచి తిరిగి వెళ్లకుంటే కఠిన చర్యలు ఉంటాయని పాకిస్థానీలను కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ ఆదేశాలు పాటించకుంటే మూడేళ్ల జైలు శిక్షగానీ రూ.3 లక్షల జరిమానాగానీ విధిస్తామని తెలిపింది. లేదంటే రెండు శిక్షలూ విధించే అవకాశం ఉందని తెలిపింది. మెడికల్ వీసాలు ఉన్నవారు మంగళవారంలోగా వెళ్లిపోవాలని ఆదేశించింది. వీసా ఆన్ అరైవల్, బిజినెస్, జర్నలిస్టు వంటి 12 రకాల వీసాలపై వచ్చినవారు ఆదివారం నాటికి, సార్క్ వీసాలు ఉన్నవారు శనివారం నాటికే దేశాన్ని విడిచిపెట్టి వెళ్లాలని ఇంతకుముందే సూచించింది. 'లీవ్ ఇండియా' పేరుతో నోటీసులు పంపించింది.

### ఉగ్రవాదులు మతం అడగలేదు!

**» కర్ణాటక మంత్రి తిమ్మాపూర్ వివాదాస్పద వ్యాఖ్యలు**

బెంగళూరు, ఏప్రిల్ 27: పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కర్ణాటక ఎక్సైజ్ శాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులు మతం అడిగి కాల్చారని తాను భావించడం లేదని వ్యాఖ్యానించారు. శనివారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'తుపాకీతో పేల్చే ఉగ్రవాది కులం, మతం అడుగుతాడా? కాల్చుకుంటూ వెళ్లిపోతాడంతే! ప్రాక్టికల్‌గా ఆలోచించండి' అని వ్యాఖ్యానించారు. ఉగ్రదాడిని మతపరమైన అంశంగా మార్చేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. బీఆర్ తిమ్మాపూర్ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇది బాధిత కుటుంబాలను అవమానించడమేనని బీజేపీ మండిపడింది.

### భారత వ్యతిరేక వ్యాఖ్యలతో అసోం ఎమ్మెల్యే అరెస్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: పహల్గాం ఉగ్రదాడి వేళ పాకిస్థాన్‌కు మద్దతుగా, భారతదేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 19 మంది వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో అసోం ప్రతిపక్ష పార్టీ ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అనిముల్ ఇస్లాం, పలువురు విద్యార్థులు ఉన్నారు. 2019లో జరిగిన పుల్వామా దాడి ప్రస్తుతం జరిగిన పహల్గాం ఉగ్రదాడి భారత ప్రభుత్వం పన్నిన కుట్రలంటూ ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే అనిముల్ ఇస్లాంను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, కోర్టు ఆయనకు నాలుగు రోజుల రిమాండ్ విధించింది.

### వైఫల్యం లేని నిఘా ఏ దేశానికైనా అసాధ్యం: థరూర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: వైఫల్యం లేని నిఘా ఏ దేశానికైనా అసాధ్యమని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ చెప్పారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనను ఆయన ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబరు 7న హమాస్ జరిపిన దాడితో పోల్చారు. ప్రపంచంలోనే అత్యంత ఉత్తమ నిఘా వ్యవస్థలు ఉన్న ఇజ్రాయెల్‌పై కూడా హమాస్ దాడి జరిపిందని శశిథరూర్ గుర్తు చేశారు. నిఘా వైఫల్యం అనే అంశంపై చర్చించేకన్నా ప్రస్తుత సంక్షోభ నివారణపై అందరూ దృష్టి సారించాలని సూచించారు.

### ఆర్మీ ఆధునీకరణకు విరాళాల సేకరణ అబద్ధం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఆర్మీ ఆధునీకరణకు, సైనిక సహాయనిధి కోసం విరాళాలు సేకరిస్తున్నారంటూ, మీకు తోచిన సాయాన్ని చేయాలంటూ వాట్సా‌ప్‌లో చక్కర్లు కొడుతున్న సందేశాన్ని నమ్మవద్దని కేంద్ర రక్షణ శాఖ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. పహల్గాం ఘటన నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు ప్రజల దేశభక్తిని అనుకూలంగా మార్చుకొని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ప్రతిపాదన మేరకు ప్రధాని మోదీ సైనిక సహాయనిధిని ఏర్పాటు చేశారంటూ వాట్సా‌ప్‌లో సందేశం వైరల్ అవుతోంది.

### కంచె కింద పాక్కుంటూ వెళ్లి..
### చిన్న గోతిలో గంటసేపు నక్కి..!

**» పహల్గాం ఉగ్రదాడి నుంచి తప్పించుకున్న మైసూర్ టెకీ**



ప్రసన్న కుమార్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: పహల్గాంలోని ఉగ్రదాడి నుంచి మైసూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రసన్న కుమార్ భట్ త్రుటిలో తప్పించుకున్నారు. ఆనాటి భయానక పరిస్థితులను, తాము అనుభవించిన ఉద్విగ్న క్షణాలను ఆయన సోషల్ మీడియా వేదికగా వివరించారు. ప్రసన్న తన భార్య, సోదరుడు, వదినతో కలసి 22న బైసారన్ వెళ్లారు. మధ్యాహ్నం. 2.25 గంటల సమయంలో రెండుసార్లు తుపాకీ పేలిన శబ్దం వినిపించింది. తర్వాత కాసేపటికే కాల్పుల మోతలతో పాటు పర్యాటకుల ఆర్తనాదాలు వినిపించాయి. భారత సైన్యంలో సీనియర్ అధికారిగా పనిచేస్తున్న ప్రసన్న సోదరుడికి అది ఉగ్రదాడి అని అర్థమైంది. పరిస్థితిని అంచనా వేసిన ఆయన వెంటనే వీరిద్దరి కుటుంబాలతో పాటు అక్కడే ఉన్న మరో 35- 40మందిని అప్రమత్తం చేశారు. ఉగ్రవాదులు వేచి ఉన్న ప్రధాన ద్వారానికి దూరంగా వారిని తీసుకెళ్లారు. అదృష్టవశాత్తూ అక్కడి కంచె కింద ఒక ఇరుకైన మార్గం కనిపించడంతో అందరూ దాని కిందుగా పాకుతూ అవతలకు వెళ్లి, కొండ కిందకు పరిగెత్తడం ప్రారంభించారు. బురదగా ఉన్న వాలు ప్రాంతం ప్రమాదకరంగా ఉండటంతో కొంతమంది జారి పడిపోయారు. అయినా ఎవరూ పరుగు మాత్రం ఆపలేదు. ఈ క్రమంలో దాడి జరుగుతున్న ప్రాంతానికి కొంతదూరంలో ఒక చిన్న గొయ్యి కనిపించడంతో ప్రసన్న దంపతులు అందులో తలదాచుకున్నారు. మధ్యాహ్నం 3గంటల సమయానికి కాల్పుల శబ్దాలు తగ్గుముఖం పట్టడంతో ప్రసన్న సోదరుడు తన పై అధికారులకు సమాచారం ఇచ్చారు.

### సరైన సమయంలో పాక్‌కు గుణపాఠం!

**» మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్**

చెన్నై, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులతో కాల్పులు జరిపించిన పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వం సరైన సమయంలో తగిన గుణపాఠం నేర్పుతుందని మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. బంగ్లాదేశ్‌ను పోగొట్టుకున్నప్పటికీ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషించడమే పనిగా పెట్టుకుందని అన్నారు. మరోవైపు, గవర్నర్ల వ్యవహారంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులు వేర్వేరుగా ఉన్నాయని, ఉపకులపతులను నియమించుకునే అధికారం కేరళ గవర్నర్‌కు ఉందని తెలిపిన సుప్రీంకోర్టే.. ప్రస్తుతం తమిళనాడు గవర్నర్‌కు ఆ అధికారం లేదంటూ తీర్పు వెలువరించిందని తెలిపారు, ఈ తారతమ్యాలపై న్యాయ నిపుణులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఊటీలో గవర్నర్ ఏర్పాటు చేసిన సదస్సుకు వీసీలను వెళ్లకుండా బెదిరించారనే ఆరోపణలపై రాధాకృష్ణన్ స్పందిస్తూ తమిళనాట బెదిరింపులు సర్వసాధారణమని, వీసీలకు మినహాయింపు లేదని వ్యాఖ్యానించారు.

## పహల్గాం ఉగ్రదాడితో దేశ ప్రజల

# రక్తం మరుగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. "జమ్మూకశ్మీర్‌లో మళ్లీ శాంతియుత వాతావరణం నెలకొంటోంది. పాఠశాలలు, కళాశాలలు తెరుచుకుంటున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి. ప్రజాస్వామ్యం బలోపేతమై, పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ప్రజల ఆదాయం పెరుగుతోంది. యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయి. దేశ శత్రువులు, కశ్మీర్ శత్రువులకు ఇదంతా నచ్చట్లేదు. వారి దీన్ని చూసి ఓర్వలేకపోతున్నారు. ఉగ్రవాదులు, వారి వెనుక ఉండే సూత్రధారులు కశ్మీర్ మరోసారి నాశనం కావాలనుకుంటున్నారు. అందుకే ఇంత పెద్ద కుట్రకు తెగబడ్డారు." అని ప్రధాని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించేవారి పిరికితనానికి ఈ దాడి నిదర్శనమని వ్యాఖ్యానించారు. "ఉగ్రవాదంపై మనం జరుపుతున్న పోరులో.. దేశ ప్రజల ఐకమత్యం, 140 కోట్ల మంది భారతీయుల సంఘీభావమే మనకున్న అతి పెద్ద బలం, ఉగ్రవాదంపై మన నిర్ణయాత్మక పోరాటానికి ఈ ఐక్యతే ఆధారం" అని మోదీ పేర్కొన్నారు. ఈ సమయంలో ఒక దేశంగా మనందరం బలమైన సంకల్పశక్తిని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఈ ఉగ్రదాడి తర్వాత.. దేశప్రజలందరూ ముక్తకంఠంతో మాట్లాడడాన్ని ప్రపంచమంతా ఆసక్తిగా గమనిస్తోందని చెప్పారు. వివిధ దేశాల నేతలు తనకు ఫోన్ చేసి మాట్లాడారని, లేఖలు రాశారని, సందేశాలు పంపారని.. అందరూ ఈ నీచమైన దాడిని తీవ్రంగా ఖండించారని, బాధితుల కుటుంబాలకు సానుభూతి తెలిపారని మోదీ వెల్లడించారు.

**యుద్ధానికి సిద్ధం.. కాల్పులు.. కూల్చివేతలు..**

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ 'అణు'బీరాలు పలుకుతున్న వేళ.. భారత నౌకాదళం అరేబియా సంద్రంలో మన యుద్ధనౌకల సన్నద్ధతను మరోసారి పరీక్షించుకుంది. యుద్ధనౌకల నుంచి.. పలు నౌకా విధ్వంసక క్షిపణులను విజయవంతంగా ప్రయోగించింది. సముద్ర జలాల్లో ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎలాగైనా దేశ ప్రయోజనాలను కాపాడేందుకు సిద్ధంగా ఉన్నామంటూ నౌకాదళం 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. ఐక్యతలోనే బలం ఉందని మరో పోస్టులో పేర్కొంది. భారత సైన్యం కూడా.. "ఎల్లప్పుడూ సిద్ధం, నిరంతరం అప్రమత్తం" అంటూ ఒక పోస్టు చేసింది. మరోవైపు.. కశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం తనిఖీలు, ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. గడిచిన ఆరు రోజుల్లో మన భద్రతా దళాలు 10 మంది ఉగ్రవాదుల ఇళ్లను కూల్చిపారేశాయి. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల నెట్‌వర్క్‌ను సమూలంగా నాశనం చేసేందుకే ఈ సోదాలు, కూల్చివేతలను కొనసాగిస్తున్నట్టు పోలీసు శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఇక.. నియంత్రణ రేఖ వద్ద పాక్ కవ్వింపు కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. వాటికి మన సైన్యం దీటుగా బదులిస్తోంది. కాగా, ఆదివారం ప్రధాని మోదీ మన్‌కీ బాత్ 121వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. అంతరిక్ష రంగంలో భారత్ దూసుకెళ్తోందని చెప్పారు. ప్రపంచం మొత్తం మీద అతి తక్కువ ఖర్చుతో అంతరిక్ష ప్రయోగాలను విజయవంతంగా పూర్తి చేస్తోందన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుతుందన్నారు.

అరేబియా సముద్రంలో భారత నౌకాదళం క్షిపణి సన్నద్ధత పరీక్షలు



**48 గంటల్లోగా కోతలు పూర్తిచేయండి**

పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో.. నియంత్రణ రేఖకు ఆనుకుని ఉన్న పొలాలన్నింటిలో పంట కోతలు 48 గంటల్లోగా (సోమవారం సాయంత్రంలోగా) పూర్తి చేసి, వాటిని ఖాళీ చేయాలని భారత సరిహద్దు భద్రత దళాలు రైతులను శనివారం సాయంత్రం ఆదేశించినట్టు సమాచారం. పంజాబ్ సెక్టార్‌లో 530 కిలోమీటర్ల మేర విస్తరించిన ఇండో-పాక్ అంతర్జాతీయ సరిహద్దుపై ఉన్న జీరోలైన్‌కు, భారత్ వైపు ఉన్న సరిహద్దు కంచెకు నడుమ.. రైతులకు దాదాపు 45 వేల ఎకరాల సాగుభూములున్నాయి. వారంతా అక్కడ గోధుమలు పండిస్తుంటారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయా పొలాల్లో కోతలు రెండు రోజుల్లోగా పూర్తిచేయాలంటూ అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, ఫజిల్కా తదితర జిల్లాల్లోని గ్రామ గురుద్వారాలు ప్రకటనలు చేస్తున్నాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే.. ఆ పొలాలకు వెళ్లేందుకు ఉపయోగించే మార్గాలను (యాక్సెస్ గేట్స్) కూడా త్వరలో మూసేసే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నాయి. చొరబాటుదారులకు ఆ పొలాలు మరుగు (కవర్)గా ఉపయోగపడే ప్రమాదం ఉన్న నేపథ్యంలోనే బీఎస్ఎఫ్ ఈ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. అయితే, అధికారులు ఈ ఆదేశాలను మౌఖికంగా జారీచేశారని పంజాబ్ సరిహద్దు ప్రాంత రైతు సంఘం ఉపాధ్యక్షుడు సుర్జిత్ సింగ్ తెలిపారు. ఇప్పటికే ఆ పొలాల్లో 80-90 శాతం మేర కోతలు పూర్తయ్యాయని, రెండు రోజుల వ్యవధిలో మిగిలిన కోతలు పూర్తిచేసి, పశువులకు అవసరమైన గడ్డి తీసుకెళ్లడం కష్టమేనని ఆయన పేర్కొన్నారు.


## మా 130 అణ్వస్త్రాలను
# మీకే గురి పెట్టాం

**» భారత్‌ను ఉద్దేశించి పాకిస్థాన్ మంత్రి హనీఫ్ అబ్బాసీ వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు మరింతగా ముదురుతున్నాయి. పాకిస్థాన్ నేతలు, సైన్యాధికారులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తూ.. అగ్నికి ఆజ్యం పోస్తున్నారు. లండన్‌లోని పాకిస్థాన్ హైకమిషన్ ఎదుట ఆందోళన చేస్తున్న భారత సంతతి ప్రజలను 'గొంతు కోసేస్తాం..' అంటూ సంజ్ఞలతో పాక్ సైనికాధికారి హెచ్చరించిన మర్నాడే పాకిస్థాన్ రైల్వే మంత్రి హనీఫ్ అబ్బాసీ మరింత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. "భారత్ సింధు నది నీటిని ఆపేస్తే పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధంగా ఉండాలి. పాకిస్థాన్ వద్ద ఉన్న అణ్వాయుధాలు, క్షిపణులు ఏదో ప్రదర్శన కోసం కాదు. వాటిని దాడికి సిద్ధంగా దేశవ్యాప్తంగా రహస్య ప్రదేశాల్లో దాచి ఉంచాం. పాకిస్థాన్ వద్ద ఉన్న 130 అణ్వాయుధాలు భారత్ వైపే గురిపెట్టి ఉన్నాయి" అని అబ్బాసీ హెచ్చరించారు. ఘోరీ, షహీన్, ఘజ్నవీ వంటి క్షిపణులు, అణ్వాయుధాలు అన్నీ భారత్ కోసమే సిద్ధం చేశామన్నారు. పహల్గాం ఉగ్రదాడి విషయంలో భారత్ తన భద్రతా వ్యవస్థల వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్‌పై నిందలు వేస్తోందని ఆరోపించారు. పాకిస్థాన్ విషయంలో చేపట్టిన చర్యల తీవ్ర పరిణామాలు ఏమిటో భారత్‌కు ఇప్పుడిప్పుడే తెలిసివస్తోందని.. అందుకే దాడికి వెనుకాడుతోందన్నారు. పాకిస్థాన్ గగనతలం మీదుగా భారత విమానాలు ప్రయాణించకుండా నిషేధించిన రెండు రోజులకే.. విమానయాన పరిశ్రమలో గగ్గోలు పుట్టిందని, మరో పది రోజులు ఇలాగే కొనసాగితే ఆ సంస్థలు నష్టాల్లో కూరుకుపోతాయని చెప్పారు. ఇక ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని భారత్ నిలిపివేయడంపై స్పందిస్తూ... ఇలాంటి వాటిని ఎదుర్కొవడానికి తాము సిద్ధంగానే ఉన్నామని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన చర్యలతో పాకిస్థాన్ అప్రమత్తమైంది. ఇప్పటికే వాణిజ్యం నిలిపివేతతో మొదలైన ఇబ్బందులను, యుద్ధ పరిస్థితులు ఏర్పడితే ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఆ దేశ త్రివిధ దళాలను అప్రమత్తం చేసింది. సిబ్బంది సెలవులను రద్దు చేసింది. అన్ని రైల్వే స్టేషన్లను ఆర్మీ ఆధీనంలోకి తెచ్చింది. అత్యవసర పరిస్థితి తలెత్తితే... యుద్ధ ట్యాంకులు, మిలటరీ పరికరాలు, ఆయుధాలు, సైన్యానికి అవసరమైన సరుకులు వంటివాటిని అప్పటికప్పుడు, వేగంగా రవాణా చేయడానికి ఈ చర్యలు చేపట్టినట్టు అబ్బాసీ పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో ఔషధాల కొరత ఏర్పడకుండా ఆ దేశం అత్యవసర చర్యలు చేపట్టింది. చైనా, రష్యా, ఇతర దేశాల నుంచి ఏపీఐలను దిగుమతి చేసుకునేందుకు పాక్ ప్రయత్నాలు ప్రారంభించింది.

## పాక్‌కు నీటిని ఆపడం
# సాధ్యమేనా?




(సెంట్రల్ డెస్క్)

సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్.. దాయాది దేశం పాకిస్థాన్‌కు పూర్తిస్థాయిలో జలాలు వెళ్లకుండా అడ్డుకోగలదా? ఆ నీటిని భారత్‌లోని ఇతర ప్రాంతాలకు మళ్లించగలదా? సింధు, దాని ఉపనదుల్లో 5,295.91 టీఎంసీల నీరు ఉంటుందని అంచనా. అంత మొత్తంలో నీటిని నిల్వ చేసుకోగలిగే డ్యాములను అనతి కాలంలో నిర్మించడం సాధ్యమవుతుందా? అదే జరిగితే.. ముంపునకు గురయ్యే ప్రాంతాలు లక్ష చదరపు కిలోమీటర్లుగా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితిని భారత్ ఎదుర్కోగలదా? సింధుజలాల అంశంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

**వేసవిలో నీటి ప్రవాహం**

సాధారణంగా వేసవి కాలంలో నదుల్లో నీటి నిల్వలు తగ్గుతాయి. కానీ, సింధు, దాని ఉపనదుల్లో మాత్రం ఎగువన మంచు కరగడం వల్ల జలకళ ఉట్టిపడుతుంది. 1960లో జరిగిన సింధుజలాల ఒప్పందం మేరకు.. సింధు, జీలం, చీనాబ్ నదుల నీటిలో సింహభాగం(80% -- 3496.64 టీఎంసీలు) పాకిస్థాన్‌కు.. మిగతా 20% భారత్‌కు దక్కుతాయి. రావి, బియాస్, సట్లెజ్ నదుల జలాలు(1,448.15 టీఎంసీలు) పూర్తిగా భారత్‌కు చెందుతాయి. ఈ ఒప్పందం ప్రకారం భారత్ నిర్మించే డ్యామ్‌లను పరిశీలించే అధికారం పాకిస్థాన్‌కు సింధు కమిషన్ దఖలుపరిచింది. ఇప్పటి వరకు సింధు, జీలం, చీనాబ్ నదులపై భారత్ జలవిద్యుత్తు ప్రాజెక్టులను నిర్మించినా.. వాటిని 'రన్-ఆఫ్-ద రివర్' కేటగిరీలో చూపించింది. అంటే.. ప్రాజెక్టులు ఉన్నంత మాత్రాన పాకిస్థాన్‌కు నీటి సరఫరా నిలిచిపోదు. అలాగని, ఈ ప్రాజెక్టుల కోసం నీటిని నిల్వ చేసుకునే వెసులుబాటు ఉండదు. ఇప్పుడు ఒప్పందాన్ని రద్దుచేసుకోవడం వల్ల.. ఇకపై భారత్ ఈ నదులపై నీటి నిల్వల కోసం ప్రాజెక్టులను చేపట్టే అవకాశాలుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికిప్పుడు ఈ ఒప్పందం రద్దుతో పాకిస్థాన్‌పై ప్రభావం పడకున్నా.. దీర్ఘకాలంలో ఇబ్బందులు తప్పవని వివరిస్తున్నారు. ప్రస్తుతం సింధు, జీలం, చీనాబ్‌పై భారత జలవిద్యుత్తు ప్రాజెక్టులున్నాయి. చీనాబ్‌పై బాగిల్‌హార్, దుల్‌హస్తి, సలాల్ డ్యాములు, జీలం ఉపనది అయిన కృష్ణగంగపై కృష్ణగంగ డ్యామ్, లద్దాఖ్‌లో సింధూనదిపై నిమూబజ్గో డ్యామ్ ఉన్నాయి. రావి నదిపై 1979 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆనకట్ట ప్రతిపాదన బాలారిష్టాలను దాటుకుని, 2001లో రంజిత్ సాగర్ డ్యామ్ పూర్తయింది. రాజస్థాన్-పంజాబ్‌ల మధ్య సయోధ్య కుదరక షాపూర్‌కంది బ్యారేజీ నిర్మాణం మాత్రం నిలిచిపోయింది. 2018లో కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించి, నిర్మాణాన్ని పూర్తిచేసింది. ఆదివారం నుంచి ఈ డ్యామ్ ద్వారా దిగువకు(సింధుకు) నీటి విడుదలను ఆపివేస్తారని సమాచారం. ఈ నీటిని జమ్మూకశ్మీర్‌లోని కఠువా, సాంబా జిల్లాలకు మళ్లించి, 32వేల హెక్టార్లకు సాగునీరందిస్తారని తెలుస్తోంది. నిజానికి భారత్ సింధూ, దాని ఉపనదుల ద్వారా 18,653 మెగావాట్ల మేర విద్యుత్తును ఉత్పత్తి చేయగలిగే ప్రాజెక్టులను నిర్మించవచ్చు. ప్రస్తుతం 3,034 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుండగా.. మరో 2,526 మెగావాట్ల సామర్థ్యమున్న ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. మరో 5,846 మెగావాట్ల ప్రతిపాదిత ప్రాజెక్టులు ప్రణాళిక దశలో ఉన్నాయి. సింధు ఒప్పందం నిలిపివేతతో.. ఇప్పుడు ఈ ప్రాజెక్టులను భారత్ వేగంగా నిర్మించే అవకాశాలుంటాయి.



1960లో సింధూ జలాల ఒప్పందంపై సంతకం చేస్తున్న అప్పటి భారత ప్రధాని నెహ్రూ, పాక్ ప్రధాని ఆయూబ్ ఖాన్


**పాకిస్థాన్‌కు భారీ నష్టం**

పాకిస్థాన్‌లో ఉన్న ఆనకట్టల్లో భారీ నీటి నిల్వలకు అవకాశాల్లేవు. భారత్ వదిలే నీటి ద్వారానే అక్కడి(పశ్చిమ పంజాబ్, సింధ్ ప్రావిన్సులు) వ్యవసాయం సాగుతోంది. పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే ఆహార ధాన్యాల్లో ఈ రెండు ప్రావిన్సుల వాటా 80% ఉంటుందని అంచనా. పాకిస్థాన్ జీడీపీలో ఈ ప్రావిన్సుల వాటా 25శాతంగా ఉంటుంది. ఈ రెండు ప్రావిన్సుల్లోని 16 లక్షల హెక్టార్ల సాగుభూమికి సింధునది జీవనాడి వంటిది. ఈ ప్రాంతంలోని పరిశ్రమలు, జలవిద్యుదుత్పత్తిని కలుపుకొంటే.. పాక్ జీడీపీలో వాటా 35% ఉంటుందని అంచనా. రెండేళ్ల క్రితం వరదలతో ఈ ప్రాంతంలో పంటలు దెబ్బతినగా.. ఆ దేశంలో గోధుమ పిండి కోసం ప్రజలు ఘర్షణలు పడ్డ విషయం తెలిసిందే.! భారత్ ఇప్పుడు నీటిని నిలిపివేస్తే పాకిస్థాన్‌కు కోలుకోలేని దెబ్బ తగులుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**100% నీటిని ఆపడం అసాధ్యమే**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రాజెక్టుల ద్వారా పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని 10-15% వరకు నిలువరించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే.. దీర్ఘకాలంలో ప్రాజెక్టులను నిర్మిస్తే.. సింధు, దాని ఉపనదుల జలాలను పూర్తిగా భారత్‌లోకే మళ్లించే అవకాశాలున్నాయంటున్నారు. ఈ క్రమంలో కేవలం ఆనకట్టలను నిర్మిస్తే సరిపోదని, నదులను మళ్లించేందుకు భారీ సొరంగాలను తవ్వాల్సి ఉంటుందని గుర్తుచేస్తున్నారు. లద్దాఖ్ లాంటి ప్రాంతాల్లో పర్వతాలు, లోయలతో కఠినమైన వాతావరణం ఉంటుందని, ఈ ప్రాంతాల్లో సొరంగాల తవ్వకం ఖర్చుతో కూడినదే కాకుండా, నిర్మాణానికి చాలా సమయం తీసుకునే అవకాశం ఉంటుందని వివరిస్తున్నారు. పైగా ఈప్రాంతం భూకంప జోన్-5లో ఉందని, భారీ భూకంపాలకు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. మే-సెప్టెంబరు మధ్య కాలంలో హిమాలయాల్లో మంచు కరిగి, చీనాబ్, జీలం నదుల్లో వేల కోట్ల క్యూబిక్ మీటర్ల నీరు ప్రవహిస్తుందని, ఈప్రవాహాన్ని ఆపడం అంత సులభం కాదని అంటున్నారు. భారీ ఆనకట్టలను నిర్మిస్తే.. సుమారు లక్ష చదరపు కిలోమీటర్ల భూమి ముంపునకు గురవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లో ఉన్న తెహ్రీ డ్యామ్ మాదిరి 30 దాకా భారీ ఆనకట్టలను నిర్మించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇందుకు 10 ఏళ్ల సమయం పట్టవచ్చంటున్నారు.

## లోకం తీరు




## 22 గంటలు ట్రెక్కింగ్ చేసొచ్చి ఘాతుకం!

**కొండలు, గుట్టల్లో నడిచివచ్చి పర్యాటకులను చంపిన ఉగ్రవాదులు**

పహల్గాం, ఏప్రిల్ 27: పహల్గాం దాడిపై జరుగుతున్న దర్యాప్తులో కీలక విషయాలు బయటికొస్తున్నాయి. ఉగ్రవాదులు పహల్గాం చేరుకునేందుకు 20 నుంచి 22 గంటలపాటు ట్రెక్కింగ్ చేసినట్టు సమాచారం. ఉగ్రవాదులు తమ ప్రణాళికను అమలు చేసేందుకు కోకెర్నాగ్ అడవి నుంచి బైసరన్ లోయ వరకు కాలినడకన వచ్చినట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అంతేకాక, దాడి సమయంలో ఉగ్రవాదులు రెండు సెల్‌ఫోన్లు కూడా చోరీ చేసినట్టు తెలిసింది. ఇందులో ఒకటి స్థానికుడిది కాగా మరొకటి పర్యాటకునిది. ఇక, స్థానిక ఉగ్రవాది అదీల్ థోకర్, ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు మొత్తం నలుగురు ఈ దాడిలో పాల్గొన్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాదులు ఏకే47, ఎం4 ఎసాల్ట్ రైఫిల్‌లతో మారణహోమానికి పాల్పడినట్టు ఫోరెన్సిక్ విశ్లేషణలో తేలింది.

### పహల్గాం ఉగ్రదాడిని.. చిత్రీకరించిన వీడియోగ్రాఫర్

**» చెట్టు పై నక్కి రికార్డింగ్**

జమ్మూ, ఏప్రిల్ 27: పహల్గాంలోని బైసారన్‌లో జరిగిన ఉగ్రదాడిపై విచారణ జరుపుతున్న జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు కీలక ఆధారం లభించింది. నలుగురు ఉగ్రవాదులు రెండు జట్లుగా విడిపోయి, చేసిన మారణకాండను ఓ 'రీల్స్ వీడియోగ్రాఫర్' సొంతం చిత్రీకరించారు. తూటాల శబ్దం వినబడగానే ఆ వీడియోగ్రాఫర్ తొలుత ప్రాణభయంతో చెట్టుపైకెక్కారు. అక్కడే నక్కి.. ఉగ్రదాడిని చిత్రీకరించారు. ఇప్పుడు ఎన్ఐఏ దర్యాప్తులో ఈ వీడియో కీలకమైన సాక్ష్యంగా మారింది. ఉగ్రవాదులకు స్థానికంగా సహకరించిందెవరు? అనే అంశంపైనా ఓ స్పష్టత వస్తుందని ఎన్ఐఏ భావిస్తోంది. వీడియోలో ఉన్నదాన్ని బట్టి.. "నలుగురు ఉగ్రవాదులు రెండుగా విడిపోయారు. తొలుత ఇద్దరు బైసారన్ లోయ వైపు పర్యాటకుల వద్దకు వచ్చి, కాల్పులు మొదలు పెట్టారు. నలుగురు పర్యాటకుల తలలపై అతి సమీపం నుంచి(పాయింట్ బ్లాంక్ రేంజ్) కాల్పులు జరిపారు. ఆ శబ్దం రాగానే, ఓ దుకాణం వెనక నక్కిన మిగతా ఇద్దరు ఉగ్రవాదులు మరోవైపు నుంచి పర్యాటకుల వైపు కదిలారు" అని ఓ దర్యాప్తు అధికారి వివరించారు.

### సుసాధ్యం చేయొచ్చు?

ప్రస్తుతం భారతీయ సైన్యానికి చెందిన ఇంజనీరింగ్ విభాగం అధునాతన సాంకేతికతను కలిగి ఉంది. కొవిడ్-19 కాలంలో ఢిల్లీలో తాత్కాలికంగా వెయ్యి పడకల భారీ ఆస్పత్రిని 12 రోజుల వ్యవధిలో నిర్మించింది. డీఆర్‌డీవో వంటి సంస్థలు, ఆర్మీ ఇంజనీరింగ్ సంయుక్తంగా సరిహద్దుల్లో అతి తక్కువ సమయంలో వనరుల కల్పన విషయంలో ఇప్పటికే ఎన్నో అసాధ్యాలను సుసాధ్యం చేసి చూపించాయి. హిమాలయ రాష్ట్రాల్లో భారీ టన్నెల్స్‌ను నిర్మించి.. రహదారులను మెరుగుపరిచాయి. అటల్ టన్నెల్ ఇందుకు గొప్ప ఉదాహరణ. సింధు, దాని ఉపనదుల వద్ద మట్టి పరీక్షలు నిర్వహించి, వెనువెంటనే సంప్రదాయ పద్ధతులతోపాటు.. ప్రీకాస్ట్/ప్రీ ఫ్యాబ్రికేటెడ్ పద్ధతుల్లో డ్యామ్‌లను నిర్మించడం.. పర్వతాల మధ్య లోయ ప్రాంతాల్లో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమేనని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న డ్యామ్‌లను నీటిని నిల్వకు అనుగుణంగా అభివృద్ధి చేయడం పెద్ద కష్టమైన పని కాదని, దీన్ని తక్కువ సమయంలో పూర్తిచేయవచ్చని అభిప్రాయపడుతున్నారు.

### జల విధ్వంసంపై పాక్‌కు భయం!

ఇప్పటికిప్పుడు నదీజలాలను భారత్ ఒడిసిపట్టలేకున్నా.. డ్యామ్‌లను ఒక్కసారిగా తెరిచి, జల విధ్వంసానికి ప్రయత్నించే ప్రమాదముందని పాకిస్థాన్ పర్యావరణ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే శనివారం చీనాబ్ నది నుంచి ఎలాంటి హెచ్చరికల్లేకుండా నీటిని వదిలారని, దాంతో ముజఫరాబాద్‌లో నీటి ఎమర్జెన్సీని ప్రకటించాల్సి వచ్చిందని పాకిస్థానీ పత్రిక 'డాన్' తన వెబ్‌సైట్‌లో ఓ కథనాన్ని ప్రచురించింది. నదీ పరీవాహకంలో ఉన్న ప్రజలు ఆందోళనకు గురయ్యారని పేర్కొంటూ.. వరద వీడియోలను షేర్ చేసింది. సింధు, జీలం నదుల విషయంలోనూ ఇలాంటి సంఘటనలు జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. 1960 నాటి ఒప్పందం ప్రకారం వరద విషయంలో పాకిస్థాన్‌కు ముందస్తు హెచ్చరికలు చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆ ఒప్పందం రద్దుకావడంతో భారత్‌కు హెచ్చరికలు చేయాల్సిన బాధ్యత ఉండదని పేర్కొంది.

## తమిళనాడులో ఇద్దరు మంత్రులు అవుట్

### సెంథిల్ బాలాజీ, పొన్ముడి రాజీనామా

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలు, వివాదాస్పద వ్యాఖ్యలతో న్యాయస్థానాల మొట్టికాయలు తిన్న ఇద్దరు తమిళనాడు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. విద్యుత్, ఎక్సైజ్ శాఖల మంత్రి వి.సెంథిల్ బాలాజీ, అటవీ మంత్రి కె.పొన్ముడి ఆదివారం తమ రాజీనామా లేఖలను ముఖ్యమంత్రి స్టాలిన్‌కు పంపించారు. వారి వ్యవహారం తన ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టే సూచనలు కనిపిస్తుండడంతో పదవుల నుంచి తప్పుకోవాలని ముఖ్యమంత్రే వారిని ఆదేశించినట్లు సమాచారం. ఆయన సిఫారసుతో వారి రాజీనామాలను గవర్నర్ ఆర్ఎన్ రవి తక్షణమే ఆమోదించారు. డీఎంకే సీనియర్ నేత, పద్మనాభపురం ఎమ్మెల్యే మనో తంగరాజ్‌ను కొత్తగా మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ఆయన అంగీకరించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు తంగరాజ్‌తో గవర్నర్ ప్రమాణం చేయించనున్నట్లు రాజ్‌భవన్ ప్రకటించింది. సెంథిల్ బాలాజీ నిర్వహించిన విద్యుత్ శాఖను రవాణా మంత్రి ఎస్ఎస్ శివశంకర్‌కు.. ఎక్సైజ్ శాఖను గృహనిర్మాణ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామికి, పొన్ముడి అటవీశాఖను డెయిరీ శాఖ మంత్రి ఆర్ఎస్ రాజకన్నప్పన్‌కు అదనంగా అప్పగించారు. కాగా, కరూర్ ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీ గతంలో జయలలిత, పన్నీర్‌సెల్వం కేబినెట్‌లలో పనిచేశారు. ఆ సమయంలో ఉద్యోగాలిప్పిస్తానంటూ పలువురిని మోసం చేశారని కేసులు నమోదయ్యాయి. తర్వాత డీఎంకేలో చేరిన ఆయన.. స్టాలిన్ మంత్రివర్గంలో చోటు సంపాదించారు. గతంలో జరిగిన లావాదేవీలకు సంబంధించి ఆయనపై ఈడీ 2023 జూన్‌లో అరెస్టు చేసింది. గత సెప్టెంబరు 26వ తేదీన సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంతో బయటకు వచ్చిన ఆయన్ను.. రెండ్రోజులకే మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల సుప్రీంకోర్టు సెంథిల్ బాలాజీ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. తాము అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని స్వేచ్ఛ కల్పిస్తే.. అంత హడావుడిగా మంత్రి పదవి చేపట్టాల్సిన అవసరమేమొచ్చిందని నిలదీసింది. మంత్రి పదవి కావాలో, బెయిల్ కావాలో ఈ నెల 28వ తేదీలోగా తేల్చుకోవాలని అల్టిమేటం జారీ చేసింది. సోమవారం సుప్రీంకోర్టుకు వివరణ ఇవ్వాల్సి ఉన్న నేపథ్యంలో పదవికి రాజీనామా చేశారు.

## కేంద్రంపై 1.50 లక్షల కోర్టు ధిక్కరణ కేసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: కేంద్ర ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ కేసులు పెరిగిపోతుండడంపై న్యాయశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని నివారించాలంటే సకాలంలో కోర్టు ఉత్తర్వులపై స్పందించాల్సి ఉంటుందని తెలిపింది. దేశంలోని వివిధ కోర్టుల్లో కేంద్రంపై సుమారు 1.50 లక్షల కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలంటూ అన్ని మంత్రిత్వ శాఖలకు లేఖ రాసింది. వివిధ శాఖల్లో కోర్టు వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న అధికారులకు న్యాయ విద్యలో తగిన అర్హతలు లేకపోవడమే ఇందుకు కారణమని అభిప్రాయపడింది.

## లోన్‌యాప్ ద్వారా మోసాలు


- తొమ్మిది మంది అరెస్టు.. రూ.60 లక్షల క్రిప్టో కరెన్సీ ఫ్రీజ్

విశాఖపట్నం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టెంట్ లోన్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ల్యాప్‌టాప్, 18 మొబైల్ ఫోన్లు, 54 సిమ్‌కార్డులు, 15 స్టాంప్ ప్యాడ్‌లు స్వాధీనం చేసుకున్నారు. రూ.60 లక్షల విలువైన క్రిప్టో కరెన్సీని ఫ్రీజ్ చేశారు. ఈ కేసు వివరాలను సీపీ శంఖబ్రత బాగ్చి వెల్లడించారు. నగరంలోని మహారాణిపేటకు చెందిన ఒకవ్యక్తి క్యాష్‌మాక్స్ అనే ఇన్‌స్టెంట్ లోన్‌యాప్ వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి బిహార్, రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, కేరళ, అసోం తదితర రాష్ట్రాలకు చెందిన బ్యాంకు ఖాతాలకు మృతుడి భార్య డిపాజిట్ చేసిన సొమ్ము జమైందని గుర్తించారు. నేరస్థుల్లో భరత్ సాంబ అనే వ్యక్తితోపాటు మరో 8మందిని అదుపులోకి తీసుకుని విచారించారు. మొత్తంగా సాంబ ఓపెన్ చేయించిన 132ఖాతాలను పరిశీలించగా వాటిపై 1,500 ఫిర్యాదులు అందాయని, మొత్తం రూ.200 కోట్ల లావాదేవీలు జరిగినట్టు తేలిందని చెప్పారు. అన్ని ఖాతాల్లో పడిన మొత్తం డబ్బు చైనీస్ కంపెనీలకు చేరుతున్నట్టు గుర్తించామని సీపీ తెలిపారు.

## మొగల్, ఢిల్లీ సుల్తానుల

# చరిత్ర మాయం

### 7వ తరగతి సాంఘిక శాస్త్ర పుస్తకంలో పూర్తిగా తొలగించిన ఎన్‌సీఈఆర్టీ




- మగధ, మౌర్యులు, శాతవాహనులు వంటి సామ్రాజ్యాలపై పాఠ్యాంశాల చేర్పు
- మహాకుంభమేళా గురించి ప్రస్తావన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఎన్‌సీఈఆర్టీ 7వ తరగతి కొత్త సాంఘిక శాస్త్ర పుస్తకంలో మొగల్స్, ఢిల్లీ సుల్తానుల చరిత్ర పాఠ్యాంశాలను పూర్తిగా తొలగించారు. వాటి స్థానంలో ప్రాచీన భారతీయ రాజవంశాలైన మగధ, మౌర్యులు, శాతవాహనులు, శుంగలు వంటి రాజ్యాలపై కొత్త చాప్టర్లను ప్రవేశపెట్టారు. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)-2020, నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్)-2023లో భాగంగా ఈ కొత్త పుస్తకాలను రూపొందించారు. 'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్, పార్ట్-1' పేరుతో ఉన్న ఈ కొత్త సాంఘిక శాస్త్ర పుస్తకంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల జరిగిన మహా కుంభమేళాతో పాటు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలైన మేకిన్ ఇండియా, బేటీ బచావో-బేటీ పడావో వంటి అంశాల గురించి ప్రస్తావించారు. 'భూమి పవిత్రంగా ఎలా మారుతుంది' అనే చాప్టర్ భారత్‌తో పాటు బయటి ప్రాంతాల్లో అన్ని మతాలు పవిత్రంగా పరిగణించే ప్రదేశాలు, తీర్థయాత్రలపై దృష్టిపెట్టింది. ఇందులో 12 జ్యోతిర్లింగాలు, చార్‌దామ్ యాత్ర, శక్తిపీఠాలతో కూడిన పవిత్ర భౌగోళిక ప్రాంతాల వివరాలను చేర్చారు. అదేవిధంగా వివిధ చాప్టర్లలో జానపద, సమ్రాజ్, అధిరాజా, రాజాధిరాజా అనే సంస్కృతం పదాలను జోడించారు. ఇంకా గ్రీకులపై కూడా వివరణాత్మక విభాగాలు అందించారు. గత ఏడాది 3, 6వ తరగతులకు కొత్త పుస్తకాలను ప్రవేశపెట్టిన ఎన్‌సీఈఆర్టీ.. ఈ ఏడాది 4, 7వ తరగతులకు అప్‌డేటెడ్ వెర్షన్ల పుస్తకాలను తీసుకువచ్చింది. 7వ తరగతి సాంఘిక శాస్త్రం పార్ట్-2 పుస్తకాన్ని కూడా త్వరలో విడుదల చేస్తామని ఎన్‌సీఈఆర్టీ అధికారి ఒకరు చెప్పారు. అయితే తొలగించిన పాఠ్యాంశాలను రెండో పార్టులో చేరుస్తారా? అనే ప్రశ్నకు మాత్రం స్పందించలేదు. కాగా, ఎన్‌సీఈఆర్టీ అంతకుముందు సిలబస్ హేతుబద్ధీకరణలో భాగంగా 2022-23లో మొగల్స్, ఢిల్లీ సుల్తానులకు సంబంధించిన సెక్షన్లను కొంత మేర తగ్గించారు. వారి విజయాలకు సంబంధించిన రెండు పేజీల టేబుల్‌తో పాటు తుగ్లక్‌లు, ఖిల్జీలు, లోడీల రాజ్యాల వివరాలకు కోత పెట్టారు. ఇప్పుడు కొత్త పుస్తకంలో వారికి సంబంధించిన అన్ని వివరాలను పూర్తిగా తొలగించారు. 7వ తరగతి కొత్త సోషల్ సైన్సెస్ పుస్తకం ముందుమాటలో 'ఈ పుస్తకంలోని అంశాలు మన విద్యార్థులు అభివృద్ధి చేయాలని కోరుకునే విలువలను ఏకీకృతం చేస్తాయి. భారతీయ సంస్కృతి లోతుల్లోకి వెళ్లాయి. వయసుకు తగినట్లుగా ప్రపంచ దృక్పథాలను పరిచయం చేస్తాయి' అని ఎన్‌సీఈఆర్టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లాని రాశారు.

## 'త్రీ ఇడియట్స్' పాఠశాలకు ఎట్టకేలకు సీబీఎస్ఈ గుర్తింపు


న్యూఢిల్లీ, ఏప్రిల్27: త్రీ ఇడియట్స్ సినిమాతో ప్రసిద్ధి చెందిన లడఖ్‌లోని పాఠశాలకు ఎట్టకేలకు సీబీఎస్ఈ గుర్తింపు లభించింది. రాంచో పాఠశాలగా స్థానికులు పిలిచే ఈ పాఠశాల 2009లో బాలీవుడ్ హీరో ఆమిర్‌ఖాన్ నటించిన 'త్రీ ఇడియట్స్' సినిమాతో బాగా ప్రసిద్ధి చెందింది. ఇప్పటివరకు జమ్ము, కశ్మీర్ పాఠశాలవిద్య బోర్డుకు అనుబంధంగా ఉంది. సంప్రదాయ బట్టీ చదువులకు భిన్నంగా వినూత్న విధానాలతో ఇక్కడ బోధన సాగుతుంది. నూతన జాతీయ విద్యా విధానంలో ప్రతిపాదించిన సంస్కరణలను ఈ పాఠశాల ముందే అనుసరిస్తుండడం గమనార్హం. 24ఏళ్లు నిండిన ఈ పాఠశాలకు 15వ శతాబ్దానికి చెందిన ప్రముఖ పండితుడు విఫామ్ పెమా కార్పో పేరు పెట్టారు.

## 22 నాటి ఆర్ఆర్‌బీ సెషన్-2 పరీక్ష రద్దు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు ఈ నెల 22న రెండో సెషన్‌లో నిర్వహించిన ఆర్ఆర్‌బీ జేఈ సీబీటీ-2 పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాయి. అదేరోజు తొలి సెషన్‌లో నిర్వహించిన పరీక్షలో వచ్చిన పలు ప్రశ్నలు రెండో సెషన్‌లోనూ వచ్చినట్లు గుర్తించారు. సాఫ్ట్‌వేర్ సమస్యల కారణంగా ఈ పొరపాటు జరిగిందని నిర్ధారించారు. ఈమేరకు రెండో సెషన్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు, తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటించనున్నట్లు ఆర్ఆర్‌బీలు పేర్కొన్నాయి. 22న పరీక్షకు హాజరైన అభ్యర్థులు ఈ సమాచారం కోసం ఆర్ఆర్‌బీలఅధికారిక వెబ్‌సైట్‌లు చూడాలని సూచించాయి.

## విచారణకు రాలేను.. మరో తేదీ ఇవ్వండి

- ఈడీకి సినీ హీరో మహేశ్ బాబు లేఖ



హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): షూటింగ్‌లో బిజీగా ఉన్నందున సోమవారం విచారణకు రాలేనని సినీ హీరో మహేశ్‌బాబు ఈడీ అధికారులకు లేఖ పంపారు. ముందే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం తాను సినిమా షూటింగ్‌లో ఉన్నానని.. విచారణకు మరో తేదీ ఇవ్వాలని కోరారు. మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సురానా గ్రూప్, సాయి సూర్య డెవలపర్స్ సంస్థలకు సంబంధించిన ప్రకటనల్లో మహేశ్ నటించారు. సాయి సూర్య డెవలపర్స్ ప్రకటనల్లో నటించినందుకు మహేశ్ బాబుకు రూ.5.9 కోట్లు పారితోషికం చెల్లించారు. అందులో రూ.2.5 కోట్లు నగదు రూపంలో ఇచ్చారు. ఇటీవల జరిగిన ఈడీ సోదాల్లో ఈ విషయం వెల్లడికావడంతో మహేశ్‌బాబు 28న విచారణకు రావాలని ఈడీ నోటీసు జారీ చేసింది.

## 'సెల్'లో బందీలైతే మెదడు మొద్దుబారుతుంది

- తాజా సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: జీవితాన్ని ఎంతో సులభతరం చేసి, సమయాన్ని ఆదా చేస్తున్న సెల్‌ఫోన్లతో లాభం ఎంతుందో నష్టం కూడా అంతకన్నా ఎక్కువగా ఉందని సర్వేలు హెచ్చరిస్తున్నాయి. పిల్లలైతే సెల్‌ఫోన్‌లో బందీలవుతున్నారు. స్క్రీన్‌లను విడిచిపెట్టడం లేదు. దీంతో నిద్రలేమి, కుంగుబాటు వంటి తీవ్ర సమస్యలు తలెత్తుతాయని ఇప్పటికే రుజువైంది. ఇది మానవ మేధోశక్తిపైనా ప్రభావం చూపుతుందని, ఫలితంగా ఐక్యూ స్థాయి తగ్గిపోతుందని మిషిగాన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన 'మానిటరింగ్ ది ఫ్యూచర్' సర్వేలో వెల్లడైంది. సర్వే సమాచారాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ ప్రచురించింది. స్క్రీన్ టైం అధికమైతే టీనేజర్లు, యువకుల్లో వివేచన సామర్థ్యం తగ్గుతున్నట్టు తేలింది. ఏకాగ్రత లోపించడం, జ్ఞాపకశక్తి మందగించడం, ప్రాథమిక స్థాయి తార్కిక శక్తి లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. మెదడు పనితీరులోనే మార్పులున్నట్టు గుర్తించారు. గతంలో పిల్లలు, టీనేజర్లు పుస్తకాలు, చిన్న కథలు చదివేవారు. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వచ్చాక పుస్తక పఠనంపై ఆసక్తి కనబరిచేవారే లేరు. అమెరికాలో జరిగిన సర్వే ప్రకారం 2012లో 45శాతం మందికి పుస్తక పఠనం అలవాటుగా ఉండేది. 2021 నాటికి అది 38 శాతానికి పడిపోయింది. ప్రతిదీ ఒక క్లిక్, స్వైప్ ద్వారా లభిస్తుండడంతో దేన్నీ గుర్తించుకోవాల్సిన అవసరం లేకపోయింది. దాంతో స్పష్టంగా ఆలోచించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారు.

## మేఘాలను ప్రేరేపించి.. మెరుపులు పుట్టించే డ్రోన్!

- జపాన్ ఇంజనీర్ల ఘనత
- పుట్టే మెరుపు నుంచి విద్యుచ్ఛక్తిని ఒడిసిపట్టేందుకు ప్రయోగాలు



టోక్యో, ఏప్రిల్ 27: తివిరి ఇసుమున తైలము తీయవచ్చో లేదో గానీ.. 'ఒడిసి మెరుపున విద్యుత్తు లాగుతాము' అంటున్నారు జపాన్ ఇంజనీర్లు! రుణావేశిత (నెగెటివ్ చార్జ్) మేఘాలు భూమివైపు ఆకర్షితమై విద్యుత్‌శక్తిని విడుదల చేయడం వల్ల మెరుపులు పుడతాయి. వీటి వల్ల ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా 24 వేల మంది చనిపోతున్నట్టు అంచనా. అంతకు పది రెట్ల మంది గాయపడుతున్నారు. పెద్ద ఎత్తున ఆస్తినష్టం సంభవిస్తోంది. కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతింటుంటాయి. అందుకే ఎత్తైన భవనాలు, నిర్మాణాల్లో.. పిడుగుపాటును తట్టుకునే కండక్టర్లను ఏర్పాటు చేస్తారు. అలాంటివి ఏర్పాటు చేయలేని క్రీడా మైదానాల వంటి చోట్ల పిడుగుపడితే? అలాంటి పిడుగుల వల్ల జపాన్‌లో ఏటా రూ.6-11 వేల కోట్ల దాకా ఆస్తినష్టం సంభవిస్తోంది. దీంతో "అలాంటి చోట్ల మేఘాలు విద్యుత్‌శక్తిని విడుదల చేసేదాకా ఆగడం? నష్టపోవడం దేనికి? రుణావేశిత మేఘాలు మోహరించినప్పుడు.. మెరుపులు పుట్టేలా ప్రేరేపించి.. అప్పుడు జనించే మెరుపును మనకు కావాల్సిన మార్గంలోకి మళ్లించి విద్యుత్తు లాగేద్దాం" అని జపాన్‌కు చెందిన 'నిహోన్ టెలిగ్రాఫ్ అండ్ టెలిఫోన్ కార్పొరేషన్ (ఎన్‌టీటీ) ఇంజనీర్లు అనుకున్నారు. ఆ దిశగా తీవ్ర పరిశోధనలు చేసి ఓ డ్రోన్‌ను రూపొందించారు. అది మేఘాలకు సమీపంలోకి వెళ్లి రుణావేశిత మేఘాలను గుర్తించి, విద్యుత్తు క్షేత్రాల్లో హెచ్చుతగ్గులు సృష్టించడం ద్వారా ఆ మేఘం విద్యుత్‌శక్తిని విడుదల చేసేలా (మెరుపును పుట్టించేలా) చేస్తుంది. 2024 డిసెంబరు 13న ఒక డ్రోన్ సాయంతో భూమి నుంచి 984అడుగుల ఎత్తున ఒక మేఘాన్ని ప్రేరేపించి మెరుపు పుట్టేలా చేశారు. ఈ పరిజ్ఞానాన్ని మరింత అభివృద్ధి చేసి.. మెరుపు నుంచి విద్యుత్ శక్తిని ఒడిసిపట్టేలా కృషి చేస్తున్నట్టు ఎన్‌టీటీ ఇంజనీర్లు తెలిపారు.



విరాళాల చెక్‌లను అందుకుంటున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

## ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.2 కోట్ల విరాళం

తిరుమల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు ఆదివారం రూ.2 కోట్లు విరాళంగా అందింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద ప్రకటించిన రూ.1.50 కోట్ల చెక్‌ను ఆ సంస్థ జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్, రీజనల్ హెడ్ వెంకటేశ్వర్లు తిరుమలలో అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. అలాగే చెన్నైకి చెందిన పాన్‌ప్యూర్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఎండీ పొన్నుస్వామి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యప్రకాశ్ రూ.50 లక్షల చెక్‌ను అదనపు ఈవోకు అందజేశారు.

## శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులతోపాటు వారాంతం కావడంతో ఎక్కడ చూసినా గుంపులుగా భక్తులు కనిపిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచే రద్దీ పెరిగింది. ఆదివారం వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లతోపాటు నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు వేచి ఉన్నారు. వీరికి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. ఇక స్లాటెడ్ టికెట్లు, టోకెన్లు ఉన్నవారికి మూడు నుంచి నాలుగు గంటల సమయం తర్వాత దర్శనం లభిస్తోంది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూ కౌంటర్, అన్నప్రసాద భవనం, బస్టాండ్ ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. వసతి గదులకు డిమాండ్ కొనసాగుతోంది. గదులు లభించని భక్తులు షెడ్లు, యాత్రికుల వసతి సముదాయాలు, పార్కులు, కార్యాలయాల ముందు నేలమీదే సేదతీరుతున్నారు.

## 1 నుంచి జూలై 15 వరకు.. వీఐపీ సిఫారసు బ్రేక్ దర్శనాల రద్దు

- బ్రేక్ దర్శనాల సమయంలోనూ మార్పులు

తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో మే నెల 1 నుంచి జూలై 15వ తేదీ వరకు సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్టు టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని స్పష్టం చేసింది. ఇక, వీఐపీ బ్రేక్ దర్శన సమయం మార్పు కూడా మే 1వ తేదీ నుంచి అమలుచేయనున్నారు. ప్రస్తుతం వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 8 గంటల నుంచి మొదలవుతున్న విషయం తెలిసిందే. అయితే గతంలో మాదిరిగా మొదటి గంట తర్వాత ఉదయం 6 గంటలకు బ్రేక్ దర్శనాలను ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు.

## జర్మనీలో గిద్దలూరు విద్యార్థిని మృతి



గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం జర్మనీ వెళ్లి అనారోగ్యంతో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన విద్యార్థిని మృతి చెందింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం మేరకు గిద్దలూరు మండలం కంచిపల్లె గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు షేక్ మహబూబ్ బాషా కుమార్తె రెహనాబేగం (27) బయో మెడికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసేందుకు 2022లో జర్మనీకి వెళ్లింది. అక్కడి ఆల్ పట్టణంలో విద్యను అభ్యసిస్తోంది. సంవత్సరం నుంచి రెహనాబేగం బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్టు ఆమె తండ్రి తెలిపారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆమె గత సోమవారం మృతి చెందింది. మృతదేహం ఆదివారం హైదరాబాద్‌కు చేరుకుంది. సోమవారం కంచిపల్లె గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు తెలిపారు.

## ఆ కుటుంబాలకు

# 30 లక్షల పరిహారం

### పూర్తి పునరావాసం కల్పించండి.. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలి

- 'మాన్యువల్ స్కావెంజింగ్' మృతుల విషయంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు
- 1993 నుంచి మరణించిన కార్మికుల వివరాలు సేకరించాలని ప్రభుత్వానికి ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మాన్యువల్ స్కావెంజింగ్‌తో పాటు మురుగు డ్రెయిన్లు శుభ్రం చేస్తూ మరణించిన పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు పరిహారం, పునరావాసంపై హైకోర్టు కీలక ఉత్తర్వులిచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా బాధిత కుటుంబాలకు రూ.30 లక్షల పరిహారంతో పాటు పూర్తి పునరావాసం కల్పించాలని స్పష్టం చేసింది. పునరావాసంలో భాగంగా బాధిత కుటుంబసభ్యుడికి ఉద్యోగ భద్రత, పిల్లలకు విద్యా సదుపాయాలు, నైపుణ్య శిక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రస్తుత కేసులో మృతుడు మాణిక్యాలరావు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేసేవాడని, మ్యాన్‌హోల్ శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తూ అందులో పడి మృతి చెందాడని గుర్తు చేసింది. ఈ ఘటనను కార్పొరేషన్ ప్రమాదవశాత్తుగా జరిగిందని పేర్కొంటూ రూ.10 లక్షల పరిహారం చెల్లించిందని, అయితే సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా మిగతా రూ.20 లక్షలు ఒక నెలలో మాణిక్యాలరావు భార్యకు చెల్లించాలని ఆదేశించింది. బాధితుడి భార్యకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించినట్లు కార్పొరేషన్ చెప్పిందని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఆమెకు ఉద్యోగ భద్రత ఉన్న కొలువు ఇవ్వడంతో పాటు పూర్తి పునరావాసం కల్పించాలని సీఎస్‌కు స్పష్టం చేసింది. రెండు నెలల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించింది.

### ఒక్క కుటుంబానికే పరిమితం చేయొద్దు

రూ.30 లక్షల పరిహారం చెల్లింపు ఒక్క మాణిక్యాలరావు కుటుంబానికే పరిమితం చేయకుండా మురుగు డ్రెయిన్లు శుభ్రం చేస్తూ ప్రాణాలు కోల్పోయిన వారందరి కుటుంబాలకు చెల్లించాల్సిన అవసరం ఉందని హైకోర్టు పేర్కొంది. 1993 నుండి ఇప్పటివరకు మాన్యువల్ స్కావెంజింగ్ చేస్తూ మరణించిన కార్మికుల వివరాలను సంబంధిత కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, స్థానిక సంస్థలు, కార్మిక సంఘాల నుండి సేకరించాలని పురపాలక శాఖ కమిషనర్‌ను ఆదేశించింది. మాన్యువల్ స్కావెంజింగ్ మరణాలకు బాధ్యులైన అధికారులను గుర్తించి వారి సర్వీసు రికార్డులో నమోదు చేసి, ప్రమోషన్ అర్హత కోల్పోయేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల విషయంలో సంబంధిత కాంట్రాక్టర్‌ను గుర్తించి, వారి నుంచే పరిహారం వసూలు చేయాలని పేర్కొంది. ఈ కేసులో ఇతర అంశాలపై లోతైన విచారణ జరిపేందుకు తదుపరి విచారణను జూలై 16కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది.

### నిబంధనలకు విరుద్ధంగా అధికారులు..!

మాన్యువల్ స్కావెంజర్ల నియామక నిషేధం, పునరావాస చట్టం-2013 నిబంధనలకు విరుద్ధంగా విజయవాడ కార్పొరేషన్ పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మాన్యువల్ స్కావెంజింగ్ అనుసరిస్తున్నారని పేర్కొంటూ విశ్రాంత ఉద్యోగి టి.దాలయ్య హైకోర్టులో పిల్ వేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది పి.రవితేజ వాదనలు వినిపిస్తూ... విజయవాడ కార్పొరేషన్ పరిధిలో 250 మంది మాన్యువల్ స్కావెంజర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. మ్యాన్‌హోల్ శుభ్రం చేస్తూ మాణిక్యాలరావు మరణించినట్లు 2023 సెప్టెంబరు 8న పత్రికల్లో కథనం వచ్చిందని, అయితే 2022 ఏప్రిల్ 18న విజయవాడ లెమన్ ట్రీ హోటల్ సమీపంలో 20 మంది పారిశుధ్య కార్మికులు మ్యాన్యువల్ స్కావెంజింగ్ చేస్తున్నారని, ఫోటోలతో సీఎస్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ.. అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. విజయవాడ కార్పొరేషన్ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ వాదనలు వినిపిస్తూ... కార్పొరేషన్ల పరిధిలో మ్యాన్యువల్ స్కావెంజింగ్ అమలు చేయడం లేదని, యంత్రాల ద్వారానే మ్యాన్‌హోల్స్, మురుగు డ్రెయిన్లు శుభ్రం చేస్తున్నారని పేర్కొన్నారు. వరద డ్రెయిన్ శుభ్రం చేస్తుండగా మాణిక్యాలరావు ప్రమాదవశాత్తూ మ్యాన్‌హోల్‌లో పడి మృతిచెందాడని నివేదించారు.

## టిప్పర్‌తో ఢీకొట్టి.. కొడవళ్లతో నరికి..

- ఎమ్మార్పీఎస్ సీమ అధ్యక్షుడి దారుణహత్య
- గుంతకల్లు నుంచి చిప్పగిరికి కారులో వెళ్తుండగా లక్ష్మీనారాయణపై దాడి
- హత్య కేసులో లక్ష్మీనారాయణ నిందితుడు
- ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ ఆలూరు ఇన్‌చార్జి కూడా..



చిప్పగిరి లక్ష్మీనారాయణ

గుంతకల్లు/కర్నూలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ (60) ఆదివారం దారుణ హత్యకు గురయ్యారు. అనంతపురం జిల్లా గుంతకల్లు శివారులో దుండగులు టిప్పర్‌తో ఢీకొట్టి, వేట కొడవళ్లతో నరికి చంపారు. కర్నూలు జిల్లా చిప్పగిరికి చెందిన ఆయన.. ఆదివారం ఉదయం తన కుమారుడు వినోద్‌కుమార్, సమీప బంధువు గోవిందుతో కలిసి గుంతకల్లుకు వచ్చారు. అనంతరం వారు మధ్యాహ్నం ఇన్నోవా వాహనంలో చిప్పగిరికి బయల్దేరారు. గుంతకల్లు-ఆలూరు రహదారిలో పట్టణ శివారులోని రైలు వంతెన సమీపాన స్పీడ్ బ్రేకర్ వద్ద ఇన్నోవాను ఆగంతకులు టిప్పర్‌తో ఎదురుగా వచ్చి ఢీకొట్టారు. ఆ వెంటనే లక్ష్మీనారాయణను బయటకు లాగి, వేటకొడవళ్లతో ఆయన తల, వీపు మీద నరికారు. తర్వాత కారులో పరారయ్యారు. లక్ష్మీనారాయణ వాహనం ముందుభాగం నుజ్జునుజ్జయింది. స్థానికులు వెంటనే ఆయన్ను, వినోద్‌కుమార్, గోవిందును గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి లక్ష్మీనారాయణ అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. గాయపడిన వినోద్‌కుమార్, గోవిందు మాట్లాడుతూ.. తమ వాహనాన్ని టిప్పర్‌తో ఢీకొట్టి దాదాపు 8 మంది కొడవళ్లతో లక్ష్మీనారాయణను విచక్షణరహితంగా నరికారని తెలిపారు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు మనోహర్, మస్తాన్ హత్యాస్థలాన్ని పరిశీలించారు. లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా.. లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన 2006లో టీడీపీ నాయకుడు, కర్నూలు జిల్లా సహకార బ్యాంకు మాజీ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు, ఆయన భార్య శకుంతల హత్య కేసులో నిందితుడి(ఏ-7)గా ఉన్నారు. ఈ కేసును న్యాయస్థానం కొట్టివేసింది.

## కల్తీ నెయ్యి కేసులో విచారణకు రండి

- టీటీడీలో పలువురికి సిట్ నోటీసులు

తిరుపతి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కల్తీనెయ్యి కేసులో విచారణకు హాజరుకావాలంటూ టీటీడీకి చెందిన పలువురు అధికారులకు సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం) నోటీసులు జారీచేసింది. మూడు రోజుల కిందటే సిట్ అధికారులు ఈ నోటీసులు అందజేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. వారంలోగా విచారణ నిమిత్తం తమ కార్యాలయంలో హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. నెయ్యి సేకరణకు సంబంధించి టెండర్లు పిలవడం మొదలుకొని నెయ్యి సరఫరా, నాణ్యత వరకూ వివిధ ప్రక్రియలతో సంబంధం ఉన్న అధికారులు, ఉద్యోగులకు ఈ నోటీసులు అందాయి. ముఖ్యంగా మార్కెటింగ్, ప్రొక్యూర్‌మెంట్, ల్యాబ్‌లకు సంబంధించిన విభాగాల అధికారులు సహా కీలక ఉద్యోగులను పిలిచి విచారించనున్నారు. టీటీడీ పాలనా విభాగానికి సంబంధించిన ఇద్దరు కీలక అధికారులకూ సిట్ నుంచి పిలుపు వచ్చిందని సమాచారం. సిట్ టీటీడీ వైపు దృష్టి సారించడంతో కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకున్నట్టు తెలుస్తోంది. కాగా, భోలే బాబా డెయిరీ ప్రతినిధులు మరో ఇద్దరిని సిట్ అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

## వ్యవసాయశాఖ కబంధ హస్తాల నుంచి ఉద్యాన శాఖను కాపాడండి

- ప్రభుత్వానికి ఉద్యాన సహాయకుల విజ్ఞప్తి

విజయవాడ(గాంధీనగర్), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ కబంధ హస్తాల నుంచి ఉద్యాన శాఖను కాపాడాలని గ్రామ ఉద్యాన సహాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జాబ్ చార్ట్ ప్రకారం మాత్రమే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని, లేదంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ హార్టికల్చర్ జేఏసీ సమావేశం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడుతూ పేరుకు తాము ఉద్యాన సహాయకులమైనప్పటికీ తమపై పెత్తనమంతా వ్యవసాయ శాఖ అధికారులదేనన్నారు. తమకు వ్యవసాయ శాఖ పనులను అప్పగించడంతో ఉద్యాన రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నామని తెలిపారు. ఆరేళ్లుగా ఎటువంటి పదోన్నతులు, బదిలీలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు.

# వేదనాకాశం కింద చెహోవ్ హీరో

ఒక లెక్కలేనితనం తెచ్చే అందంతో చూస్తుంటాయి చెహోవ్ కళ్ళు ఇప్పటికీ, తన ఫోటో ఎవరు చూస్తుంటే వాళ్ళ లోపలికి. తన కథలకు ఆకర్షణీయమైన పేర్లు అనవసరమనీ, ఏడేళ్ళకు మించి వాటికి పాఠకాదరణ ఉండబోదనీ అనుకున్న ఈ రచయిత పేరు నూట నలభై సంవత్సరాలుగా 'కథ'కు పర్యాయనామం అయి కూచుంది. మొదట్లో కేవలం సంపాదన కోసం హాస్యకథలు, ఏకాంక నాటికలూ రాస్తూ వచ్చిన చెహొవ్‌ను అన్న అకాల మరణం రచనకళ పట్ల, జీవితం పట్ల దృక్పథాన్ని మార్చుకునేట్లు చేసింది. అలా ఇరవై ఏడేళ్ళకే మరణ విచారణ, బ్రతుకు చింతన ఆయన కథల విషయం అయింది. అప్పుడు రాసినవే 'The Tedious Story', 'The Kiss'.

తనకు మృత్యువు వస్తోందనా, జీవితేచ్ఛ పోతున్నదనా దుఃఖం? "అరవై రెండేళ్ళ సుదీర్ఘ జీవితాన్ని ఎంత నిరర్థకంగా ఖర్చు చేసుకున్నాను కదా!" అనే జ్ఞానమా? ఇన్నాళ్ళూ తను గొప్పవి అని నమ్మి నెత్తిన పెట్టుకున్న జీవితవిలువలు ఉట్టి డొల్ల అని ఒప్పుకోవడం ఎంత దుర్భరమో, ఇప్పుడు వాటికి విరుద్ధంగా బ్రతకాలనే ప్రయత్నం అంతకన్నా కష్టం. ఇన్నాళ్ళుగా యాంత్రిక జీవనం అనే ఉరితాడును వరమాలనుకుని మెడకు వేసుకుని తిరిగానని తెలుసుకున్న నేరస్థులు చెహొవ్ పాత్రలు. జ్ఞానాన్ని మించిన నేరం, దుఃఖం లేవు.

ఇక, కేటీ విషాదకారణాలు ముసలితనమో, శారీరక అశక్తతో కావు. ఆమె తన నటనావృత్తిలోనూ, ప్రేమలోనూ ఓడిపోయింది. "లోకంలో కళాకాంతీ పోయాయి!" అని వాపోతుంటాడు.

"మనిషికి తీవ్ర అస్తిత్వ వేదన నుంచి జాగృతి పుడుతుందా లేక తనకు ఆ స్పృహ వచ్చినప్పుడు మానవ అస్తిత్వ వేదన తెలుస్తుందా?" అనే సూక్ష్మ సందిగ్ధతను పదునుగా చెప్పిన కథలు ఈ రెండూ.

'The Tedious Story'లో విషయం- అరవై పైబడిన ప్రొఫెసర్ నికొలాయ్ స్టెపనొవిచ్‌కు, అతని గార్డియన్షిప్‌లో కూతురిలా పెరిగిన పాతికేళ్ళ కేటీ కి జీవితం పట్ల వచ్చిన నిస్పృహ. అకస్మాత్తుగా శక్తిహీనత, మృత్యుస్పృహ వచ్చిపడ్డాక, స్టెపనొవిచ్, "నాకు ఎటువంటి ప్రఖ్యాతి! వృద్ధాప్యం, రోగాలు, మృత్యువు నాకెట్లా వస్తాయి? అద్దంలో ఆ వంకరనోటి ముఖం నాదేనా! శరీరంలో, మనసులో దౌర్బల్యం, బయట మనుషుల్లో నన్ను అర్థం చేసుకోలేని స్వార్థం! ఏ పని లోనూ అభిరుచి లేదు, భోజనం లోనూ తీవ్రమైన అరుచి.

జీవితమంటే నిర్వేదం. తండ్రి వంటి స్టెపనొవిచ్ ముందు, "నేనిప్పుడు ఏం చెయ్యాలి ఈ 'utter will-lessness' (చెప్ప లేనంత నిరాసక్తత) నుంచి బయటపడే దారేది?" అని రోదిస్తూ "ఒక్కమాట చెప్పు, ఈ స్థితినుంచి దారి చూపించే ఒక్కమాట!" అంటుంది. కానీ, అటువంటి సంశయంలోనే కొట్టుకుపోతున్న స్టెపనొవిచ్ దగ్గర దానికి జవాబు లేదు. ఒక తండ్రిలా ఆమె కోసం దుఃఖిస్తూనే, "నిజంగా నాకూ తెలియడం లేదమ్మా" అంటూనే, "నా అంతఃకరణం ఏదో చెప్తున్నది కానీ ఆ విధంగా నడిచే ధైర్యమూ శక్తీ నాకిప్పుడు లేవు. దైవం ఏ శిక్ష వేస్తాడో వెయ్యనీ," అంటాడు. తనను నడిపించిన సూత్రం, సత్యం ఇవీ అని చెప్పగల విద్య ఇన్నాళ్ళ అధ్యాపక అనుభవంలో నేర్చుకో లేదు ఆ ప్రొఫెసర్.

ఇక్కడ చెహొవ్ ఒక యూనివర్సిటీ చదువులనే బోనులో నిలబెట్టలేదు, వరసగా వస్తారు ఆయన ముద్దాయిలు- వివిధ సిద్ధాంతకారులు, ప్రభువులు, ప్రవక్తలూ, మనిషి ప్రియ వ్యసనాలైన అంతఃకరణశుద్ధి లేని కళలు, అబద్ధపు అభ్యుదయ సమాజపు కలలు, మోతాదు మించిన సైన్సు, సత్యాన్వేషణ కాని సాహిత్యం... ఇలా అన్నిటికీ మెల్లగా కీళ్ళు ఊడదీసి చల్లగా కూలదోసిన రచనలు చెహొవ్‌వి.

'The Kiss'లో ఒక మిలిటరీ బెటాలియన్ ఒక పల్లెటూరిలో రాత్రికి బస చేయవలసి వస్తుంది. అలసిపోయిన జవాన్లు తొందరగా నిద్రపోదాం అని సిద్ధమవుతుంటే, ఆ ఊళ్ళోని రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్, వీళ్ళను విందుకు ఆహ్వానిస్తాడు. "ఖర్మరా బాబూ" అనుకుంటూ వెళ్ళాక తెలుస్తుంది, పిలిచినవాళ్ళు కూడా "ఖర్మరా బాబూ" అనుకుంటూనే మర్యాద కోసం పిలిచారని. వాళ్ళింట్లో ఏదో శుభకార్యం, ఇంటి నిండా స్వజనం. వాళ్ళు ఇబ్బందిని దాస్తూ గౌరవాన్ని నటించగల అనుభవజ్ఞులు కాబట్టి వీళ్ళకు చాలా శ్రద్ధగా తిండి, పానీయాలు పోసి, తమ డాన్స్, పియానో పాటల్లో కూడా కలుపుకుంటారు. జవాన్లు ఆ సంపన్నుల భవంతిలో, అప్సరసల వంటి ఆ ఇంటి స్త్రీల మధ్య, తమ ఉక్కిరిబిక్కిరితనాన్ని దాచిపెట్టి హుందాతనాన్ని తెచ్చిపెట్టుకుని తిరుగుతారు, ఒక్క ర్యాబోవిచ్ తప్ప. అతను కాస్త నటన చేసైనా మామూలు మనిషిలాగా కనపడటానికి వీలుకానంత చిన్న మనిషి- అందంలో, స్థాయిలో, నాగరీకంలో. దిక్కు తోచక ఆ ఇంట్లో ఉన్న లెక్కలేనన్ని గదులు తిరుగుతూ తిరుగుతూ తోవ మర్చిపోయి, సన్నగా సంగీతం వినపడుతున్న ఒక చీకటి గదిలోకి వచ్చి పడతాడు. ఆ చీకటి గదిలో విరగపూసిన పూలవాసన. గది కిటికీలు తోటలోకి తెరుచుకున్నట్లు ఉన్నాయి. "ఇది కాదు నేను రావలసిన గది" అనుకుంటుండగానే- స్త్రీ దుస్తుల రెపరెపలు వినపడటం, పరిగెత్తిన ఆయాసంతో ఆడగొంతు "దొరికావు చివరికి" అనడం, పరిమళాల ఆడ చేతులు రెండు తన మెడను చుట్టడమూ, వెచ్చటి చెంప తన చెంపకు ఆనటమూ, చటుక్కున ముద్దు! వెంటనే చిన్న కేక వేసి ఒక్క గెంతులో దూరంగా వెళ్లిపోయింది ఆమె ఎవరో! అతనికి అంత చీకట్లోనూ ఆమె అసహ్యం కనపడింది. ఆ ముద్దు తనది కాదని తెలిసింది. అయినా, ఉద్వేగంతో హృదయం కొట్టుకుంటోంది. పెనవేసుకున్న స్త్రీ చేతులు తన మెడకు ప్రసాదించిన పవిత్రతైలాల అనుభూతి పూతను వదిలించుకునే శక్తి అతనికి లేదు. ఈ మైకంలోనే మన హీరో మిగతా జవాన్లతో కలిసి బస వైపు నడుస్తాడు. సుష్టైన విందు పానీయాల మత్తుతో నడుస్తున్న జవాన్లు "ఎప్పటికైనా ఇలా ఇల్లు సంసారం ఏర్పడక పోతాయా మనలాంటి మామూలు మనుషులకు కూడా" అనుకుంటారు (ఈ మాట బరువు తూచలేము). ఎక్కడో ఒక కోయిల తన గుండెల్లో బలిమినంతా గొంతులోకి తెచ్చుకుని పాడుతున్నది. అంతటా ఆనందమే ఆ రాత్రి.



"గాడిదకు దుఃఖం తెలుస్తుందా" - ఫ్రెడరిక్ నీఛ
"గాడిదకు పన్నీరు వాసన తెలుస్తుందా" - తెలుగు సామెత.
చెహొవ్ హీరో గాడిద కాదు, కనీసం గాడిదగా మిగిలిపోడు; జీవితానికి ఒక నిర్దిష్ట ప్రయోజనమో పరమార్థమో ఉంటాయనుకుని బ్రతకడం వృథా ప్రయాస అనే స్పృహను, దాన్లోంచి వచ్చే యాతనను సమస్త మానవజాతి తరపున భరించగల సార్థకజీవి.

చెహొవ్ కథల్లో ఒక సుష్టైన విందు, సుందరమైన దృశ్యం, అందమైన స్త్రీ ఉనికి మనిషిలో దాదాపు పునర్జన్మ వంటి ఒక పరివర్తనం తీసుకురావటం తరచూ కనపడుతుంది.

మరుసటిరోజు ఆ మిలిటరీ బెటాలియన్ ఆ ఊరు విడిచిపోతుంది. ఆనాటి నుండి మళ్ళీ తిరిగివెళ్ళే ప్రయాణంలో ఇదే ఊర్లో ఆగటానికి మధ్య నూట మూడు రోజుల పొడవునా ర్యాబోవిచ్‌కు అనుభవమైన అందమైన అవస్థే ఈ కథకు ప్రాణం. ఆరోజు తనకు ప్రేమ దొరికిందనీ, తనదిప్పుడు విరహబాధ అనీ, తన ప్రేమ కథ ఎవరికైనా ఒక మధురభావనగా చెప్పాలనీ కలలూ కోరికలతో సతమతమై పోతుంటాడు ర్యాబోవిచ్. తన అందవికార రూపం, పేదరికం, తక్కువస్థాయి ఉద్యోగం, అన్నిటినీ మర్చిపోయేట్లు చేసింది ఈ అయాచిత అనుభవం. ఆమెను ప్రేయసి చేసింది, ఆరోజు చీకట్లో ఆమె ముఖం కూడా చూడకపోయినా. మిలిటరీ బెటాలియన్ మళ్ళీ ఆ ఊర్లో ఆగినప్పుడు విందుకు ఆహ్వానం అందుతుందనీ, ఈసారైనా ఆమె దర్శనం దొరుకుతుందనీ ఆశ అతన్ని ఈ వసంత కాలమంతా నిలువనివ్వలేదు. కానీ, తీరా ఆ ఊరు చేరేసరికి, ఇప్పుడసలు ఆ ఆసామి ఊర్లోనే లేడు. ఆ భవంతి, ఆ తోట, దానికి నది ప్రక్కనుంచి తోవ, నదిపైన ముచ్చటైన వంతెన అన్నీ అట్లాగే ఉన్నాయి, "ఒక్క ఆ గుండెబలిమి ఉన్న కోయిల పాట లేదు. నదిలో చంద్రుడు ఎర్రగా ఉన్నాడు, నీటిబుడగలు ఆయన ప్రతిబింబాన్ని పరిమాణంలో పెంచుతూ, ఇంతలో ముక్కలుగా తుంచుతూ, చంద్రుణ్ణి తమతో లాక్కెళ్ళుతాం అనుకుంటున్నాయా అన్నట్లు తన గుండా పోతున్నాయి." ఉన్నట్లుండి అతనికి తన ఈ నిరాశ ఆశ్చర్యపడవలసిన ఒక విషయమే కాదు అనిపిస్తుంది. ఆమె తనకు కనపడుతుందనీ, ఇది ప్రేమేననీ ఇన్నిరోజులుగా అనుకోవటం ఎంత సహజమో, ఇప్పుడు అవన్నీ వ్యర్థమైన ఊహలు అని తెలియడమూ అంతే సహజం అనుకుంటాడు. ఈ నది ఆ రోజు ఎలా ప్రవహించిందో ఈనాడూ అలాగే ఏదీ పట్టించుకోకుండా ప్రవహించడమూ వింత కాదు. "నేనెంత బాధలో ఉన్నా లోకం ఏంటి ఇంత అందంగా వెలిగిపోతోంది, దీనికి మనసే లేదు!" అనే చెహొవ్ మరో సందర్భంలో, "ఈ సృష్టి అంతా ఎంత చక్కగా ఉంది, ఇక్కడ మనిషి తన మానవ మర్యాదలను మరిచి పోయి చేసే పనులు తప్ప!" అనీ అంటాడు. ర్యాబోవిచ్ మళ్ళీ అన్నీ నెమరు వేసుకుంటాడు. విధి ఒక అపరిచిత స్త్రీ రూపంలో హత్తుకోవటం, తర్వాత తనను వదలని midsummer night (day) dreams, ప్రస్తుతం వాస్తవమైన తన శోకం... "ఎంత అల్పమైన దయనీయ దౌర్భాగ్య జీవితం నాది!" అనుకుంటాడు. తన మనుషులను ఎంత అభావంగా చూపెట్టగలిగితే, వారికి పాఠకుల నుంచి అంత జాలి దొరుకుతుంది అనే కిటుకు తెలిసిన రచయిత చెహొవ్. సాంద్రమైన చిన్నకథకు మచ్చుతునక ఈ కథ.

"గాడిదకు దుఃఖం తెలుస్తుందా" - ఫ్రెడరిక్ నీఛ.


"గాడిదకు పన్నీరు వాసన తెలుస్తుందా" - తెలుగు సామెత.

చెహొవ్ హీరో గాడిద కాదు, కనీసం గాడిదగా మిగిలిపోడు; జీవితానికి ఒక నిర్దిష్ట ప్రయోజనమో పరమార్థమో ఉంటాయనుకుని బ్రతకడం వృథా ప్రయాస అనే స్పృహను, దాన్లోంచి వచ్చే యాతనను సమస్త మానవజాతి తరఫున భరించగల సార్థకజీవి.

మనుషులు ఎదిగే పరిణామక్రియను, వారి మనస్తత్వపు జీవితచరిత్రలను ఇటుకపై ఇటుకగా నిర్మించే ఒక్క చెహొవ్ తప్ప మరొకరు పట్టుకోలేరు. జీవకణ ప్రయోగశాలలో సూక్ష్మదర్శిని కింద జరుగుతుండే పరమాణు క్షణక్షణ పరివర్తనల వంటివే మనిషి మనస్సు, మెదడులలో నిరంతరం జరిగే మార్పులు. ఆ చలనగతులను పట్టుకోగల కన్ను చెహొవ్‌ది, వాటి కోసమే ఎదురు చూస్తుంటాడు, శిశువు శిరోదయం కోసం ఎదురుచూసే మంత్రసాని జాగరూకతతో.

■ పద్మజ సూరపరాజు ✆ 99403 44406

సోమవారం 28 ఏప్రిల్ 2025
వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్




## జీరో గ్రావిటీ

చక్రాన్ని తిప్పుతూ తిప్పుతూ
అలసిపోవడమే పాపమైనపుడు
ఆనంద భైరవుని నెత్తినున్న మల్లెమాల
వజ్రపు కిరీటమై రోజుకింత బరువు పెరుగుతుంటది

ప్రకృతి పామై కాటేసే
ప్రతీ సందర్భంలో
కడుపులో పెరుగుతున్న శిరోభారాలు
నిన్ను మరమనిషిని చేసే మాయల ఫక్కీర్లు

ఆప్యాయతలు ప్రేమలు బాధ్యతల బంధాల్లో
అనివార్యమైన అల్లింపుల
నిర్మాణ సూత్రంలో
భార రహితస్థితి నీకో అనివార్యత

నీవు మోస్తున్న ప్రతి బరువూ
జారిపోతూ జారిపోతూ
నీకు ప్రసవ సుఖాన్ని పరిచయం చేస్తుంటది

నీవు కోల్పుతున్నది భారమేననే రహస్యం
నిన్ను తేలిక పరుస్తున్న
కన్నీటి సుక్కనడుగు చెప్తది

■ హజారి

# నాకు నేనే గిఫ్ట్ ఇచ్చుకుంటాను

చదువు ముచ్చట

పూర్ణిమ తమ్మిరెడ్డి

**ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?**

సమాంతా హార్వే రాసిన 'ఆర్బిటాల్'. 2024 బుకర్ ప్రైజ్ అందుకున్న రచన. సైన్స్ ఫిక్షన్‌ను ఇంత కవితాత్మకంగా రాయచ్చా అని అనిపించింది. ప్రముఖ హిందీ కవి, వినోద్ కుమార్ శుక్లా రాసిన "దూర్ సే అప్నా ఘర్ దేఖ్నా చాహియే" (దూరం నుంచి మన ఇంటిని చూసుకోవాలి) అన్న కవితను గుర్తు తెచ్చింది. అలానే, కార్ల్ సాగన్ రాసిన 'ది పేల్ బ్లూ డాట్'ను కూడా!

**మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?**

నాకు ఇరవై రెండేళ్ళు వచ్చే వరకూ స్కూలు, కాలేజీ పుస్తకాలు తప్పించి సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేవు. పదో తరగతిలో 'బారిష్టర్ పార్వతీశం' నాన్‌డిటేయిల్‌గా ఉండేది.



అదే ఏడాది పరీక్షల్లో కొత్త తరహా ప్రశ్నాపత్రంలో మామూలు ప్రశ్నలు కాకుండా, సృజనాత్మకతకి తావిచ్చే "మీరు పార్వతీశం స్థానంలో ఉంటే ఏం చేస్తారు?" లాంటి ప్రశ్నలు ప్రవేశపెట్టారు. నాకు కథలు రాయాలన్న ఆసక్తి అక్కడ నుంచే మొదలైందనుకుంటాను.

**ఒకప్పటికీ ఇప్పటికీ మీరు చదివే పద్ధతి ఎలా మారింది?**

పైన చెప్పినట్టు, నేను ఇరవై రెండేళ్ళ వరకూ పుస్తకాలు చదవలేదు. అందుకని అందరూ చిన్నగా ఉన్నప్పుడు చదివే సాహిత్యం నేను చదవలేదు. ఏవి చదవాలన్నది తోటి బ్లాగర్ల రెకమెండేషన్ల బట్టి నిర్ణయించుకునేదాన్ని. అది ఇది అని తేడా లేకుండా ఆసక్తి కలిగించే ప్రతి రచననూ చదివేదాన్ని.

ఇప్పుడు నేను చేస్తున్న పనులకు పనికొచ్చే పుస్తకాలు ఎక్కువగా చదువుతున్నాను. అనువాదాలు చేస్తున్నాను కాబట్టి, దేశ విభజన సాహిత్యం, తెలంగాణ సాయుధ పోరాటం గురించి ఎక్కువగా చదివాను. అలానే, నా 'ఎలమి' ప్రచురణలు సంస్థ నుంచి తీసుకురాబోయే అనువాదాల కోసం దేశీ, విదేశీ సాహిత్యాన్ని చదువుతున్నాను.

ఇక నాకోసం చదువుకునే పుస్తకాలను ఎక్కువగా ఆడియో రూపంలో వింటున్నాను. ఉర్దూ, కన్నడ, హిందీ భాషల పుస్తకాలు వినడం వల్ల నాకా భాషలపై పట్టు పెరుగుతూ వస్తోందని నా నమ్మకం.

**మీరు బహుమానంగా అందుకున్న పుస్తకాల్లో బెస్ట్?**

కువెంపు రాసిన 'మలెగలల్లి మదుమగలు' అనే నవలను కన్నడ రచయిత అబ్దుల్ రషీద్ బహూకరించారు. కన్నడం నేర్చుకోవడం, చదవడం పట్ల నేను చూపిస్తున్న శ్రద్ధాసక్తులను ఆయన గమనించి ఈ క్లాసిక్ చదవమని ఇవ్వడం బాగా అనిపించింది. ప్రతీ ఏడాదీ నాకు నేను న్యూ ఇయర్ గిఫ్ట్‌గా నాకు ఇష్టమైన కార్టూనిస్టులు - గ్రాంట్ స్నైడర్, టామ్ గాల్డ్ - పుస్తకాలు ఇచ్చుకుంటాను.

**మీరు తరచూ చేసే పుస్తక సమీక్షల గురించి చెప్పండి?**

ఇంటర్నెట్‌లో విపరీతంగా సమాచారం (పుస్తకాలతో సహా) లభిస్తుంది. దానికి ఆదీ అంతం లేనట్టు ఉంటుంది. ఆ ఉధృత ప్రవాహంలో కొట్టుకుపోకుండా, నిలకడగా ఉండడానికి నేను పాటించే సూత్రం: నాకున్న తీరిక సమయంలో 50శాతం కంటెంట్ కన్స్యూమ్ చేస్తే, 50శాతం నేను ఏదో ఒకటి ప్రొడ్యూస్ చేయాలి. ఆ బాలెన్స్ పాటించకపోతే, డూమ్ స్క్రోలింగ్‌కు పుస్తకాలు చదువుకుంటూ పోడానికి పెద్ద తేడా ఉండదు. అందుకే పుస్తకం చదివాక, దాని గురించి రాసుకోవడం నాకు ముఖ్యం.

**రచన విషయంలో మీకు దొరికిన మంచి సలహా?**

దీర్ఘకాలం రచనలు చేస్తూనే ఉండడానికి కావాల్సిన వనరులు- డబ్బు, ఆరోగ్యం, తీరిక- సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టమని అక్కినేని కుటుంబరావు విలువైన సలహా ఇచ్చారు.



**తరచుగా గుర్తొచ్చే కవితా పంక్తి?**

"ఎప్పుడో ఒకప్పుడు, నేను వయసులో ఉన్నప్పుడు
ఎక్కడో ఒక కవిత చదివినట్లు గురుతు. అప్పుడు
భావం తెలియలేదు; కానీ క్రమేణ గ్రహించాను;
తరంగాల తాడనలా అర్థోద్ధతి సహించాను."

- జీవితానుభవాలు ఏవైనా కొత్త వెలుగులో అర్థమైన ప్రతిసారీ బైరాగి రాసిన ఈ పంక్తులను తలచుకుంటాను.

(పూర్ణిమ తమ్మిరెడ్డి రచయిత, అనువాదకురాలు, ప్రచురణకర్త. కథా సంపుటి- 'ఏమోషనల్ ప్రెగ్నెన్సీ'; అనువాదాలు- మంటో 'సియా హాషియే', అమృతా ప్రీతమ్ 'పంజరం'; నాన్‌ఫిక్షన్- 'ఆన్‌లైన్ స్కాములు' వెలువరించారు. ఓల్గా 'పంపాతీరం' నవలకు ఆమె ఇంగ్లీష్ అనువాదం త్వరలో రానుంది.)

ఈమెయిల్: purnimat07@gmail.com

## సోమేపల్లి అవార్డుల ప్రదానోత్సవం

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం - గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కీ.శే. సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి, సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం మే 1 సా.5గంటలకు కొరటాల భవన్, బ్రాడీపేట, గుంటూరులో జరుగుతుంది. అధ్యక్షత చలపాక ప్రకాష్; ముఖ్య అతిథులు పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ. కథా పురస్కారం సి. యమున ('రెక్కలొచ్చాయి'), కవితా పురస్కారం ఖాదర్ షరీఫ్ ('జీవ రహస్యలిపి') స్వీకరిస్తారు.

వశిష్ఠ సోమేపల్లి

## ఉమ్మడిశెట్టి అవార్డుల ప్రదానోత్సవం

ఉమ్మడిశెట్టి అవార్డుల ప్రదానోత్సవం మే 4, ఫిలింభవన్, కరీంనగర్‌లో జరుగుతుంది. ఉమ్మడిశెట్టి సత్యాదేవి అవార్డును వైష్ణవిశ్రీ, ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ యువ పురస్కారాన్ని నందకిషోర్, రాధేయ కవితా పురస్కారాన్ని సుధామురళి స్వీకరిస్తారు. సభలో రాధేయ, నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, అద్దేపల్లి ప్రభు, మానస చామర్తి పాల్గొంటారు.

ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్




## వెచ్చటి వెన్నెల లాంటి ఒక platonic poem

చుట్టూ చీకటి కమ్ముకునింది. మనిద్దరం పచార్లు చేస్తూ. నేనేమో రెండోసారి నీకోసం Mens Hostel - I నుండి North Ladies Hostel కి వాన తుంపర్లలో పలుచగా తడిసొచ్చి నువ్వేదో చెబుతావని ఎదురుచూస్తూ. నిశ్శబ్దంగా నీతో నడుస్తూ. అటు ఇటు రెండుమార్లు నడిచాక బహుశా చెప్పాలని నన్నాపావు గుండె కొట్టుకుంటున్నట్టు ఆగి వెలుగుతున్న వీధి లైట్ కింద, ఆ ఒకే కాంతి ఆ దారి మొత్తమ్మీద. "నీతో స్నేహం ఎండాకాలంలో కురిసిన వానజల్లులా బావుంది, వెచ్చని కౌగిలిలానూ ఉంది. మన స్నేహమొక శాశ్వతత్వంలా. అబ్బాయీ! కౌగిలించుకోవచ్చా నిన్నొకసారి?" అని నువ్వన్నప్పుడు నవ్వుతూ చాలా తేలికగా అన్నాను నీ మాటల్లోని కవితాత్మకతనీ జీవాత్మని గుర్తించక "ఎంతమందో కౌగిలించుకునుంటారు నన్ను, పెద్ద తేడా ఏముంది నువ్వు కౌగలించుకున్నా, పర్లేదు, ఇవ్వు". అందరికిమల్లే నువ్వూ తేలికగా హత్తుకుంటావనుకున్నాను. ఎన్ని క్షణాలు కౌగిలించుకుని ఉంటామో గుర్తులేదు. కాస్త నిశ్శబ్దమూ ప్రశాంతత. పిల్లవాడు చందమామని అందులోని కుందేలుని మేఘాల వంటి మెత్తని కొండలని కౌగిలించుకుని నిదరోతున్నంత ప్రశాంతత.

•

చెప్పకూడదు ఇలా ఇప్పుడు:

మనం కలుసుకోలేనంత దూరమయ్యి, కలిస్తే మరొక్కసారి హత్తుకోవాలన్న తపన.

అమ్మాయీ,

ఎవరన్నా దగ్గరకొస్తే చికాకేస్తుంది తెలుసా! బహుశా మనసంతా నిరాకరణను కమ్ముకున్నదేమో నువ్వు రావాలని. నీ కౌగిలిలో పొందిన వెచ్చటి వెన్నెల ఇక్కడెవరిలోనూ దొరకదని నీకూ తెలుసు. నువ్వెళ్ళిపోయాక కౌగిలింతలన్నీ ముళ్ళదేహాలపై వాలి పావురానికి గాయమైనట్లు, చీకటిలో రాళ్ళు పరిచిన దారిలో చెప్పుల్లేకుండా నడుస్తున్నట్లు, కాలిపోతున్న చుట్టుగోడలు మధ్య ఇరుక్కుపోయినట్లు, నలిపిన కాగితంపై బొమ్మ గీసినట్లు.

అమ్మాయీ! ఎలా ఉన్నావు ఇంతకీ?

నీకూ ఇలాగే మనసు పీకుతోందా?

■ లిఖిత్ కుమార్ గోదా
✆ 96400 33378

# హృదయం నుండి

1
జీవితానికి భయపడుతున్న బిడ్డకి
మార్దవంగా చెప్పావు

జీవితం అంతిమంగా దైవస్వరూపం
మరొకటి కాదు, ధైర్యంగా ఉండు

ఈ నిముషానికి శరణాగతి చెందు
నడవలేని బిడ్డని తల్లి ఎత్తుకున్నట్టు
జీవితమే నిన్ను మోస్తుంది



జీవితానుభవంలో ఖాళీ అనంతం
అనుభవాలు చీమల్లాంటివి
వాటిని చూస్తూ బెంగటిలవద్దు

దుఃఖం, భయం శిక్షలు కావు, శిక్షణ
చేయవలసిన ఉదాత్త కార్యాలకీ
పొందదగిన ఉదాత్త అనుభవాలకీ

చాలా మాటలు చెప్పాక, అడిగావు
ఉపయోగపడతాయా
ఆమె అంది.. ఏదో ఒకరోజు



2
ప్రేమ కావాలి
ఇదంతా ప్రేమ అనే మెలకువ కావాలి
ఇంతకన్నా అక్షరాలకి పనేముంది

లోతైన మెలకువ విత్తనం లాంటిది
నిశ్శబ్దంగా మొలకెత్తుతుంది
ఎండ పడే కాలానికి
నీడ నిచ్చే వృక్షమౌతుంది

3
జీవితం అందమైందో, కాదో
చెప్పగలవారు లేరు
ప్రపంచం నిజంగా ఉన్నదో, లేదో
తెలిసినవారు లేరు




కలలో ఉన్నవేళ
ఇది కల సుమా అని
ఎవరు ఎవరికి తెలియజెబుతారు


ఒక మాట పలకాలని తోచినపుడు
పదాల లోపలి
నిశ్శబ్దాన్నంతా గుమ్మరించగలిగితే
పలికినా పలకనివాడివి
అర్థం కాకున్నా విన్నవాడివి



4
బిడ్డని,
మాటలతో తాకావా, హృదయంతోనా


మాటలదేముంది
హృదయం పనిచేస్తుంది
హృదయం మాత్రమే..

■ వివివి ప్రసాద్
✆ 90320 75415



# ఏపీటీఏలో అరాచకం!

ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీలో కాంట్రాక్టు ఉద్యోగులు, డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉద్యోగుల తీరు విమర్శలకు దారితీస్తోంది. రెగ్యులర్ ఉద్యోగులను కాదని అనర్హులకు కీలక విభాగాల బాధ్యతలు అప్పగిస్తూ అంతులేని అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈవెంట్లు, రిక్రూట్‌మెంట్, అటెండెన్స్, బదిలీలు తదితర వ్యవహారాల్లో పలువురు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎంవోకు ఫిర్యాదులు వెళ్లినా వీరిపై చర్యలు తీసుకోవడంలేదని సమాచారం.



## పలువురు కాంట్రాక్టు, డిప్యూటేషన్ ఉద్యోగుల హవా!

## రెగ్యులర్ ఉద్యోగులను కాదని.. అనర్హులకు అందలం

- అర్హతలు లేకపోయినా.. కీలక విభాగాలు అప్పగింత
- అవినీతికి పాల్పడుతున్న కొందరు కాంట్రాక్టు ఉద్యోగులు
- వీరికి డిప్యూటేషన్ మీద వచ్చిన అధికారుల వత్తాసు
- సీఎంవోకు ఫిర్యాదులు వెళ్లినా.. చర్యలు శూన్యం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ)లో కొందరు కాంట్రాక్టు ఉద్యోగుల కారణంగా అరాచకం రాజ్యమేలుతోంది. అవినీతికి కేంద్ర స్థావరంగా మారుతోంది. అవినీతి రుచి మరిగిన కాంట్రాక్టు ఉద్యోగుల చేత డిప్యూటేషన్‌పై వచ్చిన కొందరు అధికారులు అన్ని తప్పులు చేయిస్తున్నారు. ఇక్కడ మేనేజర్ల స్థాయిలో పనిచేసే కొందరు కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస అర్హతలు లేకపోయినా కూడా, వారిని ఆ పోస్టుల్లో కూర్చోపెడుతున్నారు. ఎంతో కీలకమైన మేనేజర్ల స్థానాలలో సంస్థ రెగ్యులర్ ఉద్యోగులను నియమించకుండా వారిని ఉన్నతాధికారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. తగిన అనుభవం ఉన్నా కూడా వారి సేవలను ఉపయోగించుకోవటం లేదు. ఎందుకంటే డిప్యూటేషన్ విధానంలో ఇతర శాఖల నుంచి వచ్చిన అధికారులు కొందరు అవినీతి రుచి మరిగారు. తమ అవినీతి ఆకలిని తీర్చేందుకు అవినీతికి అలవాటు పడిన కాంట్రాక్టు సిబ్బంది కొందరిని వీరు పెంచి పోషిస్తున్నారు. పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో సంస్థ ఎండీ ఏ ఆదేశం ఇచ్చినా వాటిని తప్పకుండా అమలు చేస్తారు. ఇదే ఎండీ ఏపీటీఏ సీఈవోగా కూడా వ్యవహరిస్తున్నారు. కానీ, ఎక్కడా సీఈవో ఆదేశాలు అమలు జరిగినట్టు దాఖలాలు లేవు. దీనికి ఏపీటీఏలో నెలకొన్న అవినీతి వ్యవహారాలే కారణమన్న

మిగతా 6లో..

### వైసీపీ హయాంలో రెచ్చిపోయారు!

కొందరు కాంట్రాక్టు ఉద్యోగులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేట్రేగిపోయారు. ఏపీటీఏను అవినీతి కేంద్రంగా మార్చివేశారు. వీటికి సంబంధించి కొందరు కాంట్రాక్టు సిబ్బందిపై ప్రస్తుత ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా వెళ్లాయి. సీఎంవో కార్యాలయం స్థాయిలో బాధ్యులైన వారిని తొలగించమని ఆదేశాలు జారీ చేసినా.. ఏపీటీఏలో అమలు కావటం లేదు. దీనికి ప్రధాన కారణం డిప్యూటేషన్ మీద వచ్చిన అధికారులే కావటం గమనార్హం. సంస్థలో అనేక విభాగాలలో అధికారుల స్థానంలో ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్ల మీద వచ్చారు. వీరిలో కొందరు ఇక్కడ బాగుంటుందన్న ఉద్దేశ్యంతోనే వచ్చారు. ఇలాంటి వారు డబ్బులు సంపాదించటానికి కాంట్రాక్టు ఉద్యోగులను పావులుగా వాడుకుంటున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీలు, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి చర్యలు తీసుకోమని ఆదేశాలు వచ్చినా కూడా వారిని కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### గ్రూపుగా ఏర్పడి మరీ..

సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా రిక్రూట్‌మెంట్ జరిపిన వ్యవహారంలో కూడా తీవ్ర స్థాయిలో ఆరోపణలు వచ్చాయి. అటెండెన్స్ వ్యవహారంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. మాట వినని ఉద్యోగులను ఇతర జిల్లాలకు ఇష్టానుసారం బదిలీలు నిర్వహించటం సంస్థలో పరిపాటిగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. సంస్థలో పనిచేసే మిగిలిన ఉద్యోగులను ఒక రకంగా తమ అవినీతి నెట్‌వర్క్‌లో ఉన్న ఉద్యోగులను ఒక రకంగా చూసే పరిస్థితులు నెలకొన్నాయి. అవినీతికి అలవాటు పడిన ఉద్యోగులంతా కూడా ఒక చెయిన్ నెట్‌వర్క్‌లా సంస్థలో పాతుకుపోయారు. ఎలాంటి అర్హతలు లేకపోయినా, అనుభవం లేకపోయినా, రెగ్యులర్ ఉద్యోగులను పక్కన పెట్టి హవా వెలగబెడుతున్నారు. డిప్యూటేషన్ మీద వచ్చిన కొందరు అధికారుల అండతో అదనపు కీలక బాధ్యతలను కూడా అందిపుచ్చుకుని చక్కబెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈవెంట్ల ముసుగులో కమీషన్ల రూపంలోనే భారీగా డబ్బులు దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

# పెట్టుబడికి రెట్టింపు అంటూ రూ.కోట్లతో పరార్!

## నగరంలో యూపిక్స్ మాయ!

- రెట్టింపు లాభాల పేరుతో ప్రజలకు ఎర
- వచ్చిన పెట్టుబడులతో ఆస్తుల కొనుగోలు
- జనవరి నుంచి చెల్లింపులు నిలిపివేత
- కార్యాలయానికి తాళం.. అజ్ఞాతంలోకి వ్యవస్థాపకుడు కిరణ్
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ప్రజల నుంచి పెట్టుబడులను ఆకర్షించడానికి సాంకేతిక రంగాన్ని ఎంచుకున్నాడు. ఒక వీడియోను ఎన్ని మార్పులతో అయినా అద్భుతంగా మలచగలిగే యానిమేషన్ పేరు సంస్థకు పెట్టుకున్నాడు. ఆ పేరును ఉపయోగించుకుని రెట్టింపు లాభాలు ఇస్తానని అందర్నీ నమ్మించాడు. వారు పెట్టిన పెట్టుబడితో సొంత ఆస్తులు సమకూర్చుకున్నాడు. తిరిగి చెల్లింపులు చేయాల్సి రావడంతో ఇప్పుడు ముఖం చాటేసి అజ్ఞాతంలోకి పారిపోయాడు. ఇదీ విజయవాడకు చెందిన నిడుమోలు వెంకట సత్యలక్ష్మీకిరణ్ వ్యవహారం.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) విజయవాడకు చెందిన నిడుమోలు వెంకట సత్యలక్ష్మీకిరణ్ సత్యనారాయణపురంలో కొద్దినెలల క్రితం యూపిక్స్ యానిమేషన్స్ పేరుతో సంస్థను ఏర్పాటు చేశాడు. ఇక్కడి నుంచి కార్యకలాపాలను రాష్ట్రమంతటా విస్తరించాడు. తన సంస్థలో రూ.లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఆరు నెలల్లో రూ.2లక్షలు తిరిగి చెల్లిస్తానని ప్రకటనలు గుప్పించాడు. ఇలా మార్కెటింగ్ చేసుకుని పెట్టుబడులు రావడం మొదలయ్యాక అసలు స్కెచ్‌ను అమలు చేశాడు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని సైబర్ నేరగాళ్లు చేసిన ప్రకటనలను ఆదర్శంగా తీసుకుని పెట్టుబడికి రెట్టింపు లాభాలు నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాడు. దీని మాయలోపడి రూ.లక్షల్లో కొందరు, కోట్లలో మరికొందరు పెట్టుబడులు పెట్టారు. తర్వాత నెమ్మదిగా జనవరి నుంచి చెల్లింపులు ఆపేశాడు. సరిగ్గా ఏప్రిల్ నెల వచ్చే సరికి సత్యనారాయణపురంలో ఉన్న కార్యాలయానికి తాళాలు వేశాడు. నిడుమోలు కిరణ్ తమను నిండా ముంచేశాడని ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు సత్యనారాయణపురం పోలీసులను ఆశ్రయించారు.

### మళ్లీ వంచనకు సెల్ఫీ వీడియోతో స్కెచ్!

నిడుమోలు వెంకట సత్యలక్ష్మీకిరణ్‌పై పోలీసులు కేసు నమోదు చేయడంతో బాధితులను మరోసారి వంచించడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఇతర రాష్ట్రాలకు పారిపోయి సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. కిరణ్ సుమారుగా రూ.10కోట్ల మేరకు ప్రజల

మిగతా 6లో..

# నైపుణ్య మస్తు!

## జిల్లాలో విస్తృతంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు

- విద్యార్థులను సానబెట్టేందుకు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు
- ఎంపిక చేసిన కాలేజీల్లో సాంకేతిక, డిజిటల్ మార్కెటింగ్ అంశాలపై శిక్షణ
- బీపీఎం, వెబ్ సర్వీసెస్ కోర్సులకు విశేష స్పందన
- స్కిల్ హబ్స్‌తో కూడా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ
- నిరుద్యోగుల కోసం జాబ్ ఫెయిర్స్‌తో అసంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విద్యార్థులకు మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పన కోసం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. స్వయం ఉపాధి పథకాలు, సాంకేతిక కోర్సులు, మార్కెటింగ్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణను కళాశాలల్లో ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా ఇప్పిస్తోంది. వందలాది మంది విద్యార్థులు ఈ శిక్షణకు హాజరవుతున్నారు. ఇప్పటి వరకు 7,357 మంది విద్యార్థులు నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 4,164 మందికి శిక్షణ పూర్తయింది. మరో 1,208 మంది శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షణ పొందిన వారిలో 1,154 మందికి సర్టిఫికెట్లను కూడా అందజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాలు సాధించాలంటే మంచి మార్కులతోపాటు

మిగతా 6లో..



### స్కిల్ హబ్స్‌తోనూ నైపుణ్య శిక్షణ

పైన చెప్పుకున్నవి కాకుండా 'స్కిల్ హబ్స్' పేరుతో మరో పదహారు అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, డెబిట్ రికవరీ ఏజెంట్, డొమెస్టిక్ బయోమెట్రిక్ డేటా ఆపరేటర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, లైట్ వెహికల్ సర్వీస్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, రిటైల్ సేల్స్ అసోసియేట్, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్, వెబ్ డెవలపర్ వంటి కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. వీటికి సంబంధించి ఇప్పటివరకు 264 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. మరో 274 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. వీరిలో 169 మందికి ఉద్యోగాలు కూడా వచ్చాయి.

# కిచెన్ గార్డెన్ నిధులు హాంఫట్!

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు ఆలంబనగా ఉంటుందని సర్వశిక్షా అభియాన్ ద్వారా ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ నిర్వహణ నిధులు పక్కదారి పట్టాయి. ప్రతి ఏడాది నవంబరులో ఇవ్వాల్సిన ఈ నిర్వహణ నిధులను ఈ సారి ప్రభుత్వం ఫిబ్రవరిలో విడుదల చేయగా, వాటిని పాఠశాలలకు ఇంతవరకు ఎంఈవోలు బదిలీ చేయలేదు. పలువురు ఎంఈవోలు తమ సొంతానికి వాడేసుకున్నట్లు సమాచారం. దీనిపై హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు డీఈవోకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.

## జిల్లాలోని 693 ప్రభుత్వ పాఠశాలలకు రూ.34.65 లక్షలు మంజూరు

- పాఠశాలల ఖాతాలకు వేయాల్సిన నిధులు ఎంఈవోల ఖాతాలకు బదిలీ
- వేసవి సెలవులు ఇచ్చినా విడుదల చేయని ఎంఈవోలు
- సొంతానికి వాడేసుకున్న పలువురు ఎంఈవోలు!
- డీఈవోకు ఫిర్యాదు చేసిన హెచ్‌ఎంల అసోసియేషన్
- అయినా చర్యలు శూన్యం



చినమోదుగపల్లి గ్రామంలో హెచ్‌ఎం చొరవతో తీర్చిదిద్దిన కిచెన్ గార్డెన్ (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట): జిల్లా వ్యాప్తంగా 693 పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు రూ.5 వేలు చొప్పున ప్రభుత్వం కిచెన్ గార్డెన్ల నిర్వహణకు రూ.34.65 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులను నేరుగా ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంల ఖాతాలకు బదిలీ చేయకుండా ఎంఈవో-1ల ఖాతాలకు పంపింది. నెలరోజులు దాటి పోయినా ఎంఈవోలు సొంత ఖాతాల్లో పడిన కిచెన్ గార్డెన్ నిధులను విడుదల చేయలేదు. పలుమార్లు హెచ్‌ఎంల అసోసియేషన్ నాయకులు డీఈవో దృష్టికి తీసుకెళ్లిన పరీక్షల హడావుడి అంటూ దాటవేసుకుంటూ వచ్చారు. ఈ రూ.34.65 లక్షల నిధులు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు ఐదుగురు ఎంఈవో-1ల ఇన్‌చార్జుల ఏలుబడిలోనే ఉండటంతో వాళ్ల ద్వారానే బదిలీ చేయాల్సి

మిగతా 6లో..

### వెంటనే నిధులు విడుదల చేయాలి



ఇప్పటికైన కిచెన్ గార్డెన్ నిధులను ఎంఈవోలు ఆయా ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంల ఖాతాలకు బదిలీ చేయాలి. మా సంఘం గట్టిగా కోరితే గాని వారం క్రితం కొంతమంది ఎంఈవోలు తప్పదని విడుదల చేశారు. మిగిలిన ఇద్దరు ఎంఈవోల నుంచి కూడా పాఠశాలలకు నిధులు బదిలీ చేయించాలి. ఇకపై హెచ్‌ఎంల ఖాతాలకు నేరుగా నిధులు బదిలీ చేయాలని డీఈవోను కోరుతున్నాం.

\- రాంబాబునాయక్, జిల్లా హెచ్‌ఎంల అసోసియేషన్ అధ్యక్షుడు


## ఖాళీ పోస్టులు భర్తీ చేయండి

- పదోన్నతులకు వెంటనే అనుమతులు ఇవ్వాలి
- ఆర్టీసీ ఈయూ డిమాండ్

6

## తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

6

## బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య!

- మృతిపై భిన్న కథనాలు

6

## అంబేడ్కర్‌ను అవమానపరిచింది కాంగ్రెస్సే

- మంత్రి సత్యకుమార్ యాదవ్

6


# చిక్కలేక చిక్కుల్లో పడిన దొంగ!

## పోలీసులను చూసి భవనం పైనుంచి దూకిన వైనం



భవనం పైనుంచి దూకి గాయాలపాలైన దొంగ దుర్గారావు

- కాళ్లూ చేతులు, తలకు తీవ్ర గాయాలు
- మండపేటలో 9 చోరీ కేసులు
- కొద్దిరోజుల క్రితం నగరంలో చోరీ

విజయవాడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఓ పాత దొంగ ఊరు మారినా తీరు మార్చుకోలేదు. మరోసారి చోరీకి తెగబడ్డాడు. పోలీసులు ఆధారాలు సేకరించి పట్టుకోవడానికి వెళ్లగా, రెండంతస్తుల భవనం పైనుంచి దూకేసి ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటన విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్‌లో ఆదివారం జరిగింది. కోనసీమ జిల్లా మండపేటకు చెందిన రాయుడు దుర్గారావు వ్యాన్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలోనే అతడు చోరీలకు అలవాటుపడ్డారు. భార్య వదిలిపెట్టి వెళ్లిపోయింది. మండపేట టౌన్, రాయవరం, రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్లలో అతడిపై తొమ్మిది చోరీ కేసులు ఉన్నాయి. ఆరేళ్లుగా మండపేట పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. మండపేటకు చెందిన ఓ మహిళను తీసుకుని ఈనెల 14వ తేదీన అజిత్‌సింగ్‌నగర్‌కు చేరుకున్నాడు. షాదీఖానా సమీపంలో రెండంతస్తుల భవనంపై ఉన్న గదిని అద్దెకు తీసుకున్నాడు. ఆ మహిళను తన భార్యగా పరిచయం చేశాడు. అజిత్‌సింగ్‌నగర్‌లో ఉంటున్న ఓ రైల్వే రిటైర్డ్ ఉద్యోగి వద్ద కేర్ టేకర్‌గా చేరాడు. ఈక్రమంలో ఈ నెల 15న వాంబేకాలనీ హెచ్ బ్లాక్‌లో ఓ షాపు తాళాలను పగులగొట్టి అందులో ఉన్న రూ.1.60 లక్షలు దొంగిలించి పారిపోయాడు. దీనిపై నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీం పోలీసులు ఘటనాస్థలంలో వేలిముద్రలను సేకరించి పరిశీలించగా, దుర్గారావు ఫొటో కంప్యూటర్‌లో కనిపించింది. దీంతో అతడి కోసం సీసీఎస్ పోలీసులు గాలిస్తున్నారు. అతడి సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేయగా, ఒడిశాలో ఉన్నట్టు తేలింది. తిరిగి దుర్గారావు శనివారం విజయవాడకు రాగా, అజిత్‌సింగ్‌నగర్‌లో గదిలో ఉన్నాడని తెలుసుకుని పట్టుకోవడానికి పోలీసులు జీపులో వెళ్లారు. వారు రావడాన్ని భవనం పైనుంచి గమనించిన దుర్గారావు వెంటనే వెనుక వైపు నుంచి దూకేశాడు. భవనానికి వెనుక వైపు ఉన్న రేకుల షెడ్ ప్రాంగణంలో నేలపై పడటంతో అతడి కాళ్లూ చేతులు విరిగిపోయాయి. తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అతడిని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దుర్గారావుతో వచ్చిన మహిళ పరారైంది.



దుర్గారావు దూకిన భవనం



మంత్రి సత్యకుమార్ 'ఆంధ్రజ్యోతి'లో రాస్తున్న వ్యాసాల సంపుటి రెండో భాగం పుస్తకాన్ని నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఆవిష్కరిస్తున్న కేంద్ర బొగ్గు, గనుల శాఖామంత్రి జి.కిషన్‌రెడ్డి, మంత్రులు నాదెండ్ల మనోహర్, వై.సత్యకుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

6లో



నగరంలోని మాకినేని బసవపున్నయ్య (ఎంబీ భవన్) విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ నాయకుడు వల్లూరి శివప్రసాద్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సదస్సులో మాట్లాడుతున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, చిత్రంలో విద్యావేత్తలు, విద్యావంతులు

6లో



మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

## ఖాళీ పోస్టులు భర్తీ చేయండి

» పదోన్నతులకు వెంటనే అనుమతులు ఇవ్వాలి

» ఆర్టీసీ ఈయూ డిమాండ్

బస్‌స్టేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయటంతో పాటు పదోన్నతులకు వెంటనే అనుమతి ఇవ్వాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. విజయవాడలోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన జోన్ ఎగ్జిక్యూటివ్ సమావేశం జోనల్ అధ్యక్షుడు ఎం.ఎ్‌స.రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా కారుణ్య నియామకాలు తప్ప నోటిఫికేషన్‌తో ఒక్క పోస్టు భర్తీ చేయలేదని చెప్పారు. సుమారు 11వేల పోస్టులు వివిధ కేటగిరిల్లో ఖాళీగా ఉన్నాయని, వీటన్నింటినీ భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిద్వారా బడుగు, బలహీన వర్గాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అన్ని కేటగిరిల లోని పోస్టులను భర్తీ చేయాలని, పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియవింపాలని, రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్ మాట్లాడుతూ, ఎంప్లాయిస్ హెల్త్ ఇన్సూరెన్సూ స్కీమ్ ద్వారా కనీస వైద్య సౌకర్యాలు కూడా అందటం లేదన్నారు. పాత పద్ధతిలో వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి సి.నబీ రసూల్ మాట్లాడుతూ, 2019లో జారీ చేసిన సర్క్యులర్-1ను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టిందని, దీనిని అమలు చేయాలని కోరారు. కోశాధికారి ఎండీఏ సిద్దిఖ్, ఉపాధ్యక్షుడు మండపాటి శంకర్‌రావులు మాట్లాడుతూ, కొత్త కంప్యూటర్, ప్రింటర్ పనిచేసే ప్రదేశాలలో సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలాజీ, టివి భవానీ, కోటేశ్వరరావు, చక్రవర్తి, నారాయణ, ఆలీ తదితరులతో పాటు జోన్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న నేతలు

## కేశినేని నానిపై చర్యలు తీసుకోండి

» ఎ.కొండూరు స్టేషన్‌లో టీడీపీ నేతల ఫిర్యాదు

ఎ.కొండూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, నిరుద్యోగులకు ఉపాధికల్పన కోసం సీఎం చంద్రబాబు తీసుకొంటున్న చర్యలను చూసి ఓర్వలేక మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) సోషల్ మీడియా వేదికగా అసత్య ఆరోపణలు చేస్తున్నరని తిరువూరు మాజీ ఏఎంసీ చైర్మన్ అలవాల రమేష్‌రెడ్డి అన్నారు. పరిశ్రమల స్థాపన కోసం పెట్టుబడిదారులు ముందుకు వస్తుంటే మతిభ్రమించిన శ్రీనివా్‌స(నాని) కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)పై వ్యక్తిగత కక్ష సాధింపులకు పాల్పడుతున్నరని విమర్శించారు. విజయవాడ పార్లమెంట్ కార్యాలయానికి ఆంధ్రుల ఆరాధ్య దైవం ఎన్టీఆర్ పేరు పెడితే, ఎక్స్ వేదికగా విమర్శలు చేయడం నాని అవివేకానికి నిదర్శనమని, ఈ చర్య ఎన్టీఆర్‌ను అవమాన పరచడమేనన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్న కేశినేని శ్రీనివాస్(నాని)పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నేతలు రాంప్రసాదరెడ్డి, భీమానాయక్, పీక్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ మన్మథరావు

మచిలీపట్నం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వి.మన్మధరావును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నం ఏఎంసీలో జనరల్ సర్జరీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనను మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

### బాలికపై అత్యాచారయత్నం ఘటన..

## ఏపీటీడీసీలో డ్రైవర్ల విచారణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) బస్సులో ఓ బాలికపై అత్యాచారయత్నం ఘటనలో దుండగుడిని ఎక్కించుకున్న బస్సు డ్రైవర్ల విచారణ రెండు రోజులుగా జరుగుతోంది. ఆటోనగర్‌లోని ఏపీటీడీసీ ప్రధాన కార్యాలయంలో ఇద్దరు డ్రైవర్లను ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి తిరుపతికి ప్యాకేజీ కింద భక్తులను తీసుకొచ్చే టీఎన్ 07ఏబీ8229 నెంబర్ బస్సులో ఇటీవల మార్గమధ్యలో అనధికారికంగా ఓ ప్రయాణికుడిని ఎక్కించుకున్నారు. బస్సులో సీట్లు ఖాళీగా ఉండటంతో ఓ బాలిక వెనుక సీట్లో పడుకుంది. మార్గమధ్యలో ఎక్కిన దుండగుడు అందరూ నిద్రపోతున్న సమయంలో బాలికపై అత్యాచారయత్నం చేయగా, బాలిక కేకలు వేయటంతో అందరూ మేల్కొన్నారు. దీంతో ఆ ప్రయాణికుడిని బస్సు డ్రైవర్లు దించివేశారు. దీనిపై తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ ప్రముఖ మోటార్ కంపెనీ అధినేత అక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయం చెప్పటంతో పాటు ఆర్టీసీకి ఈ-మెయిల్ చేయటంతో విషయం వెలుగులోకి వచ్చింది. మెయిల్ అందుకున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు అది తమ బస్సు కాదని, ఏపీటీడీసీకి చెందిన బస్సుగా నిర్ధారించి ఆ శాఖ ఎండీకి మెయిల్‌ను పంపారు. దీంతో ఏపీటీడీసీ ఎండీ విచారణకు ఆదేశించటంతో.. తక్షణం బాధ్యులైన డ్రైవర్లను విధుల నుంచి తప్పించారు. విజయవాడ హెడ్డాఫీసులో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఆ ఇద్దరు డ్రైవర్లు రెండు రోజులుగా విజయవాడ హెడ్డాఫీసులో విచారణను ఎదుర్కొంటున్నారు. అనధికారికంగా బస్సులో ప్రయాణికులను ఎక్కించుకోవటం బయటపడుతుందన్న ఉద్దేశంతో అత్యాచారయత్నం చేసిన దుండగుడిని డ్రైవర్లు వదిలిపెట్టడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. దుండగుడి దగ్గర రూ.200కు ఆశపడి బస్సులోకి ఎక్కించుకున్నట్టు తెలుస్తోంది. తమిళనాడుకు చెందిన బాలికపై అత్యాచారయత్నం ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ సీరియస్ కావటంతో పాటు విచారణకు ఆదేశించటంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. డ్రైవర్ల నుంచి దుండగుడి సమాచారాన్ని సేకరించారు.

## షటిల్ విజేత విజయవాడ

» ముగిసిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుమ్మడి పవన్‌కుమార్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి షటిల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో ఈనెల 26, 27 తేదీలలో జరిగిన పోటీలలో పురుషుల విభాగం ఇన్విటేషన్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు బెంగళూరుకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో విజయవాడకు చెందిన హిమదీప్-వంశీలు ప్రథమ స్థానంలో నిలవగా, రేపల్లె జట్టు హేమంత్-మునీర్ ద్వితీయ స్థానంలో నిలిచారు. మూడోస్థానం నెల్లూరు కైవసం చేసుకోగా, నాల్గో స్థానం విజయవాడ దక్కించుకుంది. ఈ మేరకు నిర్వాహకులు విజేతలను బహుమతి ప్రదానం చేశారు.

# ఓబీసీ కులగణన జరపాలి

» బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు



మాట్లాడుతున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు

వన్‌టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఓబీసీలకు కులగణన జరిపి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు కోరారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు ఆయన వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని విమర్శించారు. న్యాయం కోసం అంబేడ్కర్, పూలే విగ్రహాలకు వినతి పత్రాలు అందజేశానన్నారు. జనాభా లెక్కలతో పాటు బీసీలకు సమగ్ర కులగణన జరగాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు ఇంకోలా పార్టీలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయన్నారు. కులగణన డిమాండ్‌తో ఇకపై ప్రత్యక్ష పోరాటాలు చేస్తామన్నారు. దేశ జనాభాలో 52 శాతంగా ఉన్న ఓబీసీల సంక్షేమ అభివృద్ధి కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుంటే పోలీసులు వేధించి అరెస్టు చేయటం అన్యాయమన్నారు. ఆదివారం బందరురోడ్డులో ర్యాలీ ప్రదర్శన చేస్తుండగా పోలీసులు శంకరరావును అరెస్టు చేసి.. తరువాత విడుదల చేశారు. కుమ్మరి క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ మూర్తి, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సత్యకాలం వ్యాసాలు నేటి పాలకులకు గైడ్

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మొగల్రాజపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : 'సత్యకాలం' పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రతి మంగళవారం సత్యకుమార్ రాసిన వ్యాసాల సంకలనాలు నేటి రాజకీయ నాయకులకు, విద్యార్థులకు, రాజకీయాల్లో వచ్చే వారికి గైడ్ వంటివని కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. మంత్రి సత్యకుమార్ 'ఆంధ్రజ్యోతి'లో రాస్తున్న వ్యాసాల సంపుటి రెండోభాగం పుస్తకావిష్కరణ విజయవాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, రాజకీయ నాయకులు, సామాజికవేత్తలు, విశ్లేషకులు వివిధ పత్రికల్లో వ్యాసాలు రాయడం ఒక అవసరమని వ్యాఖ్యానించారు. ఆ కోవలోనే సత్య వ్యాసాలు రాసినా వాటి ప్రత్యేకత వేరని చెప్పారు. ఒక కార్యకర్తగా ప్రయాణం ప్రారంభించిన సత్యకుమార్ 2019 నుంచి మంత్రి అయ్యేవరకు ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా వ్యాసాలు రాయడం స్ఫూర్తిదాయకమన్నారు. అది అందరికీ సాధ్యం కాదన్నారు. సత్యను ప్రోత్సహించి వ్యాసాలు ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. వెంకయ్యనాయుడు వద్ద సహాయకుడిగా పనిచేసి దశలవారీగా సత్యకుమార్ ఎదిగారన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజకీయ నాయకులకు సమాజంపై అవగాహన ఉంటుంది కానీ, దానికి అక్షరరూపం ఇవ్వడం అందరికీ సాధ్యం కాదని, దాన్ని సత్యకుమార్ చేసి చూపించాడని చెప్పారు. సత్యకుమార్ వ్యాసాలు చదువుతుంటే.. ప్రస్తుత సమాజ తీరు, ప్రజలు పడుతున్న కష్టాలు, ఆ కష్టాలను పోగొట్టడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని అడ్డుకుంటున్న శక్తుల గురించి లోతుగా అధ్యయనం చేసినట్టు స్పష్టమవుతుందన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, ఈ రోజుల్లో యువతకు సమాజం, ప్రజల సమస్యల పట్ల అవగాహన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువత పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని, రాష్ట్రం గురించి తెలుసుకోవాలని చెప్పారు. సత్యకుమార్ వ్యాసాలు చదివితే యువతకు జాతీయ అంతర్జాతీయ అంశాలపై అవగాహన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, ప్రముఖ వైద్యుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్‌ను అవమానపరిచింది కాంగ్రెస్సే

» మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

విద్యాధరపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచింది, ఆయన ఆశయాలను తుంగలో తొక్కింది కాంగ్రెస్ పార్టీయేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం అంబేడ్కర్ 137వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని జాతికి అందించిన అంబేడ్కర్ గురించి కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. అంబేడ్కర్ ఆశయాలను ప్రజలకు అందిస్తున్నది ప్రధాని మోదీ అని, ఆయన రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడి పనిచేస్తున్నారని కొనియాడారు. రిజర్వేషన్‌ల వలన అసమర్థులుగా మారతారని కాంగ్రెస్ నేతలు అనేకసార్లు చెప్పారని మంత్రి సత్యకుమార్ విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గసభ్యురాలు బొడ్డు నాగలక్ష్మి, ఐఏఎస్ అకాడమీ ట్రైనర్ విజయకుమార్ పాల్గొన్నారు.

# గ్రంథాలయాల పట్ల ఆసక్తి పెంచాలి

» ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్



సదస్సులో ప్రసంగిస్తున్న బుద్ధప్రసాద్

గవర్నర్‌పేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయాల ఆవశ్యకతపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి రచయితలు, పుస్తక ప్రచురణకర్తలు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, ప్రజా సంఘాల నేతలు హాజరయ్యారు. వేదిక ఆధ్వర్యంలో వెలువరించిన వ్యాస సంకలనం గ్రంథాలయ విజ్ఞానం పుస్తకాన్ని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పరిమి, బుద్ధప్రసాద్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువు, భాష, విజ్ఞానం పట్ల ఆసక్తి పెంచాలని, వారు గ్రంథాలయాలకు వెళ్లేలా ప్రోత్సహించాలని కోరారు. పట్టణాలలో కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ శాతం గ్రంథాలయాలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టెక్నాలజీ ఎంత పెరిగినా పుస్తకాల ప్రాముఖ్యత తగ్గలేదని, వేదిక ఆధ్వర్యంలో ప్రజలు గ్రంథాలయాల వైపు వెళ్లేలా, పుస్తక పఠనంపై శ్రద్ధ పెట్టేలా ప్రచారం జరగాలని కోరారు. విరపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, గ్రంథాలయాల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, ఉన్నత విద్య, సివిల్స్ పోటీ పరీక్షలకు వెళ్లే వాళ్లలో ఎక్కువ శాతం గ్రంథాలయాల మీద ఆధారపడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. వేదిక అధ్యక్షుడు నల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ, గ్రంథాలయ ఉద్యమం మొదలైన విజయవాడ వేదికగానే గ్రంథాలయ పునర్వికాస ఉద్యమాన్ని మొదలుపెట్టినట్టు చెప్పారు. ఉద్యమంలో భాగంగా సమస్యలపై ప్రభుత్వానికి వినతిపత్రాలు, పరిష్కారాలకై ఒత్తిడి తేవడం జరుగుతుందని తెలిపారు. సదస్సులో గ్రంథాలయ ప్రముఖులు రావి శారద, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలు పెనుగొండ లక్ష్మీనారాయణ, పాపినేని శివశంకర్, వివిధ సంఘాల నేతలు ప్రసంగించారు. సదస్సులో పలు తీర్మానాలు ఆమోదించారు.

# కిచెన్ గార్డెన్ నిధులు హాంఫట్!

(5వ పేజీ తరువాయి)

ఉంది. హెచ్‌ఎంలకు వీరు అందుబాటులో ఉండకపోవటం, హెచ్‌ఎం నిధులు ఇవ్వలేదని ప్రశ్నించే సాహసం చేయకపోవటంతో అంతా సద్దుమణిగిందని భావించారు. హెచ్‌ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్ మరోసారి డీఈవోకు ఫిర్యాదు చేయటంతో జిల్లాలో కొందరు ఎంఈవోలు కొద్ది రోజుల క్రితం నిధులు డ్రా చేసినట్టు తెలుస్తుంది. విజయవాడ రూరల్ ఎంఈవో ఏ.వెంకటరత్నం, మరో విజయవాడ సెంట్రల్ ఎంఈవో సాంబశివరావు మాత్రం ఇంతవరకు స్పందించలేదు. వారిద్దరి పరిధిలో నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలోని కంచికచర్ల, వత్సవాయి, వీరులపాడు, విజయవాడ నార్త్, విజయవాడ రూరల్, విజయవాడ సెంట్రల్ మండలాలు ఉన్నాయి. జిల్లాలోని సగం పాఠశాలలకు నిధులు విడుదల కాకపోవటంతో కిచెన్ గార్డెన్‌ల నిర్వహణకు నోచుకోలేదు. ఇచ్చిన ఎంఈవోలు సైతం ఈ నెలాఖరికి విడుదల చేయటం వల్ల ఫలితం లేకుండా పోయింది. స్కూళ్లకు సెలవులు ఇవ్వటం వల్ల నిధులు సద్వినియోగం కాలేదు. పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించే ఆకుకూరలు, కాయగూరలు పెంచటం, పిల్లలకు గార్డెనింగ్‌పై అవగాహన కల్పించే లక్ష్యంతో ఇచ్చిన నిధులు పక్కదారి పట్టాయి. ప్రభుత్వ నిధులు నేరుగా హెచ్‌ఎంల వ్యక్తిగత ఖాతాలకు బదిలీ చేసే అవకాశం ఉన్నా మధ్యలో ఎంఈవోల ద్వారా పంపిణీ చేయటం వెనుకున్న కారణం ఏమై ఉంటుందని పలువురు హెచ్‌ఎంలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### జగ్గయ్యపేటలో యూనియన్ నేత ద్వారా పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఆర్‌టీజీఎస్ ద్వారా బదిలీ చేయాల్సిన ఈ నిధులను యూనియన్ నేత ద్వారా పంపిణీ చేయటం చర్చనీయాంశమైంది. ఎప్పుడు హెచ్‌ఎంల ఖాతాలకు బదిలీ చేసేవారని ఈ దఫా ఒక యూనియన్ నేతకు ఎంఈవో-1 డబ్బులు ఇచ్చి పంపిణీ చేయించారు. హెచ్‌ఎంల అసోసియేషన్ ఈ నిధుల కోసం పెద్ద పోరాటం చేస్తే గాని ఇంకా సగం మండలాలకు నిధులు విడుదల చేయలేదు. ఎన్టీఆర్ జిల్లాలో తిరువూరు, గంపలగూడెం మండలాల్లోనే కిచెన్ గార్డెన్ నిధులు గత మార్చిలో విడుదల చేశారు. అక్కడ ఎంఈవోలకు ఉన్న శ్రద్ధ, బాధ్యత ఇతర ఎంఈవోలలో లోపించటం బాధాకరమని హెచ్‌ఎంలు పేర్కొంటున్నారు.

### ముందుగా ఇచ్చి ఉంటే బాగుండేది

ఎప్పుడు నవంబరులో వచ్చే నిధులు ఈసారి ఆలస్యంగా వచ్చాయి. అవి ఇంకా విడుదల చేయలేదు. ముందుగా ఇచ్చి ఉంటే గార్డెన్‌ను మరింతగా తీర్చిదిద్దేవాళ్లం.

-ఎం.జయశ్రీ, హెచ్‌ఎం

# నైపుణ్యమస్తు!

(5వ పేజీ తరువాయి)

తగిన నైపుణ్యం కూడా అవసరం. దీనిని దృష్టిలో పెట్టుకొని సాంకేతిక, డిజిటల్ మార్కెటింగ్ రంగాలకు సంబంధించి సుమారు 16 అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం-నా స్కామ్), వెబ్ సర్వీసెస్(అమెజాన్), మిలియన్ లెర్నర్స్, ఎంఎస్ ఆఫీస్ (నా స్కామ్), ఏఐ (అసెండ్), సాఫ్ట్ స్కిల్స్, డిజిటల్ మార్కెటింగ్, పైథాన్, డిజిటల్ 101 (నా స్కామ్), జావా, సాఫ్ట్ స్కిల్స్ (ఉన్నతి), హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్, టాలీ - జీఎస్టీ, సేల్స్ అండ్ మార్కెటింగ్ ట్రైనింగ్ (హిందుస్తాన్ కోకో కోలా బేవరేజెస్), కంప్యూటర్ ఫండమెంటల్స్ వంటి కోర్సులలో శిక్షణ కల్పిస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) కోర్సులు పట్ల అత్యధికంగా విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. దాదాపుగా 1,814 మంది ఈ కోర్సును నేర్చుకోవడానికి ఆయా కాలేజీలలో రిజిస్టర్ అయ్యారు. ఈ కోర్సులలో జాయిన్ అయిన వారంతా కూడా విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరికి ఇంకా సర్టిఫికెట్లు అందించాల్సి ఉంది. రెండో అత్యధికంగా అమెజాన్ అందిస్తున్న వెబ్ సర్వీసెస్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 373 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. మరో 286 మంది శిక్షణ పొందుతున్నారు. ఆ తర్వాత ఎంఎస్ ఆఫీస్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్, పైథాన్, జావా డిజిటల్ మార్కెటింగ్ కోర్సుల పట్ల ఎక్కువగా ఆసక్తి చూపించారు.

### జిల్లాలో 15 కాలేజీల ఎంపిక

ఈ కోర్సులను అందించడానికి ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా 15 కాలేజీలను ఎంపిక చేసుకుంది. ప్రతిభ మోడల్ డిగ్రీ కాలేజి (తిరువూరు), కేబీఎన్ డిగ్రీ కాలేజి (విజయవాడ), సయ్యద్ అప్పలస్వామి డిగ్రీ కాలేజి (విజయవాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (విజయవాడ), ఎస్ఆర్ఆర్ కాలేజీ (విజయవాడ), నలంద డిగ్రీ కాలేజీ (విజయవాడ), దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల (విజయవాడ), ఆంధ్రా లయోలా కాలేజీ-పీజీ (విజయవాడ), ఆంధ్రా లయోలా కాలేజీ - అటానమస్ (విజయవాడ), పీబీ సిద్ధార్థ కాలేజీ (విజయవాడ), జాకీర్ హుస్సేన్ కాలేజీ (ఇబ్రహీంపట్నం), ఎల్‌హెచ్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ (మైలవరం), ఎస్‌జీఎస్ కాలేజీ (జగ్గయ్యపేట)లలో ఈ కోర్సులకు సంబంధించి అత్యున్నత శిక్షణ ఇస్తున్నారు.

### నిరుద్యోగులకు జాబ్ ఫెయిర్స్‌తో ఉద్యోగాల కల్పన

జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో పదిచోట్ల జాబ్ మేళాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పది చోట్ల మొత్తం 28 జాబ్ ఫెయిర్స్ నిర్వహించారు. జాబ్ ఫెయిర్స్‌కు 2,303 మంది అభ్యర్థులు హాజరు కాగా, 905 మందికి ఉద్యోగాలు వచ్చాయి.



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

## తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

నందిగామ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : దిక్కుతోచని స్థితిలో ఉన్న బాలికను శక్తి టీమ్ ఆదుకుని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన నందిగామలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన బాలిక(13) శుక్రవారం రాత్రి పట్టణ శివారు అనాసాగరం చేరుకుంది. అక్కడ ఓ ఫంక్షన్‌లో భోజనం చేసి దీనంగా చూస్తుండడంతో స్థానికులు వివరాలు అడిగారు. బాలికకు తెలుగు రాకపోవడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అభిమన్యు నేతృత్వంలో శక్తి టీమ్ పాప నుంచి వివరాలు సేకరించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చిరునామా ట్రేస్ చేశారు. బాలిక పేరు మమతాదేవిగా గుర్తించి బిహార్ రాష్ట్రానికి చెందినదిగా నిర్ధారించుకున్నారు. బీహార్ అజమ్‌నగర్ సీఐ సహాయంతో పాప తల్లిదండ్రుల వివరాలు సేకరించారు. పాప తల్లిదండ్రులు రీతాదేవి, శివనారాయణ సాహూ అని, ఉపాధి కోసం పలురాష్ట్రాలు తిరుగుతూ ఉంటారని తెలిపారు. తమ కుమార్తె నందిగామ స్టేషన్‌లో ఉందన్న విషయం తెలుసుకొని తల్లిదండ్రులు హుటాహుటిన తరలివచ్చారు. కుమార్తెను అప్పగించిన ఎస్ఐ అభిమన్యుకు, శక్తిటీమ్ సభ్యురాలు కవిత, ఎస్ఐ రవికుమార్‌లకు వారు ధన్యవాదాలు తెలిపారు.

బీహార్ రాష్ట్రం నుంచి పొట్టకూటి కోసం శివనారాయణ సాహూ దంపతులు కుమార్తె మమతతో కలిసి విజయవాడ సమీపంలోని గంగూరు వచ్చి తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సాహూ దంపతులు పనికి వెళ్లగా 13 ఏళ్ల కుమార్తె అక్కడి నుండి తప్పిపోయింది. రాత్రి సమయానికి అనాసాగరం చేరుకుంది. సాహూ దంపతులు రాత్రి సమయానికి కూడా కుమార్తె ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందారు. వేల కిలోమీటర్ల మేర పొట్టకూటి కోసం వచ్చి ఇటువంటి దుస్థితిని ఎదుర్కోవడం చూపరులను కలచి వేసింది.

## బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య!

» మృతిపై భిన్న కథనాలు



సంగీతరావు (ఫైల్)

జగ్గయ్యపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తిరువూరులో ఓ ప్రైవేట్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్న వేల్పుల సంగీతరావు ఆదివారం ఉదయం పట్టణ పరిధిలోని తొర్రగుంటపాలెంలో తన నివాసంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. జగ్గయ్యపేట ఎస్ఐ జి.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సంగీతరావు (35) ఆదివారం ఉదయం సుమారు 7 గంటలకు భార్య, కుమారుడు నిద్రిస్తుండగా, వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొద్ది సేపటికి గమనించిన భార్య ఇరుగుపొరుగును పిలిచి తలుపులు తీయించి జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతిపై భిన్న కథనాలు వినబడుతున్నాయి. పెనుగంచిప్రోలుకు చెందిన సంగీతరావు జగ్గయ్యపేట బ్రాంచిలో పనిచేస్తున్నప్పటి నుంచి తొర్రగుంటపాలెంలో నివాసం ఉంటున్నాడు. తొర్రగుంటపాలెంకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం గురించి భార్యకు తెలియటంతో వివాదాలు జరుగుతున్నాయని, బ్యాంకులో అవకతవకలు కూడా ఓ కారణమని తెలుస్తోంది. మృతుడి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## యువకుడి దారుణ హత్య!

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తిరుమలగిరి శివారులో యువకుడి దారుణహత్య స్థానికంగా కలకలం రేపింది. మృతుడు తెలంగాణాలోని సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన షేక్ నాగుల్‌మీరా అలియాస్ ఫిరోజ్ (23)గా గుర్తించారు. చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ కథనం మేరకు.. నాగుల్‌మీరా కోదాడలో వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడని, శనివారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు వచ్చి తమ కుమారుడిని బైకుపై తీసుకెళ్లటం వరకే తమకు తెలుసని, వారు స్నేహితులు అనుకున్నామని మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. మృతుడి జేబులో కొద్దిమొత్తంలో గంజాయి లభించినట్టు సమాచారం. అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడని స్థానికుల ఫిర్యాదు మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సూర్యశ్రీనివాస్ దర్యాప్తు చేసి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## పెట్టుబడికి రెట్టింపు అంటూ..

(5వ పేజీ తరువాయి)

నుంచి వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఈ డబ్బులను జమ చేయడానికి సత్యనారాయణపురంలోని యాక్సిస్ బ్యాంక్‌కు చెందిన మూడు ఖాతాల్లో ఈ డబ్బులను జమ చేయించుకున్నట్టు సమాచారం. ఇప్పటి వరకు బాధితులు తమ డబ్బుల కోసం ఫోన్ చేసినా, సందేశాలు పంపినా స్పందించని కిరణ్ ఇప్పుడు నేరుగా సెల్ఫీ వీడియోలో ప్రత్యక్షమయ్యాడు. తాను ఇప్పటికీ సచ్చీలుడునేనని చెప్పుకొచ్చాడు. తన సమయమంతా ఫోన్లు చేసిన వారికి సమాధానాలు చెప్పడానికే సరిపోతుందని, తనకు ఇతర సంస్థల నుంచి డబ్బులు అందగానే అందరికీ చెల్లింపులు చేస్తానని వీడియోలో వివరించాడు. ఇక నుంచి పెట్టుబడిదారులతో నిత్యం పది నిమిషాలు మాట్లాడతానని భరోసా ఇచ్చాడు. ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బులతో కిరణ్ తన ఇద్దరు సన్నిహితులతో రెండు వేర్వేరు కంపెనీలు ఏర్పాటు చేయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు అరెస్టు చేసి కిరణ్‌ను జైలుకు పంపితే తమకు నయాపైసా రాదని భావించిన బాధితులు కొందరు ఇంకా అతడి మాయలోనే ఉన్నారు. సత్యనారాయణపురం పీఎస్‌లో ప్రస్తుతం ఇద్దరు బాధితులు మాత్రమే ఫిర్యాదు చేశారు. కిరణ్‌పై ఇప్పటికే గుంటూరు జిల్లాలో పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బులతో తన కుటుంబ సభ్యుల పేరున భారీగా ఆస్తులను కొనుగోలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా పోలీసులు దర్యాప్తులో ఏవిధంగా అడుగులు వేస్తున్నారన్న విషయాలను కిరణ్‌కు ఇక్కడి నుంచి ఇద్దరు, ముగ్గురు అనుచరులు చేరవేస్తున్నట్టు సమాచారం.

## ఏపీటీఏలో అరాచకం!

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు ఉన్నాయి. సంస్థలో జరుగుతున్న వ్యవహారాలను తెలిసి కూడా డిప్యూటీ సీఈవో ఉన్నతాధికారిణి దృష్టికి తీసుకువెళ్లటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఈవెంట్స్ పేరుతో దోపిడీ

కొందరు అవినీతి కాంట్రాక్టు ఉద్యోగులు వెలగబెడుతున్న వ్యవహారాలు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. ఏపీటీఏలోకి వచ్చిన తర్వాత అవినీతి మార్గాలు తెలిసిన కొందరు కీలక స్థానాలను కైవసం చేసుకున్నారు. ఇలా కీలక స్థానాలను కైవసం చేసుకున్న వారు అందిన కాడికి అవినీతికి పాల్పడుతున్నారన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఏపీటీఏ నిర్వహించే ఫెస్టివల్స్, ఇతర ఈవెంట్స్‌కు సంబంధించి అంచనాలు పెంచేసి తమవారికి కట్టబెడుతున్నారన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. వీటికి సంబంధించి ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదులు అందాయి. సంస్థ నేతృత్వంలో నిర్వహించే వేడుకలు, ఫెస్టివల్స్ ఈవెంట్స్‌కు సంబంధించి పాల్గొనే అర్హత కలిగిన కంపెనీలను కూడా కొందరు కాంట్రాక్టు ఉద్యోగులే నిర్దేశించారని తెలుస్తోంది. తమకు కావాల్సిన వాటినే ఎంపిక చేసి.. మిగిలిన వాటిని తిరస్కరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఎంపిక చేసిన సంస్థలలో ఒకే సంస్థకు ఎక్కువ సార్లు ఈవెంట్లు దక్కటం గమనార్హం. ఈ ఈవెంట్ల మాటున ఆయా సంస్థల నుంచి భారీ ఎత్తున కమీషన్లు దండుకుంటున్నట్టు తెలుస్తోంది. మార్కెట్‌లో రేటు కంటే అంచనాలలో చూపే రేట్లు ఎక్కువగా ఉంటున్నాయన్న తీవ్ర ఆరోపణలు వస్తున్నా ఏ రోజున కూడా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించకపోవటం గమనార్హం. ఈవెంట్లకు సంబంధించి చూస్తే పెండింగ్ బిల్స్ ఉన్న కాంట్రాక్టర్లతో సంస్థపైనే కేసులు వేయించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ కేసుల విషయంలో సంస్థ ఓడిపోయేలా బలహీన వాదనలు వినిపించారన్న విమర్శలు కూడా ఉన్నాయి.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 135,144, 155 |
| చికెన్ విత్ స్కిన్ | 260 |
| చికెన్ స్కిన్‌లెస్ | 270 |

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 430



## అంగరంగ వైభవంగా గంగానమ్మ జాతర

**పటమట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):** పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లోని గంగానమ్మ అమ్మవారి జాతరను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దీవెనలు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. 14.వ డివిజన్ కార్పొరేటర్ చింతల సాంబయ్య, గద్దె కల్యాణ్ పాల్గొన్నారు.



హనుమంతరాయ గ్రంథాలయంలో నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

## ఘనంగా నృత్య దినోత్సవం

**విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :** దృశ్య వేదిక సాంస్కృతిక సంస్థ అధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం ప్రాంగణంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 70 మంది శాస్త్రీయ నర్తకులు తమ ప్రతిభతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. సీనియర్ కూచిపూడి నాట్యాచార్యులు వేదాంతం పాండురంగ శర్మ, యువ కూచిపూడి నర్తకి గోనుగుంట సత్యానందినిని దృశ్యవేదిక నిర్వాహకులు సత్కరించారు. ముఖ్య అతిథిగా హ్యాపీ రిసార్ట్స్ అండ్ రిక్రియేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అంబటి మధుమోహనకృష్ణ విచ్చేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు దొంతాల ప్రకాష్, డాక్టర్ హిమసాగర చంద్రమూర్తి, ఎన్ఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.



ఆయుధం లాంటి మనిషి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి పాపినేని శివశంకర్, డీఎస్పీ తేజేశ్వరరావు తదితరులు

## ఆయుధం లాంటి కవి సుధాకర్ : పాపినేని

**విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :** లోసారి సుధాకర్ ఆయుధం లాంటి కవి అని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ కితాబిచ్చారు. నగరంలోని ఓ హోటల్‌లో లోసారి సుధాకర్ నాలుగవ సంపుటి ఆయుధం లాంటి మనిషి పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. బండ్ల మాధవరావు, పలమనేరు బాలాజీ, కవి మందరపు హైమావతి, కవి వెంకటకృష్ణ, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కేంగార మోహన్, డీఎస్పీ తేజేశ్వరరావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు ఆన్‌లైన్‌లో ప్రముఖ కవి భువనచంద్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు.



డాక్టర్ యోగితా చెన్నుపాటిని సన్మానిస్తున్న సమభావన సభ్యులు

## తొలిదశలో గుర్తిస్తే కీళ్ల వ్యాధి నివారణ సాధ్యం

**పటమట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :** వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని కీళ్ల వ్యాధి నిపుణురాలు డాక్టర్ యోగితా చెన్నుపాటి అన్నారు. ఆదివారం సమభావన మిత్ర మండలి 105వ సమావేశం సంస్థ అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో నిర్వహించారు. మిత్ర మండలి వ్యవస్థాపకుడు ఎమ్ఎస్ స్వామి శతజయంతి సందర్భంగా సభ్యులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. నొప్పి నివారణకు ఎక్కువగా పెయిన్ కిల్లర్స్ వాడకూడదని డాక్టర్ చెన్నుపాటి తెలిపారు. మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ సమస్యలు ఉన్న వారికి కీళ్ల సమస్యలను తొలగించే అధునాతన వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. కండరాల వాపు ఎన్నో సమస్యలకు కారణం అవుతుందన్నారు. వయసు మీరిన వారికి కీళ్ల సమస్యలు సాధారణమని ఈకార్యక్రమంలో టి.శోభనాద్రి, యార్లగడ్డ రంగారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, బీసీహెచ్ వెంకట రెడ్డి, డాక్టర్ ఎంవీ రావ్, డాక్టర్ పీఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.



రిక్షా బండిని అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

## ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలకండి

**రాణిగారితోట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర రాజధాని అమరావతిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఘనస్వాగతం పలకాలని ప్రజలకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. రాణిగారితోటలో ఆదివారం రూ.70 వేలు విలువైన రెండు టిఫిన్ బండ్లు, ఒక ప్లాట్‌ఫాం రిక్షాను పేదల జీవనోపాధికి సొంత నిధులతో ఆయన అందజేశారు. అమరావతిలో రైతుల త్యాగం మరువలేనిదని, 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహనరెడ్డి అమరావతిపై విషం కక్కారన్నారు. వైసీపీ హయాంలో అమరావతిలో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయని అన్నారు. చక్కటి రాజధాని నిర్మాణం చేసుకుంటే అభివృద్ధి, సంక్షేమం బాగా అమలు చేసుకోవచ్చని అన్నారు. దుర్గారావు, రంగమ్మ, కొక్కెర తిరుపతయ్య, కొప్పోలు శ్రీనివాస చౌదరి, ముని పోలిపల్లి, పీరుబాబు, సాగర్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## అంతిమయాత్ర వాహనం ప్రారంభం

**లబ్బీపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :** రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని క్లబ్ జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఓ హోటల్‌లో క్లబ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ చేశారు. కైలాస వైకుంఠ వాహనాన్ని ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్, కార్యదర్శి సుందర్ రెడ్డి, శ్రీనివాస్ పార్థసారథి, మధు కోనేరు, ఉదయ్, త్రినాథ్, వీర్ కౌర్, ఎం.శ్రీనివాస్, శివశంకర్ పాల్గొన్నారు.



అంతిమయాత్ర వాహనాన్ని ప్రారంభిస్తున్న రోటరీ జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు





కుంకుమ పూజలు

చండీహోమం నిర్వహిస్తున్న పండితులు, క్యూలలో వేచి ఉన్న భక్తులు, అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

## దుర్గామల్లేశ్వరులకు విశేష పూజలు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):** ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వరులకు, పరివార దేవతలకు చైత్రమాస బహుళ అమావాస్య సందర్భంగా విశేష నిత్య పూజలు వైభవంగా జరిగాయి. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ఆది దంపతుల సన్నిధిలో భక్తులు ఆర్జిత సేవల్లో విశేషంగా పాల్గొన్నారు. ఉదయం సుప్రభాతసేవ, ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, చండీ హోమం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కల్యాణం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చండీ హోమానికి 197 ఆర్జిత సేవా టిక్కెట్లు కొనుగోలు చేసి 400 మందికి పైగా భక్తులు పూజలో పాల్గొన్నారు. కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచే రూ.500 టికెట్ల అమ్మకాలు నిలిపివేసి అంతరాలయ దర్శనాలు నిలుపుదల చేసి, ముఖమండపం నుంచి వేగంగా వివిధ దర్శనం క్యూలైన్లు నడిచేలా చూశారు. ఉపాలయాల్లో భక్తుల రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు చేశారు.

### అలరించిన నృత్య ప్రదర్శన

దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపం ప్రాంగణంలోని కళావేదికపై ఆదివారం నగరానికి చెందిన కళాబృందం అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. గురువు నేతి రిషిత ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. తాండవ నృత్యకరీ గజానన అంటూ గణేషుని కీర్తనతో నృత్యం ఆరంభించి, అఖిలాండేశ్వరి అంటూ దుర్గమ్మను కీర్తించి, శంభో శివ శంభో అంటూ మల్లేశ్వరుని స్తుతిస్తూ పలు భక్తి కీర్తనలకు అనుగుణంగా నృత్యాభినయం చేశారు. అనంతరం కళాకారులను దేవస్థానం అధికారులు అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.







ఏపీఐఐసీ కాలనీ ర్యాలీలో పాల్గొన్న టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, పక్కన బీఆర్‌టీఎస్ రోడ్డులో ర్యాలీ చేస్తున్న స్కేటర్లు

# ఐక్యంగా ఉందాం..ఉగ్రవాదాన్ని అంతమొందిద్దాం

**భారతీనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :** భారతీయులంతా కుల, మతాలకు అతీతంగా ఉగ్రవాదాన్ని అంతమొదించేందుకు ఐక్యంగా ముందుకు సాగుదామని టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఆదివారం నాలుగో డివిజన్‌లోని ఏపీఐఐసీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలో నిర్వహించిన శాంతి ర్యాలీలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కమిటీ హాల్ నుంచి ప్రారంభమైన శాంతి ర్యాలీలో భారత దేశం..ఒకే కులం..ఒకే మతం అంటూ నినాదాలు చేస్తూ కాలనీలోని అన్ని రోడ్లలో ర్యాలీని నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు పాతూరి సాంబశివరావు, కాలనీ పెద్దలు గొల్లపూడి నాగేశ్వరరావు, అబ్దుల్ సలీం, సత్తార్, యలమంచిలి రాజా, షేక్ జానీ, జరీనా, హసీనా పాల్గొన్నారు.

### ఉగ్రదాడిని ఖండిస్తూ శాంతి ర్యాలీ

**సత్యనారాయణపురం :** కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని కృష్ణాజిల్లా రోలర్‌స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.దుర్గాప్రసాద్ అన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ ఆదివారం బీఆర్టీఎస్ రోడ్డులో జిల్లాస్కేటింగ్ క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే వాళ్లు ప్రయత్నించాలి కానీ, పక్క దేశంలో అల్లర్లు సృష్టించాలనుకోవడం సరికాదని దుర్గాప్రసాద్ అన్నారు. ఈ సంఘటనకు కారణమైన వారిని వెంటనే శిక్షించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రోలర్‌స్కేటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బచ్చు మురళి మాట్లాడుతూ పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడి పిరికిపందల చర్య అన్నారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కోశాధికారి సోమ్, కోచ్‌లు వరుణ్, దిలీప్, నాగసేన్, గ్రీష్మిత, మహేష్, నాని, కీర్తి, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.







# బాబోయ్ పొగ

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్)

ఆటోనగర్ సమీపంలోని ఏపీఐఐసీ కాలనీలో జమాక్ అపార్టుమెంట్ వద్ద అంతర్గత రోడ్డును శుభ్రం చేశాక చెత్త, ఎండుటాకులను వీఎంసీ సిబ్బంది తరలించకుండా రోడ్డు మార్జిన్‌లో వేసి తగలబెడుతున్నారని, సమీపంలోని హీరో హోండాయి షోరూం రోడ్డులో రాత్రి సమయంలో కొందరు(గమేళా బజార్ రోడ్డులో నివాసం ఉంటున్నవారు) పాతవైర్లను కుప్పలుగా వేసి మంట పెడుతున్నారని స్థానిక పెద్దలు తెలిపారు.

ఈ మంటల నుంచి విపరీతమైన దుర్వాసనతో పాటు దట్టమైన పొగ వస్తోందని, దీంతో చుట్టుపక్కల ఉన్న జమాక్ అపార్టుమెంట్, సాయి శ్రీకా అపార్టుమెంట్‌వాసులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.



ఏపీఐఐసీ కాలనీ జమాక్ అపార్టుమెంట్ సమీపంలో అంతర్గత రోడ్డులో తగలబడుతున్న చెత్తకుప్ప



## రాజధాని నిర్మాణానికి ప్రధాని గ్రాంటు ప్రకటించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

**గవర్నర్‌పేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర రాజధాని నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ అప్పు స్థానంలో గ్రాంటు ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. మే 2న అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభానికి వస్తున్న నేపథ్యంలో మోదీకి సీపీఎం బహిరంగ లేఖ రాసిందని ఆయన తెలిపారు. ఆదివారం ఎంజీ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. పదేళ్లుగా రాజధాని నిర్మాణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని మోసం చేసిందన్నారు. ఇస్తానన్న గ్రాంటు ఇవ్వలేదని, రాజధాని బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొన్నా కేవలం రూ.1500 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. 2015లో రాజధానికి శంకుస్థాపనకు వచ్చిన మోదీ నీళ్లు, మట్టి ఇచ్చారని, ఈసారి ఏం ఇస్తారోనని ప్రజల్లో సందేహం ఉందన్నారు. రాజధానిలో రైతులు, కూలీలకు ఇచ్చిన అనేక హామీలు నెరవేర్చాల్సిన బాధ్యత ఉందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు, వై.వెంకటేశ్వరరావు

### రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యలు సరికాదు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు సీపీఎంపైన, ఆ పార్టీ కార్యదర్శిపై చేసిన వ్యాఖ్యలు సరికావని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని బాబూరావు అన్నారు. ఉండి నియోజకవర్గంలో 900 ఇళ్లు కూల్చివేయడంతో పేదలు రోడ్డున పడ్డారని, దానిపై ఆందోళన చేస్తున్న పేదలకు అండగా సీపీఎం నిలిచిందన్నారు. డిప్యూటీ స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తి విచక్షణ కోల్పోయి మాట్లాడటం సరికాదన్నారు. దీనిపై టీడీపీ అధినాయకత్వం స్పందించాలని, పేదలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రమాదకరంగా గుంతలు

● మంచి నీటిపైపులు త్వరగా మరమ్మతులు చేయాలి
● బ్యాంకు కాలనీ, భారతీనగర్ వాసుల వేడుకోలు

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్)

ప్రధాన, అంతర్గత రోడ్ల వెంబడి మున్సిపల్ వాటర్ పైపుల మరమ్మతుల కోసం తవ్విన గుంతలతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నాల్గో డివిజన్ శ్రీనివాస నగర్ బ్యాంకు కాలనీలోని 3ఏ రోడ్డు, భారతీనగర్ ఎన్టీఆర్ భవనం రోడ్డులో మంచి నీటిపైపులకు మరమ్మతులు చేయడం కోసం అధికారులు వారం క్రితం గుంతలు తీయించారు.

మరమ్మతులు పూర్తి చేయడంలో ఆలస్యం జరగడంతో ఈగుంతలు పూడ్చలేదు. గుంతలు కాలనీల రోడ్డు మార్జిన్‌లో ఉండడంతో రాత్రివేళ, వాహనాల రద్దీ సమయాల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశముందని స్థానికులు అంటున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీలోని రోడ్డు నంబరు 3ఏలో గుంత



భారతీనగర్ ఎన్టీఆర్ భవనం రోడ్డులో గుంత

# దిక్సూచి
DIKSUCHI

సివిల్స్ ర్యాంకర్స్ వాయిస్

## ప్రతి అటెంప్ట్‌లో ఇంప్రూవ్‌మెంట్


సాయి చైతన్య జాదవ్
68వ ర్యాంకు

r మీ కుటుంబ నేపథ్యం ఏమిటి? ఎంత వరకు చదువుకున్నారు?

జ: మాది ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం. ఒకటి నుంచి ఐదు వరకు ఉట్నూరులో, ఆరు నుంచి పది వరకు కాగజ్‌నగర్ నవోదయ, తరవాత త్రిచిలోని త్రిబుల్ ఐటీలో బీటెక్ మెకానికల్ పూర్తి చేశాను. నాన్నపేరు గోవింద్‌జాదవ్, హెడ్ కానిస్టేబుల్. అమ్మ కవిత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. అక్క శృతి, వైద్యురాలు.

r సివిల్స్‌లో మీ ప్రిపరేషన్ ఎలా సాగింది? ఈ ప్రయాణాన్ని ఎప్పుడు మొదలు పెట్టారు?

జ: 2019లో గ్రాడ్యుయేషన్ పూర్తయింది. ఆ తరవాత ఢిల్లీకి వెళ్లి ఒక సంవత్సరం కోచింగ్ తీసుకుందాం అనుకున్నాను. అయితే కొవిడ్ ఎఫెక్ట్‌తో మధ్యలోనే వదిలేసి వచ్చేశాను. తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ కూడా క్వాలిఫై కాలేదు. 2020, 2021లో మళ్లీ రాశాను. అయితే ప్రిలిమ్స్‌లో అర్హత సాధించా, కాని మెయిన్స్ దాటలేదు. 2022లో ఇంటర్వ్యూకు వెళ్లాను. కానీ ర్యాంకు రాలేదు. మళ్లీ 2023లో మెయిన్స్ దశ దాటలేక పోయాను. అయితే అదే సంవత్సరం 'ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్' వచ్చింది. ఆరో ప్రయత్నంలో 2024లో విజయం సాధించాను. నా ర్యాంకుకు ఐఏఎస్ రావచ్చు.

r మొదటి సారి విఫలమైనప్పుడు మిమ్మల్ని మీరు ఎలా మోటివేట్ చేసుకున్నారు....?

జ: సివిల్స్ పరీక్షలు రాసిన ప్రతీసారి నాలో కొంత ఇంప్రూమెంట్ కనిపించింది. అదే ప్రధాన కారణం. మూడో ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. దీంతో ఏదో వస్తుందన్న ఆశ పెరిగింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు స్నేహితులు మంచి సలహాలు, సూచనలు ఇచ్చారు.

r రోజుకు ఇన్ని గంటలు చదవాలన్న నియమం ఏమైనా పెట్టుకున్నారా?

జ: ఎన్ని గంటలు ప్రిపేర్ అనేది కాదు కాని ఎంత చదివితే అర్థమవుతుందో అంత వరకే చదివే వాడిని. పరీక్షలు దగ్గర పడినప్పుడు మాత్రం రోజుకు 10 నుంచి 13 గంటలు చదివే వాడిని. ఎన్ని గంటలు చదివాము అన్నది కాకుండా, ఎంత అర్థం చేసుకో గలిగాం అన్నది ముఖ్యం.

r సివిల్స్ రాయాలంటే కోచింగ్ తప్పని సరా?

జ: నా ఉద్దేశ్యంలో కోచింగ్ అవసరం లేదు. ఒకరిని చూసి మరొకరు కోచింగ్‌కు వెళుతున్నారు. ఏదో కొంత తప్ప, గత కోచింగ్ ప్రస్తుతం ఉపయోగపడతుందన్న గ్యారెంటి లేదు. స్నేహితులను చూసి నేను కూడా కోచింగ్‌కి వెళ్లాను. కాని మధ్యలోనే వచ్చేశాను. ఐదేళ్లుగా సొంతంగానే సిద్ధం అయ్యాను. కాకపోతే స్నేహితులతో కలిసి మాక్ ఇంటర్వ్యూలు చేయడం జరిగింది.

r జనరల్ స్టడీస్‌కు, అలాగే ఆప్షనల్‌కు ఏ మెటీరియల్ చదివారు....?

జ: రోజు న్యూస్ పేపర్ చదవడంతో మన చుట్టు పక్కల ఏం జరుగుతుందనే విషయంపై అవగాహన వస్తుంది. ఇది ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఇలా అన్ని స్థాయిల్లో ఉపయోగపడుతుంది. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రకమైన ప్రామాణిక బుక్స్ అవసరం. ఉదాహరణకు నా ఆప్షన్ ఆంథ్రోపాలజీ. మొదటి నుంచి దీనితోనే సివిల్స్ రాస్తున్నాను. మొదట్లో ఒక నెల రోజులు కోచింగ్ వెళ్లినా అంతగా అర్థం కాలేదు. మొదటి సారి మెయిన్స్ రాక పోవడంతో ఎక్కువ సమయం దొరికింది. దాంతో సొంతగా నోట్స్ ప్రిపేర్ చేసుకున్నాను.

r సివిల్స్‌లో మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది...? ఎంత సేపు జరిగింది. ఎలాంటి ప్రశ్నలు అడిగారు?

జ: నన్ను రాజ్‌శుక్లా సర్ బోర్డు 30 నిమిషాల పాటు ఇంటర్వ్యూ చేసింది. ఆరోజు నాలుగో వ్యక్తిని. ఇంటర్వ్యూ అప్లికేషన్ ఫాంలో మొత్తం 22 సర్వీస్‌లను పేర్కొనాల్సి ఉండగా నేను ఐఏఎస్, ఐపీఎస్ రెండు సర్వీస్‌లను మాత్రమే పెట్టాను. ఇంటర్వ్యూలో దీనిపై అడిగారు. నాకు ఆల్ రెడీ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ సంబంధించిన 'ఐఎఫ్ఎస్' సర్వీస్ ఉందని చెప్పాను. ఏపీ నుంచి విడిపోయిన తరవాత తెలంగాణలో అభివృద్ధి ఎలా ఉంది. అలాగే కేవలం హైదరాబాద్ మాత్రమే అభివృద్ధి చెందిందా? అని అడిగారు. నా సొంత జిల్లా ఆదిలాబాద్ కాబట్టి అడవుల గురించి అడిగారు. తెలంగాణ ఉద్యమం గురించి, ఆదిలాబాద్ గిరిజన తెగల గురించి ప్రశ్నించారు. మా నాన్న పోలీసు కాబట్టి ఆ డిపార్ట్‌మెంట్ గురించి కూడా అడిగారు.

ఎం. రాజేశ్వర్, ఆదిలాబాద్

## విష్ణుమూర్తి అవతారాలేమిటి?


బాన్న వెంకటేష్
15వ ర్యాంకు

**సివిల్స్ ప్రిపరేషన్ అంటేనే సుదీర్ఘ ప్రయాణం. ఇందులో ఎన్ని ఆటుపోటులు వచ్చినా చివరి వరకు పట్టు విడవకూడదు. అలా విజేతగా నిలిచిన వ్యక్తి శ్రీకాకుళానికి చెందిన బాన్న వెంకటేష్. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో తన ప్రిపరేషన్ ఎలా సాగింది, ఇంటర్వ్యూలో ఎలాంటి ప్రశ్నలు అడిగారో 'దిక్సూచి' పాఠకులతో ఆయన పంచుకున్నారు.**

r సివిల్స్‌లో 15వ ర్యాంకు సాధించినందుకు అభినందనలు.. మీ కుటుంబ నేపథ్యం చెప్పండి.. ఏమి చదువుకున్నారు..?

జ: థాంక్యూ. మాది శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేట గ్రామం. తొమ్మిదో తరగతి వరకు శ్రీకాకుళంలో, ఇంటర్‌మీడియట్ విశాఖపట్టణంలో.. బీటెక్ తమిళనాడు రాష్ట్రం తిరుచరాపల్లిలో పూర్తిచేశాను. నాన్న చంద్రరావు వ్యవసాయం చేస్తారు. అమ్మ రోహిణి గృహిణి. మా తమ్ముడు వంశీ 'ఇస్రో'లో సైంటిస్ట్.

r మీ ప్రిపరేషన్ ఎలా సాగింది? సివిల్స్ ప్రయాణాన్ని ఎప్పుడు మొదలుపెట్టారు?

జ: బీటెక్ తర్వాత నెలకు రూ. 1.5 లక్షలతో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేశాను. కానీ సంతృప్తి లేదు. ఏదైనా చేయాలన్న లక్ష్యంతో పాజిటివ్‌గా ఆలోచించాను. జాబ్‌కు రిజైన్ చేసి 2021 అక్టోబరు నుంచి సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను.

r ఈ ప్రయాణంలో తొలుత విఫలం అయినప్పుడు ఎలా మోటివేట్ చేసుకున్నారు?

జ: 2022లో తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ కూడా దాటలేదు. కానీ డీమోటివేట్ కాకుండా సిలబస్ కంప్లీట్ చేసుకుంటూ రెండో దఫా పరీక్షకు బాగా సిద్ధం అయ్యాను. 2023లో 467 ర్యాంకు వచ్చింది. ఆంధ్ర కేడర్ ఐపీఎస్ వచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నేషనల్ పోలీస్ అకడామీలో ఉన్నా. 2024లో ఐఏఎస్ లక్ష్యంగా ప్రిపేర్ అయ్యాను.

r ఇంత మంచి ర్యాంకు వస్తుందని ఊహించారా?

జ: నేను వంద నుంచి 150లోపు ర్యాంకు వస్తుందని ఊహించాను. 15వ ర్యాంకు వచ్చింది. ఐఏఎస్ కావాలనుకున్నాను. అదే వచ్చింది.

r రోజుకి ఇన్ని గంటలు తప్పనిసరిగా చదవాలనే నియమం ఏమైనా పెట్టుకున్నారా?

జ: సివిల్స్ అంటే చదువు విషయంలో ప్లానింగ్ ఉండాలి. రోజుకి ఎనిమిది గంటలు కచ్చితంగా చదివా. ఒక్కోసారి అంతకంటే ఎక్కువే అయ్యేది.

r సివిల్స్ లాంటి అత్యున్నత లక్ష్యం పెట్టుకున్నవారు కోచింగ్ తప్పనిసరిగా తీసుకోవాలా? ఒకవేళ మీరు కోచింగ్ తీసుకుంటే అది ఎలా ఉపయోగపడింది?

జ: ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యాను. మాక్ టెస్ట్‌లు రాశాను. బాగా ప్రిపేర్ అయ్యాను. రెండో అటెంప్ట్‌కు ఐపీఎస్ వచ్చింది. మూడో ప్రయత్నంలో ఐఏఎస్.

r జనరల్ స్టడీస్‌కు మెటీరియల్ ఏమి చదివారు? అలాగే ఆప్షనల్‌కు ఏమి మెటీరియల్ చదివారు?

జ: అందరి ప్రిపరేషన్‌లాగానే నాదీ జరిగింది. ఆప్షనల్‌గా 'జాగ్రఫీ' ఎంచుకున్నాను.

r మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది? మొత్తం ఎంత సేపు జరిగింది? ఇంటర్వ్యూలో మిమ్మల్ని ఎలాలంటి ప్రశ్నలు అడిగారు? ఏమైనా గుర్తున్నాయా?

జ: లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా సర్ బోర్డు అరగంటకు పైగా నన్ను ఇంటర్వ్యూ చేసింది. ప్రస్తుతం ఐపీఎస్‌లో ఉన్నావుగా.. మరెందుకు ఐఏఎస్‌కు రావాలనుకుంటున్నావు..? అనే ప్రశ్న వేశారు. అలాగే ఇంజినీరింగ్ అంశాలకు సంబంధించి కొన్ని అంశాలపై ప్రశ్నలు వేశారు. మీ జిల్లాకు మీరు కలెక్టర్ అయితే అక్కడ ఉన్న సమస్యలను ఏవిధంగా పరిష్కరించగలరు అని కూడా అడిగారు.

r మీకు అత్యంత కఠినం ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం అని భావించిన ప్రశ్న ఏమైనా ఉందా?

జ: ఎలక్ట్రానిక్స్‌లో కొన్ని అంశాలపైనా, టెక్నాలజీ గురించి కొన్ని డీటెయిల్డ్‌గా చెప్పమన్నారు. నాకు ఎంతవరకు తెలుసో అంతవరకే చెప్పాను. తెలియని అంశంపై సైలెంట్‌గానే ఉన్నా.

r అతి సులువు ప్రశ్నగా దేనిని భావించారు?

జ: మీ పేరు 'వెంకటేష్' కదా.. ఆ పేరుకున్న అర్థం ఏమిటి అని అడిగారు. పాపాలను హరించేవాడని.. విష్ణు అవతారంలో ఒకరైన శ్రీ వెంకటేశ్వరుని పేరు అది అని చెప్పాను. అయితే విష్ణు అవతారాలలో నాలుగు చెప్పండి అని అడిగితే నాలుగు అవతారాలను చెప్పేశాను.

r తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మిమ్మల్ని అడిగిన ప్రశ్నలు ఏవి?

జ: తెలంగాణ గురించి అడగలేదుకానీ.. ఆంధ్రప్రదేశ్ గురించి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో సువిశాలమైన తీరప్రాంతముంది కదా.. ఏవిధంగా అభివృద్ధి చేయవచ్చు... అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సమస్యలు.. ఆంధ్రప్రదేశ్, బీహార్‌లో ఉన్న సమస్యలు గురించి అడిగారు. క్షుణ్ణంగా వివరించాను.

తాతపూడి సురేష్‌బాబు, శ్రీకాకుళం

## రాజంపేటపై అడిగారు?


చెన్నంరెడ్డి శివ గణేష్ రెడ్డి
119వ ర్యాంకు

**కలలు కనడం కాదు.. వాటిని సాకారం చేసుకోవాలనే అబ్దుల్ కలామ్ మాటలు అతనిలో స్ఫూర్తి నింపాయి. బీటెక్‌లో సీనియర్స్ ఎక్కువ మంది సివిల్స్‌వైపు వెళ్లడంతో తాను ఎందుకు ప్రయత్నించకూడదు అనుకున్నారు కడపకు చెందిన శివ గణేష్ రెడ్డి. అందుకు అనుగుణంగా ప్రయత్నించి విజయం సాధించారు. తొలి రెండు ప్రయత్నాల్లో విఫలమైనా మూడో ప్రయత్నంలో ఎలా విజయం సాధించారో వివరించారు.**

r కుటుంబ నేపథ్యం ఏమిటి. ఎంత వరకు చదువుకున్నారు?

జ: మధ్యతరగతి కుటుంబం మాది. సొంత ఊరు కడప పట్టణం అలంకానపల్లె. పదో తరగతి వరకు కడప, ఇంటర్మీడియట్ నెల్లూరులో, తరవాత హైదరాబాద్ ఐఐటిలో బీటెక్ పూర్తి చేశాను. ఐఐటిలో చదివే సమయంలో ఎక్కువ మంది సీనియర్లు సివిల్స్‌కు ఎంపిక అయ్యారు. దీంతో నేను ఎందుకు పరీక్ష రాయకూడదూ అనే ఆలోచన వచ్చింది. దానికి అనుగుణంగా ముందుకు సాగాను. నాన్న మల్లికార్జునరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఫ్యాకల్టీగా చేశారు. ప్రస్తుతం వ్యవసాయం చూసుకుంటున్నారు. అమ్మ ఇందిరా ప్రియదర్శిని గృహిణి. చెల్లెలు శివ జ్యోతిక ప్రస్తుతం మాస్టర్స్‌కు ప్రిపేర్ అవుతోంది.

r ప్రస్తుతం ఏ సర్వీసు వస్తుందని అంచనా వేస్తున్నారు...?

జ: సివిల్స్‌లో నా ర్యాంకు 119. ఐఏఎస్ వస్తుందని అనుకుంటున్నాను. ఏ సర్వీసు వచ్చినా పర్వాలేదు.

r మీ ప్రిపరేషన్ ఎలా సాగింది. రోజుకు ఇన్ని గంటలు చదవాలన్న నియమం ఏమైనా పెట్టుకున్నారా.....?

జ: సివిల్స్‌లో విజయం సాధించాలంటే ముఖ్యంగా సామాజిక, వర్తమాన అంశాలపై దృష్టి సారించాలి. క్రమం తప్పకుండా దిన పత్రికలు చదవాలి. ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలోనే మెయిన్స్ అంశాలపై నిశిత దృష్టి సారించాలి. నా విషయానికి వస్తే రోజుకు 6 నుంచి 7 గంటల సేపు చదివాను. ఇంజినీరింగ్ పూర్తి కాగానే 2020లో కోచింగ్‌లో చేరాను. సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి కొన్ని పోర్టల్స్ అందుబాటులో ఉన్నాయి. మెయిన్స్‌కు ఎలా సిద్ధమవ్వాలి. అక్కడ ఏయే అంశాలపై ప్రశ్నలు వస్తాయో తెలుపుతూ ఆర్టికల్స్ ఇస్తారు. రోజుకు ఎన్ని గంటలు చదువుతున్నామన్నది కాదు ఆయా అంశాలను ఎలా ఆకళింపు చేసుకున్నామన్నదే కీలకం. క్రమశిక్షణగా ముందుకు సాగితే ఎంపికవడం సులభం.

r సివిల్స్‌కు కోచింగ్ తప్పనిసరిగా తీసుకోవాలా?

జ: నా దృష్టిలో కోచింగ్ ఉంటే మంచిది. ప్రిపరేషన్ త్వరలో గాడిలో పడుతుంది. నేను 2020 లో బీటెక్ పూర్తయిన వెంటనే ఢిల్లీలో కోచింగ్‌కు వెళ్లాను. కరోనా నేపథ్యంలో రెండేళ్లు గ్యాప్ వచ్చింది. తర్వాత రెండుసార్లు సివిల్స్ రాసినప్పటికీ ఫలితం రాలేదు. మూడో అటెంప్ట్‌లో జాతీయస్థాయిలో 119వ ర్యాంక్ వచ్చింది.

r మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది?

జ: చైర్మన్ ప్రీతి సుగం మేడమ్ నేతృత్వంలో ఇంటర్వ్యూ అర్ధగంట సేపు సాగింది. మనం ఇచ్చే డిటెయిల్డ్ అప్లికేషన్ ఫామ్‌లో ఉన్న అంశాలపై ఇంటర్వ్యూ నిర్వహించారు.

r ఇంటర్వ్యూలో కఠినమైన ప్రశ్నలు లేదా ఆశ్చర్యానికి గురిచేసిన ప్రశ్నలు ఏమైనా ఉన్నాయా?

జ: కడప జిల్లాలో రాజంపేట సంబంధించి చెప్పమని ప్రశ్నించగా ఒక్కసారి ఆశ్చర్యపోయా. ఊహించని ప్రశ్న. అయినా సమాధానం చెప్పడంతో సంతృప్తి చెందారు. అలాగే కడప జిల్లాలో మహిళల సమస్యలు, వ్యవసాయ సమస్యలపై ప్రశ్నించారు వాటికి కూడా సమాధానం చెప్పడం జరిగింది.

విలియం జాన్ కళ్యాణ, ఎడ్యుకేషన్ రిపోర్టర్, కడప

# చిత్రజ్యోతి
SINCE 1965

## పది కాలాల పాటు గుర్తుండే సినిమా

ప్రియదర్శి కథానాయకుడిగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపొందిన 'సారంగపాణి జాతకం' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించింది. మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ 'సారంగపాణి జాతకం' పది కాలాల పాటు గుర్తు పెట్టుకునే సినిమా. మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. కుటుంబ ప్రేక్షకులు ఇప్పుడిప్పుడే థియేటర్లకు వస్తున్నారు. మా సినిమాను సూపర్ హిట్ చేయండి' అని ప్రేక్షకులను కోరారు. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని ఎంతో కష్టపడి, ఇష్టపడి తీశాం. ప్రతి ఒక్కరు ఈ వేసవిలో మా సినిమాను చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'కోర్ట్' తర్వాత 'సారంగపాణి జాతకం' ఓ వరంలా దొరికింది' అనిప్రియదర్శి అన్నారు.







## అంచనాలను మించి అలరిస్తుంది

ఎస్ఎస్ రాజమౌళి

"నేను తీసే మహాభారతంలో నాని పోషించేది ఏ పాత్ర అనేది చెప్పను గానీ.. అందులో ఆయన కచ్చితంగా ఉంటాడు. నిర్మాత ప్రశాంతిని హిట్ మెషీన్ అని పిలుస్తుంటాం. 'హిట్ 3' కూడా ఆమెకు ఘనవిజయాన్ని అందిస్తుంది. ఈ 'హిట్' ఫ్రాంచైజీకి అంతం లేదు. నాని తీసే ప్రతి సినిమాపై అంచనాలు ఎక్కువ ఉంటాయి. ఈ సినిమా అంచనాలను మించి అలరిస్తుంది. ఆయన ఇప్పటికే అందనంత ఎత్తుకు ఎదిగారు. మరింత గొప్ప స్థాయికి ఎదగాలి. ఈ సినిమాకు సూపర్‌హిట్ పక్కా అనే వైబ్ కనిపిస్తోంది" అని దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అన్నారు. నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. మే 1న విడుదలవుతున్న సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఇందులో హింస మీరు భయపడేలా కాదు, ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఒక మంచి థ్రిల్లర్‌కు పక్కా కమర్షియల్ సినిమా జతకలిస్తే ఎలా ఉంటుందో అదే ఈ సినిమా. ఒకప్పుడు రాజమౌళిగారు నా సినిమాలు చూసి ఎలా ఉందో చెప్పేవారు. కానీ ఆ సంప్రదాయం ఈ మధ్య మిస్సయ్యింది. ఈ సినిమాను మాత్రం ఆయన మొదటి రోజు చూస్తారని ఆశిస్తున్నాను. లేదంటే ఆయన పాస్‌పోర్ట్ లాగేసుకుంటా. ఆయన పేరు ఇప్పటికే సినిమా డిక్షనరీలోకి వెళ్లిపోయింది. రోమాలు నిక్కబొడుచుకునే ఏ సన్నివేశానికైనా రిఫరెన్స్ కావాలంటే.. 'రాజమౌళి ఎపిసోడ్' అని అనడం అలవాటు అయిపోయింది. ఈ సినిమాలోనూ ఒక అద్భుత సన్నివేశం ఉంటుంది. దాన్ని నేను, శైలేష్ 'రాజమౌళి మూమెంట్' అని పిలుస్తుంటాం. విష్వక్ సేన్, అడివి శేష్ ఈ 'హిట్ యూనివర్స్'కు మూలస్తంభాలు. శైలేష్ కొలను ఎంతటి ప్రతిభావంతుడో సినిమా విడుదల రోజున మీకందరికీ తెలుస్తుంది. సినిమా బాగుండాలి. సినిమాను కాపాడుకుందాం. ఈ గురువారం మనకు సినిమా అంటే ఎంత ప్రేమ ఉందో దేశానికి చూపిద్దాం. 'హిట్ 3' మీ అంచనాలను అందుకోకుంటే 'ఎస్ఎస్ఎమ్‌బీ29'ని చూడొద్దండి. ఈ సినిమాతో పాటు విడుదలవుతున్న 'రెట్రో', 'రైడ్ 2' చిత్రాలూ బ్లాక్‌బస్టర్ అవ్వాలి" అని ఆకాంక్షించారు. "హిట్ ఫ్రాంచైజీకి నా మనసులో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇదో న్యూ ఏజ్ సినిమా" అని హీరో విష్వక్ సేన్ అన్నారు. "ఈ సినిమా చివరి 30 నిమిషాలు చూశాను. చాలా బాగుంది. ఆరంభ వసూళ్లు అదిరిపోతాయి" అని అడివి శేష్ తెలిపారు. "సినిమా అంటే నానిగారికి అపారమైన ప్రేమ. నన్ను ఇంతగా నమ్మిన ఆయనకు కృతజ్ఞుడ్ని" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు. "నానిగారితో నటించడం ఒక మరిచిపోలేని అనుభూతి" అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి తెలిపారు.

## త్రీడీ వెర్షన్‌లో



చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. కే రాఘవేంద్రరావు దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం 1990 మే 9న విడుదలైంది. ఈ బ్లాక్‌బస్టర్ విడుదలై 35 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మే 9న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. త్రీడీ వెర్షన్‌లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

## క్రిమినల్ కథేంటి?



క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన తమిళ చిత్రం 'రాకాదన్'. వంశీకృష్ణ రియాజ్‌ఖాన్, దినేశ్ ప్రధాన తారాగణం. దినేశ్ కలై దర్శకుడు. కే హైమావతి నిర్మించారు. ఇప్పుడు ఈ చిత్రం 'క్రిమినల్ 123' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కేజేఆర్ పిక్చర్స్ పతాకంపై రామకృష్ణ, కిశోర్, జయబాబు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. మే తొలివారంలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ఆదివారం తెలిపారు. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కించిన చిత్రమిదని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి ఏ ప్రవీణ్ కుమార్ సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: మానస్‌బాబు.



## ప్రత్యేక పాత్రలో సమంత



నటి సమంత తన సొంత బ్యానర్ ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. మే 9న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఆదివారం ఈ చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. గ్రామంలోని మహిళలంతా టీవీలో సీరియల్ చూస్తూ దెయ్యం పట్టినట్లుగా ప్రవర్తిస్తుంటారు. వారి నుంచి తప్పించుకునేందుకు పురుషులంతా అష్టకష్టాలు పడుతుంటారు. అలాంటి తరుణంలో మాతాజీగా ప్రత్యేక పాత్రలో సమంత ప్రత్యక్షమవుతారు. హాస్యం, హారర్, ఉత్కంఠ, ఎమోషన్స్ ఇలా అన్ని అంశాలను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్‌ని చూస్తే తెలుస్తోంది.

## డ్రగ్స్ కేసులో మలయాళ దర్శకుల అరెస్టు





ఇటీవలె మలయాళ నటుడు షైన్ టామ్‌చాకోను డ్రగ్స్ తీసుకుంటున్నాడన్న ఆరోపణలపై పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో.. 'నేనొక్కడినే కాదు, మలయాళ పరిశ్రమలో చాలా మంది మాదక ద్రవ్యాలు తీసుకుంటున్నారు' అని ఆయన చేసిన వాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. తాజాగా, మలయాళ పరిశ్రమకు చెందిన ఇద్దరు దర్శకులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. 'జింఖానా' ఫేమ్ ఖలీద్ రెహ్మాన్, 'తమాషా' ఫేమ్ అష్రఫ్ హంజాలతో పాటు వారి స్నేహితుడు షలీఫ్ మహ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం కొచ్చిలోని ఓ అపార్టుమెంటులో సోదాలు నిర్వహించిన పోలీసులు వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత నిందితులు బెయిల్‌పై విడుదలయ్యారు. వారు ముగ్గురూ కొంతకాలంగా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

## గ్రామీణ ప్రేమకథ



హరికృష్ణ, భవ్యశ్రీ జంటగా గ్రామీణ ప్రేమకథ నేపథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఆదివారం షూటింగ్ మొదలైంది. ఆదినారాయణ పినిశెట్టి దర్శకత్వంలో టీవీ స్టార్ మూవీ మేకర్స్ పతాకంపై తిరుపతి శ్రీనివాసరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో ఎన్నడూ చూడని ఒక వైవిధ్యమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని మేకర్స్ తెలిపారు. ప్రేమ, త్యాగం, కుటుంబ విలువల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కుతోన్న చిత్రమిదని దర్శకుడు చెప్పారు. గౌతమ్ రవిరావు సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: విపిన్ వి రావు.

# మొటిమలు ఎందుకు ఎక్కువ అవుతాయంటే..

రాత్రిపూట మనం పడుకునేటప్పుడు చేసే చిన్న పొరబాట్ల వల్ల ముఖం మీద మొటిమలు ఒక్కసారిగా పెరుగుతూ ఉంటాయి. దీనివల్ల ముఖం అందవికారంగా తయారవడమే కాదు... నొప్పి, అసౌకర్యం కూడా కలుగుతుంది. కనుక ఆ పొరపాట్లు ఏమిటో తెలుసుకొని, జాగ్రత్తలు పాటిస్తే మొటిమల బారి నుంచి తప్పించుకోవచ్చని అంటున్నారు నిపుణులు.

- రాత్రిపూట ముఖాన్ని శుభ్రం చేసుకోకుండా పడుకుంటే చర్మం మీద చేరిన దుమ్ము, చర్మం ఉత్పత్తి చేసే నూనెతో కలసి చర్మ రంధ్రాలను మూసివేస్తుంది. దీంతో ముఖం మీద మొటిమలు ఏర్పడతాయి.
- ముఖం మీద వేసుకున్న మేకప్‌ను తొలగించకుండా పడుకున్నా ఆ ఉత్పత్తుల్లోని రసాయనాల కారణంగా మొటిమలు ఎక్కువ అవుతాయి.



- దిండు గలీబులను వారాల తరబడి ఉతకకుండా వాటి పైనే నిద్రించడం వల్ల చెంపలు, ముక్కు, నుదుటి భాగాల్లో చర్మంపై హానికరమైన బ్యాక్టీరియా చేరుతుంది. దీంతో మొటిమలు ఎక్కువ అవుతాయి.
- ముఖంపై తల వెంట్రుకలు పడుతూ ఉన్నా, చేతులతో ముఖాన్ని తరచూ తాకుతూ ఉన్నా ముఖంపై మలినాలు చేరి మొటిమలు ఎక్కువగా వస్తాయి.
- చెంపలను దిండుకి అదిమిపెట్టి పడుకోవడం వల్ల ముఖం మీద చర్మం అత్యధికంగా నూనెని ఉత్పత్తి చేస్తుంది. ఇలా రాత్రి సమయంలో కొన్ని గంటలపాటు చర్మ రంధ్రాలు నూనెతో నిండి ఉండడం వల్ల మొటిమల సమస్య పెరుగుతుంది.
- రాత్రిపూట సరిగా నిద్రించకపోవడం వల్ల హార్మోన్ల సమతౌల్యం దెబ్బతింటుంది. ఫలితంగా మొటిమలు ఎక్కువ అవుతాయి.
- సాధారణంగా రాత్రిపూట ముఖానికి రాసుకునే నైట్ క్రీమ్‌లు, మాయిశ్చరైజర్లు చర్మ రంధ్రాలను పూర్తిగా మూసివేస్తాయి. దీనితో చర్మానికి ఆక్సిజన్ అందక సమస్య మరింత తీవ్రమవుతుంది.
- పడుకునే గదిలో వెంటిలేషన్ సరిగా లేకపోతే చర్మం మీద చెమట, దుమ్ము, బ్యాక్టీరియా చేరి మొటిమలు వస్తాయి.
- రాత్రి భోజనంలో నూనె పదార్థాలు, తీపి పదార్థాలు ఎక్కువగా తీసుకున్నా ముఖంపై మొటిమలు పెరుగుతాయి.

సంకల్పం



బాల్యం నాట్యంతోనే మొదలైంది. ఆపై అదే జీవితం అయింది. నటరాజ పాదాల చెంత... ఆరు దశాబ్దాల అపురూప నాట్య విన్యాసం. ఏడు పదుల వయసులోనూ తరగని ఉత్సాహం... కూచిపూడి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలన్న సంకల్పం... 'సంగీత నాటక అకాడమీ' పురస్కార గ్రహీత... 'నృత్య కిన్నెర' అధినేత... ప్రముఖ నాట్య గురువు... **డాక్టర్ మద్దాళి ఉషాగాయత్రి**తో 'నవ్య' మాటామంతి.

# అణువణువునా నాట్యమే

"నాకు నాలుగేళ్లప్పుడు... మా అమ్మ నన్ను తీసుకువెళ్లి నాట్యంలో చేర్పించింది. అది మొదలు నర్తన నా నరనరాల్లోనూ జీర్ణించుకుపోయింది. తొలినాళ్లలో కథక్, ఒడిస్సీ కూడా అభ్యసించాను. అనంతర కాలంలో కూచిపూడి మీదే దృష్టి పెట్టాను. హైదరాబాద్‌లో రవీంద్రభారతి వేదిక ప్రారంభించినప్పుడు ఒక బృందం నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఆ బృందంలో నేను కూడా ఉన్నాను. పదేళ్లు వచ్చేసరికి వేదాంతం జగన్నాథశర్మ గారి దగ్గర కూచిపూడి నేర్చుకోవడం ప్రారంభించాను. నేను పుట్టింది కర్నూలులో. అమ్మానాన్నలది నెల్లూరు. మా నాన్న సెక్రటేరియట్‌లో పని చేసేవారు. దాంతో నా చిన్నప్పుడే మేం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డాం. 1972లో నా డిగ్రీ పూర్తయింది. తరువాత పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. అందులో పని చేస్తూనే నా కూచిపూడి ప్రదర్శనలు, శిక్షణ కొనసాగింది. బ్యాంకు తరుపున ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. డ్యాన్స్‌లో ఎంఏ చేయాలన్న ఉద్దేశంతో రెండేళ్లు బ్యాంకుకు సెలవు పెట్టాను. సెంట్రల్ యూనివర్సిటీలో చేరాను. కానీ, 2020లో 22 ఏళ్ల ఉద్యోగ జీవితానికి ముగింపు పలికాను. వీఆర్‌ఎస్ తీసుకున్నాను. ఎప్పటి నుంచో అనుకొంటున్న పీహెచ్‌డీ మొదలుపెట్టాను. పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో ప్రముఖ నర్తకి అలేఖ్య పుంజల నేతృత్వంలో పరిశోధన పూర్తయింది. ఊహ తెలిసినప్పటి నుంచీ నా జీవితం నాట్యంతో అనుబంధంగా సాగింది. నేను వేరు... నాట్యం వేరు కాదు. నా చదువూ అదే దారిలో సాగింది.

### 'నృత్య కిన్నెర'...

పెళ్లి తరువాత నా జీవితం సరికొత్త మలుపు తీసుకుంది. 'కిన్నెర ఆర్ట్ థియేటర్స్' కార్యదర్శి మద్దాళి రఘురామ్‌తో 1981లో నాకు వివాహం అయింది. అప్పటికే సాంస్కృతిక రంగంలో ఉన్న ఆయన... కళాకారిణినే పెళ్లి చేసుకోవాలని అనుకున్నారట. అలా బంధువుల ద్వారా సంబంధం కలిసింది. ఒక అత్తమామలను చూసుకొంటూనే, ఇంటి పనులు, ఉద్యోగం, నాట్య శిక్షణ, ప్రదర్శనలు... క్షణం తీరిక ఉండేది కాదు. అన్నిటినీ సమన్వయం చేసుకొంటూ వచ్చేదాన్ని. కానీ ఏ రోజూ బాధ్యతలను భారంగా భావించలేదు. అయితే నాట్యానికి ప్రత్యేకంగా ఒక వేదిక ఉండాలనే ఉద్దేశంతో 'కిన్నెర ఆర్ట్ థియేటర్స్'కు అనుబంధంగా 1984లో 'నృత్య కిన్నెర' నెలకొల్పాను. ఇది కేవలం కూచిపూడి నాట్యాభిలాషుల కోసమే. దీని తరుపున ఢిల్లీ, ముంబయి, విశాఖపట్టణం తదితర నగరాల్లో నాట్యోత్సవాలు ఎన్నో నిర్వహించాను. 'తానా, ఆటా' వేదికలపై కూడా నేను ప్రదర్శనలు ఇచ్చాను. 'నృత్య కిన్నెర'కు 2003 నుంచి కేంద్ర సాంస్కృతిక శాఖ శాలరీ గ్రాంట్ అందిస్తోంది.

### ఆసక్తి ఉంటే చాలు...

కూచిపూడి నేర్చుకోవాలన్న ఆసక్తి, నిబద్ధత ఉంటే చాలు... శిక్షణ ఇవ్వడానికి నేను వెనకాడను. మా ఇంటి చుట్టుపక్కల పిల్లలకు, ఆర్థిక స్తోమత లేనివారికి ఉచితంగా డ్యాన్స్ నేర్పిస్తున్నాను. నా వద్దకు వచ్చేవారిని ఇంత ఇవ్వమని డిమాండ్ చేయను. ఇచ్చింది తీసుకొంటాను. ఇప్పటివరకు మూడొందల మందికి కూచిపూడిలో శిక్షణ ఇచ్చాను. దాదాపు యాభైమంది అరంగేట్రం అయింది. కొందరు శిష్యులు దేశవిదేశాల్లో నాట్యాలయాలు ఏర్పాటు చేశారు. ఒక అమ్మాయి ముంబయిలో 'నృత్య కిన్నెర' పేరుతో ఎన్నో ఏళ్లుగా ఇనిస్టిట్యూట్ నడుపుతోంది. వాళ్లందరినీ చూసినప్పుడు నా మనసు పరవశిస్తుంది. ప్రస్తుతం ముప్పైమంది నావద్ద కూచిపూడి అభ్యసిస్తున్నారు. కష్టాల్లో ఉన్నవారికి ఆర్థిక సాయం చేశాను. ఆ భగవంతుడు నాకు అన్నీ ఇచ్చాడు. ఉన్నంతలో సాయం చేయగలిగితే అదే పదివేలు.

### అవే నాకు ఊపిరి...

నాట్యమే నాకు ఊపిరి. జీవించి ఉన్నంతవరకు నాట్యాభినయం కొనసాగించాలి. సాధ్యమైనంతమందిని కూచిపూడి కళాకారులుగా తీర్చిదిద్దాలి. ఇదే నా అభిలాష. ఇప్పటికి పదిహేనుకు పైగా బాలేలకు కొరియోగ్రఫీ చేశాను. రెండు వందలకు పైగా నృత్యరూపకాలకు దర్శకత్వం వహించాను. ఎస్వీబీసీ వారి 'నాద నీరాజనం', దూరదర్శన్‌తో పాటు, దేశంలోని వివిధ నగరాలు, ఇతర దేశాల్లో జరిగిన ఉత్సవాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. మొన్న ఉగాదికి ముప్పై మంది శిష్యులు కలిసి 'అలమేలుమంగ' రూపకం వేశారు. నా డెబ్బయ్యవ పుట్టినరోజు సందర్భంగా వచ్చే నెల 2న రవీంద్రభారతిలో 'మాతృదేవోభవ' కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శిస్తున్నారు.

### జన్మ ధన్యమైన సందర్భం...

అరవై ఏళ్ల ఈ నాట్య ప్రయాణంలో ఎన్నో ఒడుదొడుకులు. ఎన్నో సవాళ్లు. ఒక మహిళగా, ఒక సంస్థను, అదీ కళాసంస్థను నిర్వహించడం అంటే ఈ రోజుల్లో అంత సులువు కాదు. కానీ కూచిపూడి నాట్యానికి పట్టం కట్టాలన్న ఒక మహత్ సంకల్పమే నన్ను నడిపిస్తోంది. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారాలు, హంస పురస్కారం, తెలుగు వర్సిటీ వారి ప్రతిభ పురస్కారం, 'యూరోపియన్ తెలుగు అసోసియేషన్' వారి పురస్కారం... ఇలా ఎన్నో వరించాయి. అన్నిటికీ మించి గత ఏడాది కేంద్ర ప్రభుత్వ 'సంగీత నాటక అకాడమీ' అవార్డు రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోవడం నా జీవితంలోనే మధురమైన ఘట్టం. కళారంగంలో 'పద్మ' పురస్కారాలతో సమానమైన గౌరవం ఇది. అవార్డు తీసుకున్నప్పుడు అనిపించింది... 'నా జన్మ ధన్యమైంద'ని.



### చేయాల్సినవి ఉన్నాయి...

నేను రెండు కథల పుస్తకాలు కూడా రాశాను. ఒకటి... 'కడదాకా కదిలి', రెండోది 'బామ్మ గారి కాశీయాత్ర'. స్వాతి, నవ్య వీక్లీల్లో కూడా నా నవలలు ప్రచురితమయ్యాయి. 'నవ్య' వీక్లీలో రాసిన 'మౌనమే సాక్షిగా' నవలకు రెండో బహుమతి వచ్చింది. నా మనసులో రెండు మూడు బాలేలు ఉన్నాయి. వాటిని నా శిష్యులతో చేయించాలి. ప్రముఖ నాట్య గురువులందరితో మాట్లాడి ఒక గ్రంథం రాయాలి. త్వరగా కోలుకొని మరింతమందికి శిక్షణ ఇవ్వాలి. చక్రాల కుర్చీలో ఉన్నా నా మెదడు ఎప్పుడూ కూచిపూడి చుట్టూనే తిరుగుతోంది. చూద్దాం... దైవ సంకల్పం ఎలా ఉందో!

### ఆ నమ్మకమే నడిపిస్తోంది...

రెండేళ్ల కిందట నా జీవితంలో అనూహ్య కుదుపు. 108 అన్నమాచార్య కీర్తనలను మా శిష్యులతో నృత్య రూపకంగా ప్రదర్శించాలని అనుకున్నాను. అందుకోసం రిహార్సల్స్, ఇతర పనుల్లో క్షణం తీరిక లేకుండా గడిపాను. నాకు తెలియకుండానే నేను తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లిపోయాను. దాంతో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. మెదభాగంలో బ్లాక్ అయిందని వైద్యులు చెప్పారు. తరువాత పెరాలసిస్ వచ్చింది. మాట్లాడగలుగుతున్నాను కానీ... పూర్తి స్థాయిలో కదల్లేకపోతున్నాను. ప్రస్తుతం ఫిజియోథెరపీ చేస్తున్నారు. చక్రాల కుర్చీలో కూర్చొనే 'సంగీత నాటక అకాడమీ' అవార్డు తీసుకున్నాను. ఎందుకంటే ఆ పురస్కారం నా కల. ఈ రెండేళ్లలో ఇలానే మా విద్యార్థులతో పది కార్యక్రమాలు నిర్వహించాను. త్వరలోనే మళ్లీ మామూలు మనిషిని అవుతాను. నా మనోబలమే నా ధైర్యం. నా శిష్య బృందం, సన్నిహితులు, స్నేహితులు... వీరందరూ నేను కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకొంటున్నారు. ముఖ్యంగా పదిమందికీ కూచిపూడిని చేరువ చేయాలన్న తపన, ఆ కళారూపాన్ని విశ్వవ్యాప్తం చేయాలన్న సంకల్పమే నాకు నిత్య ప్రేరణ.

• హనుమా

---

బౌన్సర్... దాదాపుగా పురుషులదే ఆధిపత్యమైన ఈ వృత్తిని ఎంచుకోవడమే కాదు, అందులో రాణిస్తూ ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నారు **అను కుంజుమన్**. ఫొటోగ్రాఫర్‌గా వృత్తి జీవితం ప్రారంభించిన ఆమె కేరళలో తొలి మహిళా బౌన్సర్‌గా గుర్తింపు పొందారు. నటిగానూ అవకాశాలు అందుకుంటున్నారు. 'నటుడు మోహన్‌లాల్ పర్సనల్ బాడీగార్డ్' అంటూ తన గురించి జరిగిన ప్రచారం అవాస్తవం అంటున్న 37 ఏళ్ళ అను కథ ఇది.

# ఆ సంఘటనే బౌన్సర్‌గా మార్చింది



"కొన్నాళ్ళ క్రితం ఒక ఆంగ్ల వార్తా సంస్థ మహిళా బౌన్సర్ల గురించి కథనం రూపొందిస్తూ... నన్ను ఇంటర్వ్యూ చేసింది. వారికి నా వీడియోలు కొన్ని పంపించాను. మోహన్‌లాల్‌తో నేను కలిసి ఉన్న వీడియో ఒకటి వైరల్ అయింది. నేను ఆయనకు వ్యక్తిగత బాడీగార్డ్ అనీ, సెక్యూరిటీ హెడ్ అనీ ప్రచారం జరిగింది. అది నిజం కాదు. కొచ్చిలో ఆయన పాల్గొన్న ఒక కార్యక్రమంలో నేను బౌన్సర్‌గా పని చేశానంతే. ఏదైతేనేం... నేను ఊహించని ప్రచారం వచ్చింది. వార్తా పత్రికలు, టీవీ ఛానెల్స్ నా గురించి ఆరా తీయడం మొదలుపెట్టాయి.

### అమ్మకు చేదోడుగా...

బౌన్సర్ వృత్తిలోకి నేను అనుకోకుండా వచ్చాను. నేను పుట్టి పెరిగింది కేరళలోని ఎర్నాకుళం జిల్లాలోని ఒక గ్రామంలో. నా చిన్నప్పుడే నాన్న మాకు దూరమయ్యారు. నన్ను, నా సోదరిని పెంచడానికి మా అమ్మ ఎన్నో కష్టాలు పడింది. వాటికి మేమూ అలవాటు పడ్డాం. అవే నన్ను రాటుదేల్చాయనుకుంటాను. చదువు పూర్తయ్యాక... చిన్న చిన్న పనులు చేస్తూ అమ్మకు ఆర్థికంగా చేదోడుగా ఉండేదాన్ని. అప్పుడే ఫొటోగ్రఫీ నేర్చుకున్నాను. పెళ్ళిళ్ళ లాంటి ఈవెంట్లకు పని చేసేదాన్ని. క్రమంగా పెద్ద కార్యక్రమాలకు కూడా అవకాశాలు వచ్చాయి. ఆ సమయంలో ఎదురైన ఒక సంఘటన... నా జీవితాన్ని మలుపు తిప్పింది.

### కొత్త అధ్యాయం ప్రారంభించాను...

కొచ్చిలో ఒక ఉత్పత్తి ప్రచార కార్యక్రమానికి ఫొటోగ్రాఫర్‌గా వెళ్ళాను. అక్కడికి కొందరు సెలబ్రిటీలు వచ్చారు. వారిలో ఒకరి బౌన్సర్ నన్ను తోసేయడంతో... పక్కకు పడిపోయాను. అతను తన బృందంతో కలిసి వచ్చి క్షమాపణ చెప్పాడు. అలా వారితో పరిచయం ఏర్పడింది. ఆ తరువాత కొన్ని కార్యక్రమాల్లో వాళ్ళు కలుస్తూ ఉండేవారు. బౌన్సర్లుగా మహిళలు ఎందుకు ఉండరని వారిని అడిగాను. "ఫిట్‌నెస్ ఉంటే మహిళలు కూడా బౌన్సర్లు కావచ్చు. మీరు ఫిట్‌గానే ఉన్నారు కాబట్టి ప్రయత్నించండి. దేశంలో ఎక్కువమంది మహిళా బౌన్సర్లు లేరు. కానీ అవసరం చాలా ఉంది" అని చెప్పారు. లేడీ బౌన్సర్ కావాలని అప్పుడే నిశ్చయించుకున్నాను. అందుకు అవసరమైన సూచనలు, సలహాలు వారి దగ్గరే తీసుకున్నాను. ఆ నిర్ణయానికి నా కుటుంబం కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. అలా కేరళలో తొలి మహిళా బౌన్సర్‌గా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాను. మొదట్లో చిన్న చిన్న కార్యక్రమాలకు అవకాశాలు వచ్చేవి. గత మూడేళ్ళుగా పెద్ద ఈవెంట్స్‌కు బౌన్సర్‌గా వెళ్తున్నాను. వాటిలో సెలబ్రిటీల ఫంక్షన్ల నుంచి ఆడంబరంగా ఉండే పబ్ పార్టీల వరకూ ఉంటాయి. అంతేకాదు... మహిళా సెలబ్రిటీలకు, వ్యాపార ప్రముఖులకు కూడా ఎస్కార్ట్‌గా వెళ్తూ ఉంటాను. ఇప్పుడు ఈ వృత్తిలోకి వచ్చే మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

### నిజాయితీ, నిబద్ధతతో...

నా కథ విన్నాక ఎంతోమంది మహిళలు నన్ను సంప్రతిస్తున్నారు. బౌన్సర్ కావాలనుకుంటున్నామని చెబుతున్నారు. ఇది నాకు ఎంతో సంతోషం కలిగిస్తోంది. వారికి నేను చెప్పగలిగేది ఒక్కటే. బౌన్సర్ అనేది చాలా ఒత్తిడితో కూడుకున్న వృత్తి. దీనికి శరీర దారుఢ్యంతో పాటు మానసిక స్థైర్యం కూడా ఉండాలి. కొందరు దీన్ని గౌరవనీయమైన వృత్తిగా పరిగణించరు. కానీ బతకడానికి ఆదాయం ఇచ్చేదీ, చట్టవిరుద్ధం కానిదీ అయిన పనిని నిజాయితీగా, నిబద్ధతతో చేస్తే... గౌరవం దానంతట అదే వస్తుంది. నా వరకూ వ్యక్తిగతంగా ఎలాంటి చేదు అనుభవాలూ ఎదురు కాలేదు. అయితే పబ్‌లలో, పార్టీల్లో, సెలబ్రిటీ ఈవెంట్లలో తరచూ ఉద్రిక్తతలు చోటు చేసుకుంటాయి. జనం వారిపై ఎగబడడం వల్ల తొక్కిసలాటలు, ఘర్షణలు సాధారణం. అలాంటి సమయాల్లో సయమనం కోల్పోకుండా... సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. ఆగ్రహావేశాలు పెరగకుండా ఆపాలి. ఎవరి సూచనల కోసమో ఎదురుచూస్తే పరిస్థితులు అదుపు తప్పుతాయి. అదృష్టవశాత్తూ... నేను స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొనేలా మా అమ్మ పెంచింది. అందుకే భిన్నమైన సందర్భాలను ధైర్యంగా ఎదుర్కొంటాను. నాకు ఇద్దరు పిల్లలు. ప్రతి విషయంలో వాళ్ళు నాకు అండగా ఉంటారు. ప్రతిరోజూ బౌన్సర్‌గా పని ఉండదు కాబట్టి... ఫొటోగ్రాఫర్‌గానూ కొనసాగుతున్నాను. అంతేకాదు... నటన అంటే నాకు ఆసక్తి. 'విశేషం', 'పూరమ్ పూరాడమ్ పూరుడతి' అనే సినిమాల్లో చిన్న పాత్రలు వేశాను. మరిన్ని అవకాశాల కోసం ఎదురు చూస్తున్నాను."



> కొచ్చిలో ఒక కార్యక్రమానికి కొందరు సెలబ్రిటీలు వచ్చారు. ఒక బౌన్సర్ నన్ను తోసేయడంతో... పక్కకు పడిపోయాను. అతను వచ్చి క్షమాపణ చెప్పాడు. అలా వారితో పరిచయం ఏర్పడింది. బౌన్సర్లుగా మహిళలు ఎందుకు ఉండరని వారిని అడిగాను. "ఫిట్‌నెస్ ఉంటే మహిళలు కూడా బౌన్సర్లు కావచ్చు. ప్రయత్నించండి" అని చెప్పారు.

---

వేసవిలో మండే ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ఇళ్లలో ఎయిర్ కండిషనర్‌లను వాడతాం. కానీ కొంతమందికి ఏసీ చల్లదనం సరిపడక తలనొప్పి, చర్మం పొడిబారడం, కళ్ల దురద, జలుబు, గొంతు పట్టేయడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. కనుక ఏసీని ఉపయోగించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యల నుంచి బయటపడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.


# ఏసీ చల్లదనంతో సమస్యా?



- ఏసీ ఫిల్టర్లలో ఎక్కువగా దుమ్ము చేరుతూ ఉంటుంది. ఏసీని ఉపయోగిస్తున్నప్పుడు ఈ దుమ్ము కణాలు వాటిలోని హానికారక బ్యాక్టీరియా గది అంతటా వ్యాపిస్తాయి. గదిలోకి రాగానే ఇవి శ్వాసకోశాల్లోకి చేరి జలుబు, తుమ్ములు, దగ్గు లాంటి సమస్యలను కలిగిస్తాయి. తరచూ ఏసీని, ఫిల్టర్లను శుభ్రం చేస్తూ ఉంటే వీటిని అధిగమించవచ్చు.
- ఏసీ వేసి ఉన్న గదిలో ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉంటుంది. ఎక్కువసేపు ఇలాంటి చల్లని వాతావరణంలో గడపడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. దీంతో రోగనిరోధక వ్యవస్థ బలహీనమవుతుంది. తలనొప్పి, ముక్కు దిబ్బడ, కళ్ల దురద వస్తుంటాయి. చర్మం పొడిబారుతుంది కూడా. గదిలో చల్లదనం మరీ ఎక్కువగా కాకుండా మధ్యమంగా ఉండేలా ఏసీ ఉష్ణోగ్రతను నియంత్రిస్తే ఈ సమస్యలు రావు.
- ఏసీ గదిలో ఉన్నప్పటికీ శరీరం తేమను కోల్పోతూ ఉంటుంది. దాహం అనిపించకపోయినా తరచూ మంచి నీళ్లు తాగుతూ ఉండాలి. రాత్రి పూట పడుకునే ముందు గదిలో హ్యూమిడిఫైయర్‌ను వాడడం మంచిది. అలాగే ఏసీ టైమర్ పెట్టుకుంటే నిర్జలీకరణ సమస్యలు రావు.
- గదిలో ఏసీ వేసినప్పుడు సాధారణంగా తలుపులు, కిటికీలు మూసి ఉంచుతాం. దీని వల్ల గదిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుతుంది. ఫలితంగా శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. కనీసం రెండు గంటలకు ఒకసారి అయిదు నిమిషాలపాటు కిటికీలు, తలుపులు తెరచి ఉంచితే గదిలో తాజాదనం విస్తరిస్తుంది.
- ఏసీ గాలి నేరుగా శరీరాన్ని తాకితే తలనొప్పి వస్తుంది. జలుబు చేస్తుంది కూడా. ఏసీ గాలి నేరుగా కాకుండా ఓ పక్కకు ప్రసరించేలా ఏర్పాటు చేసుకుంటే గది మొత్తం మెల్లగా చల్లబడి హాయిగా అనిపిస్తుంది. ఏసీలో స్వింగ్ ఫీచర్‌ని ఉపయోగించుకోవడం మంచిది.

---

# మజానిచ్చే మామిడి ఇడ్లీ!



చాలా మంది ఏడాదంతా ఎదురుచూసే మామిడి పళ్ల కాలం వచ్చేసింది. ఈ పళ్లతో రకరకాల వంటలు చేస్తారు. అలాంటి రుచికరమైన ఒక వంట- మామిడి ఇడ్లీ. దీని తయారీ విధానం తెలుసుకుందాం.

**కావాల్సిన పదార్థాలు:**

ఇడ్లీ రవ్వ-2 కప్పులు, మామిడి పండ్ల గుజ్జు-2 కప్పులు, పంచదార పొడి-1/4 కప్పు, పెరుగు-1/2 కప్పు, పాలు-1/2 కప్పు, యాలకుల పొడి-1/2 టీస్పూన్, జీడిపప్పు-తగినంత

**తయారీ:**

- ఒక గిన్నెలో ఇడ్లీ రవ్వను బాగా కడగాలి. దానిలో మామిడి గుజ్జు, చక్కెర పొడి, పెరుగు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. దీనిని ఒక అరగంట నానబెట్టాలి. ఆ తర్వాత పాలు కొంచెం కొంచెంగా పోస్తూ కలుపుకోవాలి.
- ఈ మిశ్రమంలో ఒక ఈనో ప్యాకెట్ లేదా వంట సోడాను వేసి ఇడ్లీ పిండిలా కలపాలి.
- ఇడ్లీ ప్లేట్లకు నెయ్యి రాసుకొని వాటిలో పిండి వేయాలి. వాటిపై జీడిపప్పు పెట్టాలి. వీటిని ఇడ్లీ పాత్రలో 15 నిమిషాలు ఉడికించాలి.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● సోమవారం 28 ఏప్రిల్ 2025

# భారత్ ఆల్‌రౌండ్ షో

**ముక్కోణపు వన్డే సిరీస్‌లో బోణీ • 9 వికెట్లతో శ్రీలంక చిత్తు**


ప్రతిక (50 నాటౌట్)


శ్రీచరణి (2/26)

**కొలంబో:** ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన భారత మహిళలు ముక్కోణపు వన్డే టోర్నీలో ఘనమైన బోణీ కొట్టారు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లతో శ్రీలంకను చిత్తు చేశారు. అంతర్జాతీయ అరంగేట్రం చేసిన తెలుగు స్పిన్నర్ శ్రీచరణి (2/26) రెండు వికెట్లతో సత్తా చాటింది. వర్షం వల్ల ఈ మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించారు. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 38.1 ఓవర్లలో 147 పరుగులకు కుప్పకూలింది. హాసినీ పెరీరా (30), కవిషా దిల్హరి (25), అనుష్క సంజీవని (22) ఫర్వాలేదనిపించారు. స్నేహ్ రాణా మూడు, దీప్తీ శర్మ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో టాపార్డర్ విజృంభించడంతో భారత్ కేవలం 29.4 ఓవర్లలో 149/1 స్కోరు చేసి సునాయాసంగా నెగ్గింది. ఓపెనర్లు ప్రతికా రావల్ (50 నాటౌట్), మంధాన (43), హర్లీన్ డియోల్ (48 నాటౌట్) రాణించారు. ప్రతిక ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో మంగళవారం దక్షిణాఫ్రికాతో తలపడుతుంది.

**ఛేదన సునాయాసంగా..:** స్వల్ప స్కోరు ఛేదనలో ఓపెనర్లు ప్రతిక, మంధాన అద్భుత ఆరంభం ఇచ్చారు. ఏడో వన్డే మాత్రమే ఆడుతున్న ప్రతిక రెండు కీలకమైన భాగస్వామ్యాలు నెలకొల్పింది. మంధానాతో కలిసి తొలి వికెట్‌కు 54, అనంతరం హర్లీన్ డియోల్‌తో కలిసి రెండో వికెట్‌కు అభేద్యంగా 95 రన్స్ జత చేసింది. ఈక్రమంలో వన్డేలలో వరుసగా నాలుగో హాఫ్ సెంచరీని ప్రతిక నమోదు చేసింది.

**బౌలర్లు భళా:** అంతకుముందు భారత స్పిన్నర్ల ధాటికి శ్రీలంక బ్యాటర్లు పరుగులు చేయడం కష్టమైంది. వన్డే అరంగేట్రం చేసిన పేసర్ కష్వీ గౌతమ్ వికెట్ సాధించకపోయినా పొదుపైన బౌలింగ్‌తో ఆకట్టుకుంది. భారీ వర్షంతో మ్యాచ్ మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభం కాగా..పిచ్‌పై తేమను సద్వినియోగం చేసుకున్న భారత బౌలర్లు ప్రత్యర్థిని పరుగులు చేయకుండా నిరోధించారు.

**సంక్షిప్తస్కోర్లు: శ్రీలంక:** 38.1 ఓవర్లలో 147 ఆలౌట్ (హాసినీ పెరీరా 30, కవిషా దిల్హరి 25, అనుష్క సంజీవని 22, స్నేహ్ రాణా 3/31, దీప్తీ శర్మ 2/22, శ్రీచరణి 2/26); **భారత్:** 29.4 ఓవర్లలో 149/1 (ప్రతికా రావల్ 50 నాటౌట్, హర్లీన్ డియోల్ 48 నాటౌట్, మంధాన 43, ఇనోకా రణవీర 1/32).

# ముంబై జైత్రయాత్ర

**వరుసగా ఐదో వి జయం**

**సూర్య, రికెల్టన్ అర్ధ శతకాలు**
**54 పరుగులతో లఖ్‌నవూ చిత్తు**
**బుమ్రాకు 4 వికెట్లు**


సూర్యకుమార్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులతో 54)


విల్ జాక్స్ (29, 2/18)

ఐపీఎల్‌లో వేగంగా 4వేల పరుగుల మైలు రాయిని చేరిన రెండో ఆటగాడిగా సూర్యకుమార్. 2,714 బంతుల్లో సూర్య ఈ ఫీట్ చేస్తే.. 2,658 బంతుల్లో సాధించిన గేల్, డివిలీర్స్ సంయుక్తంగా టాప్‌లో ఉన్నారు.

**ముంబై:** జోరుమీదున్న ముంబై ఇండియన్స్ వరుసగా ఐదో విజయంతో ప్లేఆఫ్స్ దిశగా దూసుకెళ్తోంది. ర్యాన్ రికెల్టన్ (32 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 58), సూర్యకుమార్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 54) హాఫ్ సెంచరీలతోపాటు బుమ్రా (4/22) నిప్పులు చెరగడంతో.. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 54 పరుగులతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను మట్టికరిపించింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 215/7 స్కోరు చేసింది. మయాంక్, అవేశ్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో లఖ్‌నవూ ఓవర్లన్నీ ఆడి 161 పరుగులకు ఆలౌటైంది. ఆయుష్ బదోని (35), మిచెల్ మార్ష్ (34) ఫర్వాలేదనిపించారు. ట్రెంట్ బౌల్ట్ మూడు వికెట్లు దక్కించుకోగా.. ఆల్‌రౌండ్ షో చేసిన విల్ జాక్స్ (29, 2/18) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

**పెవిలియన్‌కు క్యూ:** ముంబై పేసర్లు బుమ్రా, బౌల్ట్ వికెట్ల వేటలో పోటీపడడంతో.. లఖ్‌నవూ బ్యాటింగ్ పేకమేడను తలపించింది. రెండో వికెట్‌కు పూరన్ (27)తో కలసి 42 రన్స్ జోడించిన మార్ష్.. బదోనితో నాలుగో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. అయితే, పూరన్, కెప్టెన్ రిషభ్ పంత్ (4)ను జాక్స్ ఒకే ఓవర్‌లో అవుట్ చేసి ఝలక్ ఇచ్చాడు. కాగా, ఓపెనర్ మార్‌క్రమ్ (9)ను స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చిన బుమ్రా.. 16వ ఓవర్‌లో మిల్లర్ (24), సమద్ (2), బిష్ణోయ్ (13) వికెట్లతో ప్రత్యర్థి వెన్నువిరిచాడు. మార్ష్, బదోనితోపాటు దిగ్వేష్ (1)ను అవుట్ చేసిన బౌల్ట్.. లఖ్‌నవూ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

**చెలరేగిన సూర్య:** రికెల్టన్, సూర్య అర్ధ శతకాలతో.. ముంబై భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ శుభారంభం అందించారు. ఫోర్‌తో ఖాతా తెరిచిన ఓపెనర్ రికెల్టన్.. రెండో ఓవర్‌లో ప్రిన్స్ బౌలింగ్‌లో 6,4,4తో చెలరేగాడు. అయితే, గాయం నుంచి పునరాగమనం చేసిన పేసర్ మయాంక్ వేసిన మూడో ఓవర్‌లో వరుసగా రెండు సిక్స్‌లు బాదిన మరో ఓపెనర్ రోహిత్ (12).. అదే ఓవర్‌లో స్లో బంతికి బోల్తాపడ్డాడు. దీంతో తొలి వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన విల్ జాక్స్ (29) కూడా రికెల్టన్‌తో పోటీపడి మరీ షాట్లు ఆడారు. ఆరో ఓవర్‌లో రికెల్టన్ 6,4,6తో 19 పరుగులు రాబట్టడంతో.. పవర్‌ప్లేను ముంబై 66/1తో మెరుగ్గా ముగించింది. అయితే, ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న రికెల్టన్‌ను ప్రిన్స్ బౌల్డ్ చేసినా.. రెండో వికెట్‌కు 55 పరుగులు సమకూరాయి. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సూర్య.. చిన్నచిన్న భాగస్వామ్యాలతో జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. జాక్స్‌ను ప్రిన్స్ బౌల్డ్ చేయగా.. తిలక్ వర్మ (6)ను బిష్ణోయ్, హార్దిక్ పాండ్యా (5)ను మయాంక్ వెనక్కిపంపారు. మరోవైపు అవేశ్ బౌలింగ్‌లో సిక్స్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న సూర్య.. ఆ తర్వాతి బంతికి అవుటయ్యాడు. చివరి ఓవర్లలో నమన్ ధిర్ (25 నాటౌట్), బోష్ (20) వేగంగా ఆడడంతో.. ముంబై స్కోరు 200 మార్క్ దాటింది.

**స్కోరుబోర్డు**

**ముంబై:** రికెల్టన్ (సి) బదోని (బి) రాఠీ 58, రోహిత్ (సి) ప్రిన్స్ (బి) మయాంక్ 12, జాక్స్ (బి) ప్రిన్స్ 29, సూర్యకుమార్ (సి) మార్ష్ (బి) అవేశ్ 54, తిలక్ (సి) ప్రిన్స్ (బి) బిష్ణోయ్ 6, హార్దిక్ (బి) మయాంక్ 5, నమన్ (నాటౌట్) 25, బాష్ (సి) పూరన్ (బి) అవేశ్ 20, చాహర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 215/7; వికెట్ల పతనం:** 1-33, 2-88, 3-116, 4-137, 5-157, 6-180, 7-208; **బౌలింగ్:** మయాంక్ 4-0-40-2, ప్రిన్స్ 4-0-44-1, దిగ్వేష్ రాఠీ 4-0-48-1, బిష్ణోయ్ 4-0-41-1, అవేశ్ ఖాన్ 4-0-42-2.

**లఖ్‌నవూ:** మార్ష్ (సి) తిలక్ (బి) బౌల్ట్ 34, మార్‌క్రమ్ (సి) నమన్ (బి) బుమ్రా 9, పూరన్ (సి) సూర్య (బి) జాక్స్ 27, పంత్ (సి) కర్ణ్ శర్మ (బి) జాక్స్ 4, ఆయుష్ (సి) జాక్స్ (బి) బౌల్ట్ 35, మిల్లర్ (సి) బాష్ (బి) బుమ్రా 24, సమద్ (బి) బుమ్రా 2, బిష్ణోయ్ (బి) బాష్ 13, అవేశ్ (బి) బుమ్రా 0, ప్రిన్స్ (నాటౌట్) 4, దిగ్వేష్ (బి) బౌల్ట్ 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 161 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-18, 2-60, 3-64, 4-110, 5-135, 6-141, 7-142, 8-142, 9-157; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-20-3, చాహర్ 3-0-38-0, బుమ్రా 4-0-22-4, జాక్స్ 2-0-18-2, కర్ణ్ శర్మ 2-0-25-0, హార్దిక్ 1-0-10-0, బాష్ 4-0-26-1.

## పంత్‌కు రూ. 24 లక్షల జరిమానా

**ముంబై:** ఈ సీజన్‌లో లఖ్‌నవూ రెండోసారి స్లో ఓవర్ రేట్‌కు పాల్పడడంతో ఆ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్‌కు రూ. 24 లక్షలు జరిమానా విధించారు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ బౌలర్లు నిర్దేశిత సమయానికి కోటా పూర్తి చేయలేకపోయారు. దీంతో నిబంధనల ప్రకారం ఇక జట్టులోని ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు.

## మూడో స్థానంలో అరవింద్

**వార్సా:** గ్రాండ్ ప్రీ చెస్ ర్యాపిడ్ ఆరో రౌండ్ ముగిసేసరికి భారత గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం మూడో స్థానానికి దూసుకొచ్చాడు. ఆదివారం జరిగిన నాలుగో గేమ్‌లో గెలిచిన అరవింద్ ఐదు, ఆరో రౌండ్‌లను డ్రా చేసుకున్నాడు. దాంతో ఏడు పాయింట్లతో అరవింద్ మూడో స్థానానికి దూసుకొచ్చాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మూడు రౌండ్లలో..రెండింటిలో పరాజయం పాలయ్యాడు. మరో రౌండ్‌ను డ్రాగా ముగించాడు. దాంతో ప్రజ్ఞానంద (5) ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్నాడు.

**ఐపీఎల్‌లో నేడు** — వేదిక జైపూర్
రాజస్థాన్ x గుజరాత్ — రా.7.30 నుంచి

# టాప్ లేపిన బెంగళూరు

- ఆదుకున్న క్రునాల్, విరాట్
- ఢిల్లీపై ఆరు వికెట్లతో విజయం


క్రునాల్ పాండ్యా (47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 73 నాటౌట్)

**1** ఐపీఎల్ సీజన్‌లో ఇతర వేదికలపై వరుసగా ఆరు విజయాలు సాధించిన ఏకైక జట్టుగా ఆర్‌సీబీ.

**న్యూఢిల్లీ:** తాజా సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అదరగొడుతోంది. మరీ ముఖ్యంగా ప్రత్యర్థి సొంత మైదానాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంటూ తొలి టైటిల్ కోసం దూసుకెళుతోంది. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 163 పరుగుల ఛేదనలో అనూహ్యంగా తడబాటుకు గురైనా ఆర్‌సీబీ ఒత్తిడికి లోను కాలేదు. క్రునాల్ పాండ్యా (47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 73 నాటౌట్) సమయోచిత ఆటతీరుకు, ఛేజింగ్ రారాజు విరాట్ కోహ్లీ (47 బంతుల్లో 4 ఫోర్లతో 51) సహకారం అందించగా ఢిల్లీ క్యాపిటల్స్‌పై 6 వికెట్ల తేడాతో ఆర్‌సీబీ నెగ్గింది. దీంతో 14 పాయింట్లతో పట్టికలో టాప్‌నకు చేరి ప్లేఆఫ్స్ ఆశలను మరింత మెరుగుపర్చుకుంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 162 పరుగులు చేసింది. రాహుల్ (41), స్టబ్స్ (34), పోరెల్ (28) మాత్రమే రాణించారు. భువనేశ్వర్‌కు 3, హాజెల్‌వుడ్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో బెంగళూరు 18.3 ఓవర్లలో 4 వికెట్లకు 165 పరుగులు చేసి గెలిచింది. టిమ్ డేవిడ్ (5 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 19 నాటౌట్) చివర్లో మెరిశాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా క్రునాల్ నిలిచాడు.

**శతక భాగస్వామ్యంతో..:** ఆర్‌సీబీ ముందు ఓ మాదిరి ఛేదనే అనిపించినా.. డీసీ బౌలర్లు ఆదిలోనే ఝలక్ ఇచ్చారు. ఓవర్లు సాగుతున్నకొద్దీ లక్ష్యం కఠినంగా మారుతుండడంతో ఫలితంపై ఉత్కంఠ ఏర్పడింది. అయితే ఓపెనర్ విరాట్‌కు తోడు క్రునాల్ అద్భుత ఆటతీరుతో శతక భాగస్వామ్యం నమోదు చేసి జట్టును గట్టెక్కించారు. చివర్లో టిమ్ డేవిడ్ (19 నాటౌట్) ధమాకా ఆటతీరుతో మురిపించాడు. ఓపెనర్ బెథెల్ (12), దేవ్‌దత్ (0)లను స్పిన్నర్ అక్షర్ మూడో ఓవర్‌లోనే పెవిలియన్‌కు చేర్చి షాకిచ్చాడు. కాసేపటికే కెప్టెన్ రజత్ (6)ను కరుణ్ రనౌట్ చేయడంతో ఆర్‌సీబీ తీవ్ర ఒత్తిడిలో పడింది. అటు పవర్‌ప్లేలో కేవలం 35/3 స్కోరుకే పరిమితం కావడంతో ఛేదన కష్టమే అనిపించింది. కానీ ఈ ఇబ్బందికర పరిస్థితిలో విరాట్-క్రునాల్ జోడీ నిలబడింది. వికెట్‌ను కోల్పోకూడదనే లక్ష్యంతో వీరు ఆచితూచి ఆడారు. అటు సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతున్నా బెదరలేదు. 13వ ఓవర్‌లో క్రునాల్ రెండు సిక్సర్లతో కాస్త కదలిక వచ్చింది. అలాగే 38 బంతుల్లో అతడు కెరీర్‌లో రెండో ఫిఫ్టీని పూర్తి చేశాడు. అటు విరాట్ సైతం తన హ్యాట్రిక్ హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. 17వ ఓవర్‌లో క్రునాల్ 2 ఫోర్లతో 12 రన్స్ సమకూరాయి. ఇక తర్వాతి ఓవర్‌లోనే విరాట్ వెనుదిరగడంతో మూడో వికెట్‌కు 119 పరుగుల భాగస్వామ్యం ముగిసినప్పటికే ఆర్‌సీబీ విజయం దరిదాపుల్లోకి వచ్చింది. 12 బంతుల్లో 17 రన్స్ కావాల్సిన వేళ టిమ్ డేవిడ్ 6,4,4,4తో 9 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

**మెరుపుల్లేవ్..:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీని ఆర్‌సీబీ బౌలర్లు గణనీయంగా కట్టడి చేశారు. అటు స్లో వికెట్ కావడంతో డీసీ బ్యాటర్లు పరుగులు సాధించేందుకు తంటాలు పడ్డారు. దీనికి తోడు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోవడంతో రిస్క్ తీసుకోలేక ఒత్తిడిలో పడింది. మధ్య ఓవర్లలో రాహుల్ క్రీజులో నిలిచినా భారీ షాట్లు ఆడలేకపోయాడు. అయితే చివరి మూడు ఓవర్లలో స్టబ్స్ వీరవిహారంతో ఢిల్లీ గౌరవప్రదమైన స్కోరందుకుంది. ఆరంభంలో ఓపెనర్ పోరెల్ మాత్రం ధాటిని కనబర్చాడు. తొలి బంతినే ఫోర్‌గా మల్చిన తను మూడో ఓవర్‌లో రెండు సిక్సర్లతో 17 రన్స్ రాబట్టాడు. కానీ అతడి దూకుడుకు నాలుగో ఓవర్‌లోనే బ్రేక్ పడింది. తర్వాతి ఓవర్‌లోనే కరుణ్ (4) కూడా వెనుదిరిగినా పవర్‌ప్లేలో జట్టు 52/2తో ఫర్వాలేదనిపించింది. అనంతరం డీసీ ఇన్నింగ్స్ నత్తనడకన సాగింది. స్పిన్నర్లు సుయాష్, క్రునాల్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో బౌండరీలు రావడం గగనంగా మారింది. రాహుల్, డుప్లెసి మధ్య మూడో వికెట్‌కు 28 రన్స్ జత చేరాయి. అక్షర్ (15) ఉన్నంతసేపు వేగం కనబర్చాడు. 17వ ఓవర్‌లో రాహుల్, అశుతోష్ (2)ల వికెట్లను తీసి భువీ గట్టి దెబ్బ తీశాడు. అప్పటికి స్కోరు 120/6. ఈ దశలో 150 కూడా అతికష్టంగా మారింది. కానీ 18వ ఓవర్‌లో విప్రజ్ (12) సిక్సర్, స్టబ్స్ ఫోర్‌తో 17 రన్స్ సమకూరగా, 19వ ఓవర్‌లో స్టబ్స్ మరింత చెలరేగి 4,6,4తో 19 రన్స్ రాబట్టాడు. కానీ చివరి ఓవర్‌లో భువీ ఆరు పరుగులే ఇచ్చి స్టబ్స్ వికెట్ తీయగా.. విప్రజ్ రనౌటయ్యాడు.

**పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.రరే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 10 | 7 | 3 | 0 | 14 | 0.521 |
| గుజరాత్ | 8 | 6 | 2 | 0 | 12 | 1.104 |
| ముంబై | 10 | 6 | 4 | 0 | 12 | 0.889 |
| ఢిల్లీ | 9 | 6 | 3 | 0 | 12 | 0.482 |
| పంజాబ్ | 9 | 5 | 3 | 1 | 11 | 0.177 |
| లఖ్‌నవూ | 10 | 5 | 5 | 0 | 10 | -0.325 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 1 | 7 | 0.212 |
| హైదరాబాద్ | 9 | 3 | 6 | 0 | 6 | -1.103 |
| రాజస్థాన్ | 9 | 2 | 7 | 0 | 4 | -0.625 |
| చెన్నై | 9 | 2 | 7 | 0 | 4 | -1.302 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

**స్కోరుబోర్డు**

**ఢిల్లీ:** అభిషేక్ (సి) సుయాష్ (బి) హాజెల్‌వుడ్ 28, డుప్లెసీ (సి) కోహ్లీ (బి) క్రునాల్ 22, కరుణ్ నాయర్ (సి) భువనేశ్వర్ (బి) యశ్ దయాల్ 4, కేఎల్ రాహుల్ (సి) బెథెల్ (బి) భువనేశ్వర్ 41, అక్షర్ (బి) హాజెల్‌వుడ్ 15, స్టబ్స్ (సి) హాజెల్‌వుడ్ (బి) భువనేశ్వర్ 34, అశుతోష్ (బి) భువనేశ్వర్ 2, విప్రజ్ (రనౌట్) 12, స్టార్క్ (నాటౌట్) 0, చమీర (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 162/8; వికెట్ల పతనం:** 1-33, 2-44, 3-72, 4-102, 5-118, 6-120, 7-158, 8-162; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-33-3, యశ్ దయాల్ 4-0-42-1, హాజెల్‌వుడ్ 4-0-36-2, సుయాష్ 4-0-22-0, క్రునాల్ పాండ్యా 4-0-28-1.

**బెంగళూరు:** బెథెల్ (సి) కరుణ్ (బి) అక్షర్ 12, కోహ్లీ (సి) స్టార్క్ (బి) చమీర 51, పడిక్కళ్ (బి) అక్షర్ 0, పటీదార్ (రనౌట్) 6, క్రునాల్ పాండ్యా (నాటౌట్) 73, టిమ్ డేవిడ్ (నాటౌట్) 19, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 18.3 ఓవర్లలో 165/4; వికెట్ల పతనం:** 1-20, 2-20, 3-26, 4-145; **బౌలింగ్:** అక్షర్ 4-0-19-2, స్టార్క్ 3-0-31-0, ముకేశ్ 3.3-0-51-0, విప్రజ్ 1-0-12-0, కుల్దీప్ 4-0-28-0, చమీర 3-0-24-1.

## మనోళ్లు చిత్తయ్యారు

**డెన్మార్క్ 4-1తో భారత్‌పై గెలుపు**
**సుదీర్మన్ కప్ బ్యాడ్మింటన్**

**గ్జియామెన్ (చైనా):** సుదీర్మన్ కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం జరిగిన తమ ఆరంభ మ్యాచ్‌లో భారత్ 1-4తో డెన్మార్క్ చేతిలో చిత్తయింది. సింగిల్స్ టాప్ స్టార్లు సింధు, ప్రణయ్ కూడా ఓడడం జట్టుపై తీవ్ర ప్రభావం చూపింది. మహిళల డబుల్స్‌లో తనీసా క్రాస్టో/శ్రుతి మిశ్రా జోడీ మాత్రం ప్రత్యర్థిపై నెగ్గి కాస్త పరువైనా నిలబెట్టింది. మరోవైపు తమ టాప్ షట్లర్లు అక్సెల్సెన్, మియా బ్లిచ్‌ఫీల్డ్ లేకుండానే పోటీపడ్డ డెన్మార్క్ పూర్తిస్థాయిలో సత్తాచాటింది. మొదట మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ద్వయం తనీషా/ధ్రువ్ కపిల 13-21, 14-21తో ప్రపంచ ఏడో ర్యాంక్ జోడీ జెస్పర్ టాఫ్/అమేలీ మెగ్‌లాండ్ చేతిలో, పురుషుల సింగిల్స్‌లో వెటరన్ ప్రణయ్ 15-21, 16-21తో ఆంటోన్సెన్ చేతిలో, ఆ తర్వాత పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ జంట 7-21, 4-21తో ప్రపంచ నెం.1 జోడీ కిమ్ ఆస్ట్రప్/ఆండెర్స్ స్కారప్ చేతిలో ఓడడంతోనే డెన్మార్క్ 3-0 ఆధిక్యంతో భారత్‌పై పైచేయి సాధించింది. ఇక నామమాత్రమైన మహిళల సింగిల్స్‌లో లినె హాజ్‌మార్క్ 22-20, 23-21తో సింధుకు షాకివ్వడంతో డెన్మార్క్ 4-0తో పూర్తి ఆధిపత్యం చాటుకుంది. ఆఖరిదైన మహిళల డబుల్స్‌లో భారత జంట తనీషా/శ్రుతి 21-13, 21-18తో నటాషా/బోజెను ఓడించింది. భారత్ తర్వాతి పోరును ఇండోనేసియాతో మంగళవారం ఆడనుంది.

## ఫైనల్స్‌లో 14 మంది బాక్సర్లు

**అమ్మాన్ (జోర్డాన్):** ఆసియా అండర్-15, అండర్-17 బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో 14 మంది భారత బాక్సర్లు ఫైనల్‌కు చేరుకొన్నారు. అండర్-15 సెమీస్‌లో కోమల్ (30-33 కిలోలు), నవ్య (58 కి), సునయన (61 కి), కుషీ అహ్లావత్ (35 కి), తమన్నా (37 కి), ప్రిన్సి (52 కి), తృష్ణ (67 కి), మిల్కీ (43 కి) విజయాలు సాధించారు. కాగా, స్వీ (40 కి), వన్షిక (70+ కి)కు బై లభించింది. బాలురలో వినోద్ (35 కి), రుద్రాక్ష్ (46 కి), అభిజిత్ (61 కి), లక్ష్య ఫొగట్ (64 కి) స్వర్ణ పోరుకు చేరుకొన్నారు.

## పాక్ టోర్నీలో ఆడేది లేదు

**భారత వాలీబాల్ జట్టు**

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌లో జరిగే మధ్య ఆసియా వాలీబాల్ చాంపియన్‌షిప్ నుంచి భారత జట్టు వైదొలిగింది. ఇటీవల పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకుంది. మే 28 నుంచి జూన్ 4 వరకు ఇస్లామాబాద్‌లో జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యంపై గతంలోనే భారత్ అంగీకారం తెలిపింది. అయితే తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర క్రీడాశాఖ ఆదేశాల మేరకు అక్కడికి వెళ్లకూడదని భారత వాలీబాల్ సమాఖ్య నిర్ణయించుకుంది.

## 83 స్వర్ణాలతో సత్తాచాటిన భారత్

**ఆసియా యోగాసన చాంపియన్‌షిప్**

**న్యూఢిల్లీ:** ఆసియా యోగాసన చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య భారత జట్టు అదరగొట్టింది. ఏకంగా 83 స్వర్ణాలు కొల్లగొట్టి అగ్రస్థానంలో నిలిచింది. ఆదివారంతో ముగిసిన ఈ మెగా టోర్నీలో అత్యధిక స్వర్ణాలకు తోడు 3 రజతాలు, ఓ కాంస్యంతో కలిపి 87 పతకాలను భారత్ ఖాతాలో వేసుకుంది. మూడేసి స్వర్ణ, రజత, నాలుగు కాంస్యాలతో జపాన్ రెండోస్థానం దక్కించుకుంది.

# అధిక వడ్డీ ఆశ చూపి ఘరానా మోసం!

- రూ.వందల కోట్ల డిపాజిట్లు సేకరించి టోకరా
- దేశవ్యాప్తంగా రూ.270 కోట్లకు పైగా డిపాజిట్లు!
- కర్నూలు జిల్లాలో రూ.70 కోట్ల వరకు సేకరణ


కర్నూలులో బోర్డు లేని శ్రేయ ఇన్‌ఫ్రా కంపెనీ కార్యాలయం

కర్నూలు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశ చూపి ఓ సంస్థ ఘరానా మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా రూ.270 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరిస్తే.. కర్నూలు జిల్లా నుంచే రూ.60-70 కోట్లకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో కంపెనీ అకౌంట్ బ్లాక్ చేశారంటూ ఆ సంస్థ చేతులెత్తేసింది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. డిపాజిట్లు సేకరించి మోసం చేశారంటూ శ్రేయ ఇన్‌ఫ్రా మార్కెటింగ్ ప్రైవేట్‌లిమిటెడ్ కంపెనీపై ఓ వ్యక్తి ఫిర్యాదుతో కర్నూలు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**వివరాలివీ..:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నో కేంద్రంగా 2020లో స్థాపించిన ఈ కంపెనీకి చైర్మన్ హేమంత్‌కుమార్ రాయ్. రియల్ ఎస్టేట్ (స్థిరాస్తి) వ్యాపారం పేరిట.. తమ వద్ద పెట్టుబడులు పెడితే ఏడాది తిరక్కుండానే రెట్టింపు ఇస్తామని మభ్యపెట్టారు. ఈ సంస్థ దేశంలోని పలు ప్రాంతాల్లో అధిక వడ్డీలు ఆశ చూపి ప్రజల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నట్లు సమాచారం. 2023 నుంచి కర్నూలు నగరంలో ఓ భవనం అద్దెకు తీసుకొని ఏజెంట్ల ద్వారా డిపాజిట్ల సేకరణ చేపట్టారు. జనాన్ని నమ్మించడానికి కొంత భూమి కొనుగోలు చేసినట్లు సమాచారం. మొదట్లో డిపాజిట్‌దారులకు నెలనెలా ఖాతాలో నగదు జమ చేస్తుండడంతో నమ్మకం ఏర్పడింది. 2024 జూన్ నుంచి చెల్లింపులు ఆపేశారు.

### రూ.లక్షకు రూ.1.80 లక్షలు చెల్లిస్తామని..

కర్నూలు నగరంతో పాటు వామసముద్రం, తడకనపల్లెతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 500-600 మంది నుంచి డిపాజిట్లు సేకరించారని సమాచారం. రూ.లక్ష డిపాజిట్ చేస్తే.. నెలకు రూ.12 వేల చొప్పున 15 నెలలకు రూ.1.80 లక్షలు గానీ, రూ.11 వేల ప్రకారం 18 నెలలు రూ.1.98 లక్షలు చెల్లిస్తామని ఆశ చూపారు. అంటే.. నెలకు నూటికి వడ్డీ రూ.5.25లు పైమాటే. మొదట్లో నెలనెలా డబ్బులు జమ చేస్తుండడంతో.. డిపాజిట్లు రూ.60-70 కోట్లకు చేరాయని, ఆ తర్వాత చెత్తులేసిందని చెబుతున్నారు. గత జూన్ నుంచి చెల్లింపులు ఆపేసినట్లు తెలుస్తోంది. ఖాతాదారులు ప్రశ్నిస్తే.. ఎన్నికల సమయంలో కంపెనీ అకౌంట్ బ్లాక్ చేయడం వల్లే చెల్లింపులు చేయలేకపోయామని, త్వరలోనే చెల్లింపుల ప్రక్రియ ప్రారంభమవుతుందంటూ కొన్ని నెలలు కాలం గడిపేశారు. ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరగడంతో వడ్డీ లేకుండా మీ డబ్బులు తిరిగి వచ్చే ఏర్పాట్లు చేస్తామని చెబుతున్నారని, అదీ లేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల్లో సంస్థ ఏజెంట్లు, డిపాజిట్‌దారులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కొందరు పోలీసులు కూడా ఉన్నట్లు సమాచారం.

### శ్రేయ ఇన్‌ఫ్రాపై కేసు.. సీఐడీకి బదిలీ..

కర్నూలుకు చెందిన వెంకటసుబ్బారెడ్డి గత ఏడాది నవంబరు 22న సంస్థ చైర్మన్‌తో పాటు పలువురిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును సీఐడీకి బదిలీ చేశామని త్రీటౌన్ సీఐ శేషయ్య తెలిపారు. ఏడాదిగా చెల్లింపులు ఆగిన మాట నిజమేనని, డిపాజిట్ మాత్రమే చెల్లించేలా ఖాతాదారుల నుంచి ఎన్‌వోసీలు తీసుకొని హెడ్ ఆఫీసుకు పంపిస్తున్నామని, వచ్చే నెల మొదటి వారంలో చెల్లింపులు మొదలయ్యే అవకాశముందని కంపెనీ సీనియర్ లీడర్ మహేశ్ తెలిపారు.

# అతివకు కోరినంత రుణం!

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యాలు నిర్దేశించుకుని ఆ మేరకు రుణ ప్రణాళిక తయారు చేసేవారు. తాజాగా సెర్ప్ సీఈవోగా కరుణ వాకాటి బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రంలోని దాదాపు 89 లక్షల మంది డ్వాక్రా మహిళల క్షేత్రస్థాయి అవసరాలను రుణ ప్రణాళిక ప్రతిబింబించాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా సంఘాల నుంచి 1.25 లక్షల మంది విద్యావంతులైన సభ్యులను ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసి రుణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగా వారికి ఆర్థిక వ్యవహారాలు, డిజిటల్ లిటరసీపై ప్రత్యేక శిక్షణ అందించారు. గత రెండు వారాలుగా ఒక్కో ఎన్యుమరేటర్ నాలుగైదు గ్రూపులను సంప్రదించారు. వాటిలోని సభ్యుల వృత్తి పరమైన సమాచారం, వారి కుటుంబ సభ్యుల ఆదాయ వ్యయాలు, తదితర వివరాలను యాప్ ద్వారా సేకరించారు. అలాగే వారు పొందిన రుణాలు, ఇంకా చెల్లించాల్సిన అప్పు ఎంత, వారి కుటుంబాల్లో ఆర్థిక అవసరాలు, జీవనోపాధి పెంపునకు స్వయం ఉపాధి యూనిట్లకు ఎంత రుణం అవసరం వంటి వివరాలు కూడా సేకరించి వార్షిక, ఆర్థిక జీవనోపాధుల కార్యాచరణ ప్రణాళిక 2025-26 యాప్‌లో పొందుపరిచారు. వీటిని ప్రామాణికంగా తీసుకొని రుణ ప్రణాళికను తయారు చేస్తున్నారు. సరైన వనోపాధులపై పెట్టుబడులు పెట్టడం ద్వారా మహిళల ఆదాయం పెరిగే అవకాశం ఉంది. బ్యాంకు రుణాల ద్వారా సభ్యుల జీవన ప్రమాణాలు పెరగడంతో పాటు వారి పిల్లలకు మంచి విద్య, వైద్యం తదితర సౌకర్యాలు అందుతాయి. దీంతో ఈ బృందాల సభ్యులకు రుణ నిర్వహణ, సకాలంలో చెల్లింపులు, రుణ ప్రణాళికపై సంపూర్ణ అవగాహన కలుగుతుంది. వ్యవసాయం, పరిశ్రమలు, పశుసంవర్ధక, చేనేత శాఖలతో అనుసంధానం చేసుకోవడం ద్వారా సుస్థిర జీవనోపాధి సాధించగలుగుతారు. అలాగే స్వయం సహాయక బృందాలు, ఆర్థిక సంస్థల మధ్య విశ్వాసం పెరిగి రుణాలు విరివిగా పొందే అవకాశం ఉంటుంది.

**రంగాల వారీగా...:** రాష్ట్రంలోని మొత్తం 88,48,109 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.61,964 కోట్ల రుణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. వ్యవసాయానికి సంబంధించి 12,28,781 మంది సభ్యులకు రూ.11,319 కోట్లు, ఫిషరీస్‌లో 39,635 మందికి రూ.415 కోట్లు, ఉద్యాన పంటల విభాగంలో 23,891 మందికి రూ.231 కోట్లు, పశుసంపదకు సంబంధించి 4,09,312 మందికి రూ.4,140 కోట్లు, తయారీ రంగంలో 39,177 మందికి రూ.438 కోట్లు, సెరికల్చర్‌లో 2,867 మందికి రూ.35కోట్లు, సేవారంగానికి సంబంధించి 2,52,621 మందికి రూ.2,638 కోట్లు, వాణిజ్య రంగంలో 2,44,772 మందికి రూ.2,797 కోట్లు, కుటుంబ నిత్యావసరాల కోసం 16,09,217 మందికి రూ.6,914 కోట్లు, వివాహం/విద్యకు 13,68,314 మందికి రూ.8,951 కోట్లు, ఆస్తుల కొనుగోలు కోసం 9,39,206 మందికి రూ.6,950 కోట్లు, ఇళ్ల నిర్మాణానికి 10,68,217 మందికి రూ.9,952 కోట్లు, ఇతర రంగాలకు సంబంధించి 16,22,099 మందికి రూ.7,178 కోట్లతో రుణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు ఏ నెలలో, ఎంతమంది సభ్యులకు, ఎంత మొత్తం రుణంగా అందించాలన్న దానిపైనా కసరత్తు చేస్తున్నారు. బ్యాంకు లింకేజీ, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం, సీఐఎఫ్, స్త్రీనిధి తదితర రుణాలపై సెర్ప్ సిబ్బందికి నెలవారీ లక్ష్యాలను నిర్దేశిస్తారు. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలకు వేర్వేరుగా ప్రణాళికలు రూపొందించే అవకాశం ఉంది.

### వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ప్రోత్సాహం

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, సేంద్రియ వ్యవసాయం, మినీ రైస్ విల్లులు, తృణధాన్యాల ఆధారిత పరిశ్రమలు, తృణధాన్యాల సాగును ప్రోత్సహిస్తారు. వీటిని ముఖ్యంగా చిత్తూరు, కర్నూలు, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, ఏఎస్ఆర్, తిరుపతి, కడప, ప్రకాశం, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో అమలు చేస్తారు. వీటిని ఎంచుకున్న సంఘాల సభ్యులకు వైజాగ్, కడపలో శిక్షణ అందించనున్నారు. అదేవిధంగా శ్రీకాకుళం, ఏఎస్ఆర్, మన్యం, విజయనగరం, అనకాపల్లి, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం జిల్లాలో వెదురు సాగును ప్రోత్సహిస్తారు. దీన్ని వెయ్యి మంది మహిళలు ఎంచుకున్నారు. ప్రకాశం, సత్యసాయి, పల్నాడు, శ్రీకాకుళం జిల్లాల్లో షేడ్ నెట్ వ్యవసాయం చేపట్టనున్నారు. తేనె ఆధారిత వ్యాపారాలను విజయనగరం, శ్రీకాకుళం, ఏఎస్ఆర్, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో వెయ్యి మంది చేపడతారు. చేపల కుంటలు, రొయ్యల పెంపకం, చేనేత, టూరిజం తదితర రంగాల్లో కూడా సభ్యులకు శిక్షణ అందిస్తారు. ఏయే జిల్లాలో, ఏ పరిశ్రమలు, ఎంతమంది సభ్యులు ఎంచుకున్నారో ఎన్యుమరేటర్ల ద్వారా ఇప్పటికే వివరాలు సేకరించారు.



మేధావుల సదస్సును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పాల్గొన్న మంత్రి సత్యకుమార్ తదితరులు

## దక్షిణంలోనూ అధికారంలోకి వస్తాం

- అభివృద్ధే ధ్యేయంగా మోదీ పాలన
- అంబేడ్కర్ ఆశయాలే స్ఫూర్తి: కిషన్ రెడ్డి

విజయవాడ(విద్యాధరపురం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారని, దక్షిణ భారతదేశంలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం విజయవాడలోని ఎస్-కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ జయంతిని ఏప్రిల్ 14నే కాకుండా పదిరోజుల పాటు దేశవ్యాప్తంగా నిర్వహించాలని బీజేపీ నిర్ణయించిందన్నారు. దేశభక్తి కలిగిన వ్యక్తి అంబేడ్కర్ అని, కమ్యూనిస్టు సిద్ధాంతాలను కాదన్నందుకు ఆయనను ఓడించాలని, అవమానపరచాలని అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. అంబేడ్కర్ ఎంపీగా పోటీచేస్తే ఓడించాలని నెహ్రూ విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. రాజ్యాంగాన్ని అవమానపరిచేలా కాంగ్రెస్ వ్యవహరించిందని, అధికారాన్ని నిలుపుకోవటం కోసం రాజ్యాంగాన్ని తనకు అనుకూలంగా మార్చుకుందని విమర్శించారు. అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితోనే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అంబేడ్కర్ అంతిమ సంస్కారం జరిగిన పంచతీర్థ స్థలాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామని, పార్లమెంటులో అంబేడ్కర్ చిత్రపటాన్ని పెట్టి గౌరవించిన ఘనత మోదీకే దక్కుతుందని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకే అంబేడ్కర్‌కు భారతరత్న ఇచ్చిందన్నారు. ఆయుష్మాన్ భారత్ పేరుతో మోదీ పేద ప్రజలకు రక్షణ కల్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి ఆర్‌డీ విల్సన్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసే దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

### షార్‌కు చేరిన జీఎస్ఎల్వీ-ఎఫ్16 రెండో దశ పరికరం




ప్రత్యేక వాహనంలో షార్‌కు తీసుకొచ్చిన జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ రెండో దశ పరికరం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) త్వరలో చేపట్టనున్న జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగానికి ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఈ రాకెట్‌కు సంబంధించిన రెండో దశ (జీఎస్2) పరికరం ఆదివారం శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌కు చేరింది. తమిళనాడు రాష్ట్రం మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ) నుంచి దీన్ని రెండు ప్రత్యేక వాహనంలో భారీ భద్రత నడుమ రోడ్డు మార్గాన తీసుకొచ్చారు. ఇప్పటికే షార్‌లోని రెండో ప్రయోగ వేదిక వద్దనున్న వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్ (వ్యాబ్)లో జీఎస్ఎల్వీ-ఎఫ్16 మొదటి దశ అనుసంధాన పనులు ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించి పూర్తి చేశారు. సోమవారం నుంచి రాకెట్ రెండో దశ అనుసంధాన పనులు ప్రారంభించనున్నారు. ఈ రాకెట్ ద్వారా ఇస్రో-నాసాకు చెందిన నిసార్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు.

# అమరావతి రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమరావతిని దెబ్బతీయాలని అనేక కుట్రలు, దాడులు చేసిందని.. అయితే అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజల అభిలాష మేరకు ప్రారంభమైన అమరావతి అనేక సవాళ్లను, కష్టాలను ఎదుర్కొని నిలబడిందని అన్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పనులు మళ్లీ ప్రారంభమవుతున్నాయని, ఆ రోజు రాష్ట్ర చరిత్రలో గొప్ప మలుపు కానుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన 10 నెలల్లో గత ప్రభుత్వం కారణంగా తలెత్తిన అన్ని సవాళ్లను పరిష్కరించి, నిలిచిపోయిన రాజధాని పనులను మళ్లీ పట్టాలెక్కిస్తున్నామని తెలిపారు. అమరావతి అనేది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవం, ఆకాంక్ష, సెంటిమెంట్ అని.. దీన్ని ఎవరూ దెబ్బతీయలేరని సీఎం అన్నారు. అమరావతి సంపద సృష్టి కేంద్రంగా.. అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాంతంగా మారుతుందన్నారు. కుట్రలకు, కుతంత్రాలకు ప్రజారాజధాని బలికాబోదని, ఆంధ్రుల రాజధాని స్వప్నాన్ని ఎవరూ చెరిపివేయలేరని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయాన్ని దేశమంతా గుర్తించేలా రాజధాని పనులను స్వయంగా ప్రధాని చేతుల మీదుగా పునః ప్రారంభిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా.. వేడుకగా నిర్వహించాలని, రాష్ట్రంలో ప్రతి పౌరుడు 'నాది ఆంధ్రప్రదేశ్.. నా రాజధాని అమరావతి' అని చెప్పుకొనేలా అమరావతి నిర్మాణం జరుగుతుందని అన్నారు. ప్రధాని కూడా రాజధాని నిర్మాణంపై ఆసక్తితో ఉన్నారని, మొన్న జరిగిన ఢిల్లీ భేటీలో పలు సూచనలు చేశారని సీఎం పేర్కొన్నారు.



### ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

ప్రధాని సభ ఏర్పాట్లపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చూడాలని, ఎండల తీవ్రత దృష్ట్యా దూర ప్రాంతాల నుంచి సభకు వచ్చే వారికి తాగునీరు, ఆహారం అందించాలని సీఎం సూచించారు. భద్రతాపరంగా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా రాజధాని గ్రామాల ప్రజలకు ఈ కార్యక్రమంలో ఎక్కువ భాగస్వామ్యం ఉంటుందని, వారంతా సభకు రావాలని భావిస్తారని, వారికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సమీక్షలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, నారాయణ, నాదెండ్ల మనోహర్, సీఆర్‌డీయే కమిషనర్ కన్నబాబు, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### 15 నిమిషాలు రోడ్డు షో.. గంట పాటు సభ

ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పర్యటన షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 3.30 గంటలకు అమరావతిలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రధాన వేదిక వరకు 1.2 కి.మీ. రోడ్డు షోలో పాల్గొంటారు. ఈ రోడ్డు షో 15 నిమిషాలపాటు సాగుతుంది. ఆ తర్వాత అమరావతి విశేషాలతో ఏర్పాటు చేసిన పెవిలియన్‌ను సందర్శిస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బహిరంగ సభ జరగనుంది. ఈ పర్యటనలో ప్రధాని సుమారు రూ.లక్ష కోట్ల విలువైన రాజధాని పనులకు శంకుస్థాపన చేస్తారు. 5.10 గంటలకు బయలుదేరి గన్నవరం చేరుకుని అక్కడి నుంచి ఢిల్లీ వెళ్తారు. కాగా, బహిరంగ సభ వద్ద మూడు వేదికలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక వేదికపై ప్రధానితోసహా సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు మొత్తం 20 మంది ఆసీనులవుతారు. మరో వేదికపై 100 మంది ప్రజాప్రతినిధులు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు రాజధానికి భూములు ఇచ్చిన 30 మంది రైతులు కూర్చోనున్నారు.

# మోదీ సభకు చకచకా ఏర్పాట్లు

*మండుటెండలో శ్రమిస్తున్న వందలాది మంది*

- ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు
- వీవీఐపీ, వీఐపీలకు ప్రత్యేక గ్యాలరీలు
- లక్ష మంది కూర్చునేందుకు వీలుగా ప్రాంగణం

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభ కార్యక్రమానికి మే 2న ప్రధాని నరేంద్ర మోదీ రానుండడంతో వెలగపూడిలో ఏర్పాట్లు వేగం పుంజుకున్నాయి. అధికారులు, సిబ్బంది, కార్మికులు ఏర్పాటు పనుల్లో నిమగ్నమయ్యారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు కూడా పనుల్లో నిమగ్నమయ్యారు. పహల్గాం ఉగ్రదాడి దృష్ట్యా బందోబస్తు విషయంలో పకడ్బందీ చర్యలు చేపట్టారు. ప్రధాని హెలిప్యాడ్ వద్ద నుంచి సభా ప్రాంగణానికి చేరుకొనే మార్గమంతా పటిష్ఠ రక్షణ చర్యలు చేపట్టారు. గన్నవరం నుంచి అమరావతిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నాక ప్రధాని మోదీ 1.2 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించనున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రధాని బుల్లెట్ ప్రూఫ్ వాహనంలోనే ఉండి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతారని తెలిసింది. 15 వేల మంది మహిళలు రోడ్డుకు రెండు వైపులా నిలబడి మోదీకి స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### పైలాన్ తరహాలో పునాది రాయి

ఒకేసారి రూ.లక్ష కోట్ల విలువ చేసే పనులకు శంకుస్థాపన చేయనున్న దృష్ట్యా సభా ప్రాంగణం వెనకనే భారీ పైలాన్‌ని సీఆర్‌డీఏ సిద్ధం చేయిస్తోంది. ఈ పైలాన్ శాశ్వత కట్టడంగా అమరావతి రాజధాని చరిత్రలో నిలిచిపోతుంది. ఈ పైలాన్‌ని ఆవిష్కరించిన తర్వాత మోదీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. దాదాపుగా 50 మీటర్ల వృత్తాకారంలో పైలాన్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రధాని మోదీ పర్యటన దృష్ట్యా ఆకే రవికృష్ణ, మల్లికా గార్గ్, సర్వశ్రేష్ఠ్ త్రిపాఠి, గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్ వంటి సీనియర్ ఐపీఎస్ అధికారులంతా వెలగపూడిలోనే మకాం వేసి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాల నుంచి వచ్చే బస్సులు, వాటికి పార్కింగ్ ఏర్పాటు, ప్రజలు కూర్చునే గ్యాలరీ ఏర్పాట్లపై చర్చిస్తున్నారు. గూగుల్ శాటిలైట్ ఇమేజ్‌లు తెప్పించుకొని ప్రణాళిక రూపొందిస్తున్నారు. భద్రత దృష్ట్యా ఆదివారం నుంచే హెలిప్యాడ్, బహిరంగ సభ వేదిక వద్దకు పోలీసు, రెవెన్యూ అధికారులను మినహా ఎవరినీ అనుమతించడం లేదు. బహిరంగ సభకు గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి ప్రజలు రానున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా వాళ్లు ఎక్కడా ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎక్కడికక్కడ పెండల్స్ ఏర్పాటు చేస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాల వద్ద తాగునీరు, మజ్జిగ, భోజనం అందుబాటులో ఉంచుతారు. అలానే తాత్కాలిక మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేస్తున్నారు.



వాహనాల పార్కింగ్ స్థలం



వీవీఐపీల కోసం ఏర్పాటు చేసిన సోఫాలు

### సీనియర్ ఐఏఎస్‌లకు బాధ్యతలు

ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్ నేతృత్వంలో పలువురు సెక్రెటరీలు, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు పని విభజన చేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి ఓవరాల్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు కేటాయించారు. రోడ్డు షో బాధ్యతను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పారిశుద్ధ్యం పర్యవేక్షణను నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు కేటాయించారు. వీవీఐపీలు, వీఐపీలను రిసీవ్ చేసుకొని వారికి సభా ప్రాంగణానికి తోడ్కొని వెళ్లే పనిని ఐఏఎస్, రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

### పీఎస్ఆర్, వంశీలను ఒకే జైలుగదిలో పెట్టాలి: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వేర్వేరు నేరాల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఇంటెలిజెన్స్ మాజీ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీలను ఒకే జైలు గదిలో పెట్టాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు జైలు సూపరింటెండెంట్‌ను ఉద్దేశిస్తూ ఆదివారం ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. వల్లభనేని వంశీ తనకు జైల్లో ఎవరైనా తోడు కావాలంటున్నాడని, పీఎస్ఆర్ ఆంజనేయులు ఎక్కడ ఉన్నా తన పక్కన ఎవరో ఉండాలని కోరుకుంటారని తెలిపారు. కనుక వీరిద్దరినీ జైల్లోని ఒకే గదిలో పెట్టాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని బుద్దా వెంకన్న చమత్కరించారు.

### అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి: సీపీఐ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో పారదర్శకత లోపించిందని, చంద్రబాబు కూడా జగన్ బాటలోనే పాలన సాగిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అప్పులపై కూటమి ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక, ప్రధాని మోదీకి ప్రజల ప్రాణాలకన్నా ఎన్నికలే ముఖ్యమయ్యాయని మండిపడ్డారు. కశ్మీర్‌లోని పహల్గాంలో 28 మందిని ఉగ్రవాదులు పొట్టనపెట్టుకోవడం ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన విషయమన్నారు.

# బిజినెస్

### ఎఫ్‌పీఐ పెట్టుబడి రూ.17,425 కోట్లు

న్యూఢిల్లీ: విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు గత వారంలో రూ.17,425 కోట్లు భారత ఈక్విటీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేశారు. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో పాటు స్థూల ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉండడం ఇందుకు దోహదపడింది. అంతకు ముందు వారంలో కూడా వారు రూ.8,500 కోట్లు భారత ఈక్విటీల్లో పెట్టుబడిగా పెట్టారు. డిపాజిటరీల వద్ద అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ఎఫ్‌పీఐలు ఏప్రిల్ నెలలో ఇప్పటివరకు రూ.5,678 కోట్లు ఉపసంహరించారు. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు వారు తరలించుకుపోయిన నిధుల విలువ రూ.1.22 లక్షల కోట్లకు చేరింది. ప్రపంచంలో వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడం ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను బలపరిచిందని పరిశీలకులంటున్నారు.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| 28వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 415 | విజయవాడ | 430 |
| వరంగల్ | 417 | గోదావరి | 415 |
| చిత్తూరు | 480 | విశాఖపట్నం | 430 |
| | | డజను గుడ్లు రూ. 60 | |

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 125 | విజయవాడ | 127 |
| వరంగల్ | 125 | గుంటూరు | 125 |
| కరీంనగర్ | 125 | ఒంగోలు | 125 |
| మహబూబ్‌నగర్ | 125 | చిత్తూరు | 92 |
| కర్నూలు | 125 | నెల్లూరు | 97 |
| విశాఖపట్నం | 116 | అనంతపురం | 97 |
| గోదావరి | 127 | | |

# పీఎస్‌యూ షేర్లు కురిపించెన్ సిరులు

## ఐపీఓ మదుపరులకు భారీ లాభాలు
## మజ్‌గాన్ డాక్ ఐపీఓలో బంపర్ రాబడులు



న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూకి (ఐపీఓ) వచ్చిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు చరిత్ర తిరగ రాస్తున్నాయి. ఈ కంపెనీల ఐపీఓలు, ప్రైవేటు కంపెనీల ఐపీఓలను మించి మదుపరులకు లాభాలు పంచాయి. 2017 మే నుంచి ఇప్పటి వరకు ఐపీఓకి వచ్చిన 18 సీపీఎస్‌యూల్లో మూడు బీమా కంపెనీల ఐపీఓలు తప్ప, మిగతా 15 సీపీఎస్‌యూల ఐపీఓలు మదుపరులకు బంపర్ లాభాలు పంచాయి. 2020 అక్టోబరులో ఐపీఓకు వచ్చిన మజ్‌గాన్ డాక్ షిప్‌బిల్డర్స్ ఐపీఓలో ఇన్వెస్ట్ చేసిన వారైతే ఇప్పటి వరకు 37 రెట్ల లాభాలు కళ్ల జూశారు. రైల్ వికాస్ నిగం లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్), గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (జీఆర్ఎస్ఈఎల్), ఐఆర్‌సీటీసీ ఐపీఓలూ మదుపరులకు వెయ్యి శాతానికి పైగా లాభాలు పంచాయి.

**అగ్రస్థానంలో మజగాన్ డాక్:** రూ.145 ధరతో జారీ అయిన మజ్‌గాన్ డాక్ షిప్‌బిల్డర్స్ షేర్లు ఈ నెల 25న బీఎస్ఈలో రూ.2,640.75 వద్ద ముగిశాయి. రూ.10 ముఖ విలువతో జారీ చేసిన ఈ షేర్లను కంపెనీ గత ఏడాది డిసెంబరులో రూ.5 ముఖ విలువ ఉండే రెండు షేర్లుగా విభజించింది. ఐపీఓ సమయంలో ఉన్న రూ.10 ముఖ విలువనే పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం మజగాన్ డాక్ షేర్ల ధర రూ.5,281.5. అంటే ఇష్యూ ధరతో పోలిస్తే ప్రస్తుతం ఈ షేర్లు ఒక్కోటి రూ.5,136.5 లాభంతో ట్రేడవుతున్నాయి.

**ఐపీఓ మార్కెట్‌లో సీపీఎస్‌యూల లాభాలు**

| కంపెనీ పేరు | ఇష్యూ ధర | ప్రస్తుత ధర |
|---|---|---|
| మజ్‌గాన్ డాక్ | రూ.145 | రూ.2,640.75 |
| గార్డెన్ రీచ్ | రూ.118 | రూ.1,616.80 |
| కొచ్చిన్ షిప్‌యార్డ్ | రూ.432 | రూ.2,979.7 |
| ఆర్‌వీఎన్ఎల్ | రూ.19 | రూ.373.6 |
| ఐఆర్‌సీటీసీ | రూ.320 | రూ.3,872.75 |
| ఐఆర్ఈడీఏ | రూ.32 | రూ.178.6 |
| హడ్కో | రూ.60 | రూ.233 |
| ఎంఎస్‌టీసీ | రూ.120 | రూ.540.25 |

**ఇతర పీఎస్‌యూలు**

రూ.118 ధరతో 2017లో మార్కెట్‌కు వచ్చిన గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ కంపెనీ షేర్లు ప్రస్తుతం రూ.1,616.80 వద్ద ట్రేడవుతున్నాయి. 2017లో రూ.432 ధరతో జారీ చేసిన కొచ్చిన్ షిప్‌యార్డు షేర్లు ప్రస్తుతం 590 శాతం లాభంతో రూ.2,979.7 వద్ద ట్రేడవుతున్నాయి. రైల్వే కంపెనీల ఐపీఓలూ మదుపరులకు లాభాలు పంచడంలో ప్రభుత్వ రంగ షిప్పింగ్ కంపెనీలతో పోటీపడుతున్నాయి. 2019లో రూ.19 వద్ద లిస్టయిన ఆర్‌వీఎన్ఎల్ షేర్లు గతవారం 1866 శాతం లాభంతో రూ.373.6 వద్ద ట్రేడయ్యాయి. రూ.320తో జారీ చేసిన ఐఆర్‌సీటీసీ షేర్లూ గత వారం ఇష్యూ ధరతో పోలిస్తే 1,110 శాతం లాభంతో రూ.3,872.75 వద్ద ట్రేడయ్యాయి. రైట్స్, ఇర్కాన్, రైల్‌టెల్, ఐపీఓలూవా మదుపరులకు ఇష్యూ ధరతో పోలిస్తే 225 నుంచి 243 శాతం లాభాలు పంచాయి. హెచ్ఏఎల్, బీడీఎల్, మిధానీ కంపెనీల ఐపీఓలూ మదుపరులకు 227 నుంచి 605 శాతం వరకు లాభాలు పంచాయి.

# మా ఆర్థిక వ్యవస్థ భేష్

**పెట్టుబడులతో రండి**
**ఆర్‌బీఐ గవర్నర్**



వాషింగ్టన్: కొన్ని సమస్యలున్నా, భారత ఆర్థిక వ్యవస్థ భవిష్యత్‌కు ఢోకా లేదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భారత్‌లో పెట్టుబడులుపెట్టేందుకు ముందుకు రావాలని అమెరికా పారిశ్రామిక వర్గాలను కోరారు. సిఐఐ-భారత అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతూ అంతర్జాతీయ ఫైనాన్సియల్ మార్కెట్లలో ఆటుపోట్లు, అనిశ్చితి ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా భారత్ 6.5 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నారు. ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో మరే దేశ జీడీపీ ఈ స్థాయిలో పెరిగే అవకాశం లేదని చెప్పారు. స్థిరమైన ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని చెప్పారు. దీర్ఘకాలిక లాభాలు, అవకాశాలు కోరుకునే పారిశ్రామికవేత్తలకు భారత్ చక్కటి మార్కెట్ అని స్పష్టం చేశారు.

**భాగస్వామి కూడా:** విదేశీ పెట్టుబడులకు భారత్ గమ్య స్థానమే గాక, వారి ఐశ్వర్యంలోనూ భాగస్వామిగా ఉంటుందని మల్హోత్రా అన్నారు. ఈ భాగస్వామ్యం భారత భవిష్యత్‌నే గాక ప్రపంచ భవిష్యత్‌నూ మార్చివేస్తుందన్నారు. 2010-19 మధ్యకాలంలో భారత జీడీపీ ఏటా సగటున 6.6 శాతం చొప్పున పెరిగితే గత నాలుగేళ్లలో ఏటా సగటున 8.2 శాతం వృద్ధిరేటు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవిర్భవించబోతోందని చెప్పారు.

### ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలోకి డిక్సన్ టెక్నాలజీస్

న్యూఢిల్లీ: డిక్సన్ టెక్నాలజీస్ ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలోకి కూడా ప్రవేశిస్తోంది. అయితే తాము ప్రస్తుతం ఉత్పత్తి చేసే విడిభాగాలను తమ అవసరాలకే వినియోగిస్తామని, తదుపరి దశలో ఎగుమతులపై దృష్టి పెడతామని కంపెనీ సీఈఓ అతుల్ లాల్ తెలిపారు. తమ కంపెనీ భవిష్యత్ వృద్ధికి ఈ విడిభాగాల తయారీ మంచి అవకాశంగా నిలుస్తుందని చెప్పారు. తాము ఇప్పటికే డిస్‌ప్లే మాడ్యూల్స్‌పై ఒక ప్రాజెక్టును ప్రారంభించామని వెల్లడిస్తూ కెమెరా మాడ్యూల్స్, మెకానికల్ ఎంక్లోజర్స్, లిథియం అయాన్ బ్యాటరీలు వంటి విభిన్న రంగాల్లో గల అవకాశాలను మదింపు చేస్తున్నట్టు తెలిపారు.

# అప్రమత్తతే బెటర్

భారత-పాక్ ఉద్రిక్తతల ప్రభావం స్టాక్ మార్కెట్ పైనా కనిపిస్తోంది. ఈ కారణంగా ఈ వారం సూచీలు తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే ప్రమాదం కనిపిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మదుపరులు పరిస్థితులు కుదుటపడే వరకు అప్రమత్తతతో ఉండడమే మంచిది. గత వారం 350 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ ఇంట్రా డే కనిష్ఠ స్థాయి నుంచి 150 పాయింట్లు కోలుకుంది. ఇది బై ఆన్ డిప్స్‌ను సూచిస్తోంది. ప్రస్తుతం వైమానిక, చమురు, బ్యాంకింగ్, టెలికం, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్, మద్యం కంపెనీల షేర్లు బుల్లిష్‌గా కనిపిస్తున్నాయి.

**ఈ వారం స్టాక్ రికమండేషన్లు**

**ఎస్‌బీఐ లైఫ్:** ఈ ఏడాది ఆరంభం నుంచి అక్యూములేషన్ జోన్‌లో ఉన్న ఎస్‌బీఐ లైఫ్ షేర్లు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తున్నాయి. మూమెంటమ్, రిలెటివ్ స్ట్రెంత్ కూడా క్రమంగా పెరుగుతోంది. తాజా త్రైమాసిక ఆర్థిక ఫలితాలు పర్వాలేదనిపించాయి. గత వారం 5.4 శాతం లాభంతో ఈ షేరు రూ.1.695 వద్ద ముగిసింది. రూ.1,820 టార్గెట్‌తో మదుపరులు రూ.1,650 వద్ద ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.1,610

**గ్రాసిమ్ ఇండస్ట్రీస్:** రూ.2,300 వద్ద డబుల్ బాటమ్ ఏర్పరచుకున్న ఈ కంపెనీ షేర్లు ప్రస్తుతం కీలక రెసిస్టెన్స్ రూ.2,700 పైన ట్రేడవుతున్నాయి. రూ.2,950 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.2,700 పై స్థాయిలో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ : రూ.2,670

**ఎంఫసిస్:** గత ఏడాది డిసెంబరు నుంచి 16 శాతం దిద్దుబాటుకు లోనైన ఎంఫసిస్ కంపెనీ షేర్లు ప్రస్తుతం అక్యూములేషన్ జోన్‌లో ఉన్నాయి. షార్ట్‌టర్మ్ మూమెంటమ్, ట్రేడింగ్ వాల్యూమ్స్ క్రమంగా పెరుగుతున్నాయి. రెండు సార్లు రూ.2,200 వద్ద మద్దతు తీసుకుని బలం ప్రదర్శిస్తున్నాయి. గత వారం రూ.2,538 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.2,655 టార్గెట్‌తో రూ.2,520 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు.
స్టాప్‌లాస్ : రూ.2,490

**హెచ్‌యూఎల్:** ఈ మల్టీనేషనల్ ఎఫ్ఎంసీజీ దిగ్గజ కంపెనీ షేర్లు ప్రస్తుతం అక్యూములేషన్ జోన్‌లో కొనసాగుతున్నాయి. 2025 మార్చి ఆర్థిక ఫలితాలతో ఈ కౌంటర్‌పై మదుపరుల ఆసక్తి మరింత పెరిగింది. షార్ట్ టర్మ్ మూమెంటం పెరుగుతోంది. గత వారం ఈ కంపెనీ షేర్లు రూ.2,332 వద్ద ముగిశాయి. రూ.2550 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.2,300 వద్ద ప్రవేశించవచ్చు.
స్టాప్‌లాస్ : రూ.2,260

**పవర్‌గ్రిడ్:** కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్లో మార్చి నుంచి మూమెంటం కనిపిస్తోంది. 10-20 రోజుల మూవింగ్ యావరేజి వద్ద మద్దతు లభిస్తోంది. ప్రస్తుతం ప్రైస్ యాక్షన్ టైట్‌గా ఉంది. వాల్యూమ్స్ కాంట్రాక్షన్ కూడా జరుగుతోంది. గత వారం రూ.306 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.380 టార్గెట్‌తో రూ.290-300 మధ్య పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.270



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

# 24000 కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ ఎట్టకేలకు గత వారం కీలక స్థాయి 24000 కన్నా స్వల్పంగా ఎగువన ముగిసింది. ప్రారంభంలో పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయి 24,350 వరకు వెళ్లినా శుక్రవారం బలమైన రియాక్షన్ సాధించింది. మొత్తం మీద పాజిటివ్‌గానే ముగిసినా వారం కనిష్ఠ స్థాయిలో ముగియడం పై స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి ఎదురవుతోందనేందుకు సంకేతం. గత మూడు వారాల్లో 2,600 పాయింట్ల మేరకు లాభపడినా జీవిత కాల గరిష్ఠ స్థాయిల కన్నా 2,000 పాయింట్లు దిగువనే ఉంది. ప్రపంచ మార్కెట్ల ధోరణి ఆధారంగా ఈ వారం పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. కాని మార్కెట్లో కరెక్షన్ రావలసి ఉన్నందు వల్ల గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలి. 24,000 స్థాయిలో మరోసారి పరీక్ష ఎదుర్కొనవచ్చు.

**బుల్లిష్ స్థాయిలు:** తదుపరి నిరోధ స్థాయి 24,200. ఆ పైన 24,300. గతంలో ఇక్కడే మార్కెట్ విఫలమై కరెక్షన్‌లో పడింది. పాజిటవ్ ట్రెండ్‌ను మరింతగా కొనసాగించేందుకు ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. 24,000 వద్ద కన్సాలిడేషన్ ఉండవచ్చు.

**బేరిష్ స్థాయిలు:** 24,000 వద్ద విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. మద్దతు స్థాయి 23,800. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో మద్దతు స్థాయి 23,500.

**బ్యాంక్ నిఫ్టీ:** గత కొద్ది వారాల్లో 7,000 పాయింట్ల మేరకు అద్భుతమైన ర్యాలీ సాధించిన ఈ సూచీలో కరెక్షన్ ఏర్పడాల్సి ఉంది. గత వారం 1,000 పాయింట్ల మేరకు దిగజారి 54,660 వద్ద ముగిసింది. మరింత పాజిటివ్ ట్రెండ్ కోసం తదుపరి నిరోధం 55,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మైనర్ మద్దతు స్థాయి 54,500 కన్నా పైన నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

**పాటర్న్:** మార్కెట్ ప్రస్తుతం 200 డీఎంఏల్లో పరీక్ష ఎదుర్కోనుంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. 23,800 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. గత రెండు రోజుల్లో స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకుంటోంది.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉంది. గత వారంలో టాప్ ఏర్పడినందు వల్ల ఈ వారంలో కెరెక్షన్‌కు ఆస్కారం ఉంది.

| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 24150, 24200 |
| మద్దతు | 23960, 23900 |



గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

## అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ పెట్టాలి

- యువతను పుస్తక పఠనం వైపు మళ్లించాలి: ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

విజయవాడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల వికాసం కోసం రాష్ట్రంలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. రాజధాని అమరావతిలో కేంద్ర గ్రంథాలయం నిర్మాణానికి కృషి చేస్తానని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. విద్యార్థులను గ్రంథాలయాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని తెలిపారు. నేటితరం యువతకు నేర్చుకోవాలనే ఆసక్తి తగ్గిపోతోందని, ఈ పరిస్థితుల్లో గ్రంథాలయ పునర్వికాస కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమని, ఇదొక జ్ఞానయజ్ఞమని పేర్కొన్నారు. గ్రంథాలయాల విషయాన్ని ఇప్పటికే శాసనసభలో ప్రస్తావించగా, మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసేలా ప్రయత్నం చేస్తానని చెప్పారని మండలి తెలిపారు. విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆస్తిపన్నులో సెస్సు ద్వారా గ్రంథాలయాల అభివృద్ధికి రావాల్సిన 8శాతం నిధులను నేరుగా గ్రంథాలయ అభివృద్ధి నిధుల్లో జమయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం నుంచి గ్రంథాలయ అభివృద్ధి శాఖకు సుమారు రూ.1,100 కోట్ల బకాయిలు రావాలని అన్నారు.

## సజ్జల శ్రీధర్‌రెడ్డితో మాకు సంబంధం లేదు

- 2022లో ఆయన డైరెక్టర్ హోదా ముగిసింది: ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్

కర్నూలు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన సజ్జల శ్రీధర్‌రెడ్డితో ప్రస్తుతం తమ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని నంద్యాలకు చెందిన ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ పేర్కొంది. శ్రీధరరెడ్డి గతంలో ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ డైరెక్టర్‌గా పని చేశారని, అయితే 2022 జనవరిలో ఆయన డైరెక్టర్ హోదా ముగిసిందని ఒక ప్రకటనలో తెలిపింది. నాటి నుంచి ఆయన కంపెనీలో షేర్‌హోల్డర్ కాదని, సంతకం చేసే పాత్ర లేదని వెల్లడించింది. మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డితో శ్రీధర్‌రెడ్డికి ఉన్న అనుబంధం ఆయన వ్యక్తిగతమని పేర్కొంది.

## నేడు, రేపు భిన్న వాతావరణం

- భారీ ఉష్ణోగ్రతలు.. వర్షాలతో పిడుగులు పడే అవకాశం

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న రెండు రోజులు భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పగటి ఉష్ణోగ్రతలు 40-42 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉండగా, ఉత్తరకోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండగా, అల్లూరి జిల్లాలో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని తెలిపింది. ఆదివారం కడపలో 42.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అనకాపల్లి జిల్లా రావికమతం, కడప జిల్లా వేంపల్లెలో 41.4, విజయనగరం జిల్లా గుర్లలో 41.2, తూర్పుగోదావరి జిల్లా మురముండ, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 41 డిగ్రీలు, 55 ప్రాంతాల్లో 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# వేలమా.. లాటరీయా?



## లేదంటే మొత్తం బార్లన్నీ రెన్యువల్ చేద్దామా?

### కొత్త పాలసీపై ప్రభుత్వం కసరత్తు

- వైసీపీ హయాంలో వేలంలో కేటాయింపు
- గొప్ప కోసం ఎక్కువకు పాడి నష్టాలపాలు
- ఆగస్టుతో ముగియనున్న లైసెన్సుల గడువు
- ఈ సారి ఫీజులు తగ్గించే యోచన
- ఆదాయ నష్టం, అక్రమాల్లేని పాలసీ దిశగా కార్యాచరణ!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నూతన బార్ పాలసీపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. జగన్ జమానాలో తీసుకొచ్చిన విధానం గందరగోళంగా మారడంతో ఈసారి పొరపాట్లు లేకుండా పక్కాగా అమలు చేయాలని భావిస్తోంది. అందులో భాగంగా ఎలాంటి పాలసీ అయితే వివాదాలు లేకుండా ఉంటుందనే కోణంలో పలు ప్రతిపాదనలపై అధ్యయనం చేస్తోంది. జగన్ ప్రభుత్వం 2022లో వేలం నిర్వహించి బార్లు కేటాయించే విధానం తీసుకొచ్చింది. దాని గడువు ఈ ఏడాది ఆగస్టుతో ముగుస్తుంది. అప్పట్లో రూ.50 లక్షలు, రూ.35 లక్షలు, రూ.15 లక్షలతో మూడు శ్లాబులతో బార్ పాలసీ ప్రకటించి.. వేలం నిర్వహించి అత్యధిక ధరకు పాడిన వారికి కేటాయించారు. అంతకుముందు దాదాపు రెండు దశాబ్దాలుగా బార్లను రెన్యువల్ చేస్తూ వచ్చారు. దీంతో ప్రభుత్వాలు మారినా లైసెన్సీలు వారే ఉంటూ వచ్చారు. అయితే వారందరినీ తీసేసి తమకు అనుకూలంగా ఉండే లైసెన్సీలు రావాలనే ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వం మొత్తం బార్ లైసెన్సులు రద్దు చేసింది. 2022లో వేలం ద్వారా కొత్త లైసెన్సీలను ఎంపిక చేసింది. అయితే వారిలో పలువురు అతి భారీ ధరకు వేలం పాడి బార్లు దక్కించుకున్నారు. రూ.15 లక్షల కనీస ధర ఉన్న బార్‌ను రూ.70 లక్షల వరకు.. రూ.35 లక్షల బార్‌ను రూ.కోటికి పైగా పాడి వేలంలో దక్కించుకున్నారు. కానీ అంతంత ఎక్కువ ఫీజులతో వ్యాపారంలో నష్టం రావడంతో అనేక మంది మధ్యలోనే లైసెన్సులు వదిలేసుకున్నారు. ఫలితంగా రాష్ట్రంలో ప్రస్తుతం 53 బార్లు ఖాళీగా మిగిలిపోయాయి. ఈ నేపథ్యంలో ఈసారి గందరగోళం లేకుండా సాఫీగా పాలసీ ఉండేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రధానంగా బార్లకు కొత్తగా లైసెన్సులు జారీచేయాలా.. ఇప్పుడున్న వారికే రెన్యువల్ చేయాలా అనేదానిపై ఆలోచన చేస్తోంది.

### కొత్తగా అంటే ముందుకొస్తారా?

బార్లకు మళ్లీ కొత్తగా లైసెన్సుల కేటాయింపు అంటే వ్యాపారులు ఎక్కువ మంది ముందుకు రాకపోవచ్చనే వాదన వినిపిస్తోంది. ఎందుకంటే మద్యం షాపు అయితే.. ఒక షాపు తీసుకుని వెంటనే ఏర్పాటు చేసుకునే వీలుంటుంది. లైసెన్స్ గడువు ముగిశాక వెంటనే ఖాళీ చేస్తారు. కానీ బార్ ఏర్పాటు చేయాలంటే రెస్టారెంట్ కచ్చితంగా ఉండాలి. నిర్దేశిత స్థలంలో బార్, అందులో కిచెన్ ఏర్పాటుచేయాలి. దీనికి ఎక్కువ పెట్టుబడి పెట్టాలి. ప్రతి మూడేళ్లకు కొత్తగా లైసెన్సీలను ఎంపిక చేస్తే.. అంత పెట్టుబడి పెట్టేందుకు ఎక్కువ మంది ముందుకు రారు. అందుకే గతంలో బార్ లైసెన్సులు రెన్యువల్ చేసేవారు. అయితే వారంతా టీడీపీకి అనుకూలంగా ఉన్నారని, తమ అనుకూలురు ఉండాలనే ఉద్దేశంతో జగన్ ప్రభుత్వం మొత్తం లైసెన్సులు రద్దు చేసి.. మూడేళ్లకు అంటే ఈ ఏడాది ఆగస్టు వరకు కొత్త లైసెన్సులు మంజూరుచేసింది. ఇప్పుడు వాటిని రద్దు చేసి నూతనంగా లైసెన్సులు ఇస్తామంటే వ్యాపారులు వెనక్కి తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వం అనుకుంటోంది. ఒకవేళ కొత్త లైసెన్సులు ఇవ్వాలన్న నిర్ణయం తీసుకుంటే.. ఈసారి ఎక్కువ కాలానికి లైసెన్సులు మంజూరు చేయాలనే ప్రతిపాదన కూడా వచ్చినట్లు తెలిసింది. రెన్యువల్ కాకుండా కొత్త లైసెన్సులు జారీచేయాలనుకుంటే లాటరీ లేదా వేలంలో కేటాయించాలి. గత ప్రభుత్వంలో షాపులు సర్కారు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడంతో బార్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కానీ ఇప్పుడు ప్రైవేటు షాపులు రావడంతో వ్యాపారం ఎక్కువ లాభసాటిగా ఉండకపోవచ్చనే అభిప్రాయం బార్ల వ్యాపారుల్లో ఉంది. అందుకే ఈసారి లైసెన్సు ఫీజులు కూడా తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. స్టార్ హోటళ్లలోని బార్లకు కూడా భారీగా తగ్గించింది.

### ధరలపైనా పునరాలోచన

మద్యం షాపులు, బార్లకు ఎక్సైజ్ శాఖే మద్యం సరఫరా చేస్తుంది. అయితే షాపులతో పోలిస్తే బార్లకు 10 శాతం అదనపు ధరకు విక్రయిస్తుంది. బార్లు, షాపులకు ఒకే ధరకు మద్యం అమ్మాలని మద్యం వ్యాపారులు చాలాకాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. కొన్ని చోట్ల బార్ వ్యాపారులు షాపుల నుంచి మద్యం తీసుకొచ్చి అక్రమంగా విక్రయిస్తున్నారు. వీటిని అరికట్టాలంటే షాపులు, బార్లకు సరఫరా చేసే మద్యం ధరలు ఒకేలా ఉంచడం మేలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. మొత్తంగా ఆదాయం నష్టపోకుండా, వ్యాపారంలో అక్రమాలు లేని పాలసీని తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

## ఆరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు కొత్త ప్రిన్సిపాల్స్ నియామకం

- 3 బోధనాసుపత్రులకు సూపరింటెండెంట్లు కూడా..

అమరావతి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆరు ప్రభుత్వ వైద్య కళాశాలలకు కొత్త ప్రిన్సిపాల్స్, మూడు బోధనాసుపత్రులకు కొత్త సూపరింటెండెంట్లు నియమితులయ్యారు. నెల క్రితం డీపీసీ పూర్తిచేసినా ఆరోగ్యశాఖ ఆలస్యంగా పోస్టింగులు ఇచ్చింది. ఆంధ్రా, కాకినాడ మెడికల్ కాలేజీలకు గట్టి పోటీ ఉండడంతో అధికారులు పోస్టింగ్ విషయంలో ఆలస్యం చేశారు. చివరకు సీఎం చంద్రబాబు ఆమోదంతో లైన్‌క్లియర్ అయింది. ఆంధ్రా మెడికల్ కాలేజీ తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా ఉన్న డా.కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవికి అడిషనల్ డైరెక్టర్ పదోన్నతి కల్పించి అదే కాలేజీ రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం నియమించింది. కాకినాడ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ పదోన్నతిపై ఆ కాలేజీకే ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. కాకినాడ ప్రిన్సిపాల్‌గా ఉన్న డీఎంఈ డా.నర్సింహంను ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఆయన డీఎంఈగా కొనసాగనున్నారు. రాజమండ్రి మెడికల్ కాలేజీ బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ డా.జి.రాజేశ్వరికి అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి నెల్లూరు కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారు. కడప మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఎ.సురేఖను నంద్యాల మెడికల్ కాలేజీకి, ఒంగోలు బోధనాసుపత్రి సూపరింటెండెంట్ టి.జమునను కడప మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. తిరుపతి రుయా బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డా.జి.రవి ప్రభుకు తిరుపతి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు. విజయవాడ బోధనాసుపత్రి తాత్కాలిక సూపరింటెండెంట్ ఏవీ రావుకు పదోన్నతి కల్పించి అక్కడే రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా, ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాధను పదోన్నతిపై ఎస్వీ బోధనాసుపత్రికి సూపరింటెండెంట్‌గా, విశాఖ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ వి.మన్మథరావుకు పదోన్నతి కల్పించి కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమించారు.

## తెలంగాణ సీఎస్‌గా రామకృష్ణారావు



హైదరాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఆగస్టు వరకు 4 నెలల పాటు ఆయన సీఎస్ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుత సీఎస్ శాంతి కుమారి ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్నారు. అదే రోజు రామకృష్ణారావు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. 1991 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావు ప్రస్తుతం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 1990 బ్యాచ్‌లో శశాంక్ గోయల్, 1991 బ్యాచ్‌లో రామకృష్ణారావు, జయేశ్‌రంజన్, సంజాయ్ జాజు ఉన్నారు. రాష్ట్ర కేడర్‌లో శశాంక్ గోయల్ సీనియర్ అయినప్పటికీ ఆయన్ను మొదటి నుంచీ అప్రాధాన్య పోస్టుల్లోనే కొనసాగిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ప్రాధాన్యం లేని పోస్టులే ఇస్తూ వచ్చాయి. సంజాయ్ జాజు కేంద్ర సర్వీసుల్లో కొనసాగుతుండగా, జయేశ్ రంజన్, రామకృష్ణారావుల్లో ఒకర్ని సీఎస్‌గా చేయాలని సర్కారు భావించింది. అయితే మొదటి నుంచీ రామకృష్ణారావు వైపే సర్కారు మొగ్గుచూపుతోంది.

## అధిక బీపీతో పీఎస్ఆర్ విచారణకు బ్రేక్

విజయవాడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీపై వేధింపుల కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును సీఐడీ అధికారులు తొలి రోజు విచారించలేకపోయారు. మూడో అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆయన్ను మూడ్రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. ఆ మేరకు ఆది, సోమ, మంగళవారాల్లో ఆయన్ను ప్రశ్నించేందుకు సీఐడీ అధికారులు అంతా సిద్ధం చేసుకున్నారు. పీఎస్ఆర్‌ను కస్టడీలోకి తీసుకోవడానికి ఆదివారం ఉదయం విజయవాడలోని జిల్లా జైలుకు వెళ్లారు. ఆయనకు బీపీ ఎక్కువగా ఉందని వారికి జైలు అధికారులు తెలియజేశారు. ఇదే విషయాన్ని కాగితంపై రాసివ్వాలని సీఐడీ అధికారులు అడుగగా.. అలా ఇవ్వలేమని వారు చెప్పారు. కస్టడీలోకి తీసుకుని.. ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి, అక్కడ ధ్రువీకరణపత్రం తీసుకోవాలని స్పష్టం చేశారు. దీంతో సీఐడీ అధికారులు పీఎస్ఆర్‌ను కస్టడీకి తీసుకుంటున్నట్లు జైలు రికార్డుల్లో రాసి.. ఆయనను జైలు నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ఆయనకు బీపీ, ఈసీజీ, షుగర్ పరీక్షలు చేశారు. బీపీ 160/90 ఉన్నట్లు తేలింది. షుగర్ మాత్రం సాధారణ స్థాయిలో ఉంది. బీపీ ఎక్కువగా ఉన్నందున ఆయన్ను ప్రశ్నించడం సరి కాదని వైద్యులు అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తూ రాసిచ్చారు. దీంతో సీఐడీ అధికారులు ఆయన్ను జిల్లా జైలుకు తరలించారు.



వైద్య పరీక్షల కోసం పీఎస్ఆర్ ఆంజనేయులును విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

# రూటు మార్చిన రేషన్ మాఫియా!

- టాంజానియాకు కాకుండా ఫిలిప్పైన్స్‌కు ఎగుమతి
- తెలంగాణ నుంచి అధికారికంగా అక్కడకు ఎగుమతులు
- డిమాండ్‌తో అదే మార్గంలో విజయవాడ 'సిండికేట్'
- రూట్లు మార్చి, నిఘాను ఏమార్చి అక్రమ రవాణా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

రేషన్ మాఫియా మళ్లీ రూటు మార్చింది. ఇటీవలి వరకు విజయవాడ నుంచి టాంజానియాకు తరలిస్తున్న పేదల బియ్యాన్ని తాజాగా ఫిలిప్పైన్స్‌కు మళ్లిస్తోంది. అక్కడి వాళ్లు మన బియ్యాన్ని కొనుగోలు చేయటానికి ఆసక్తి చూపిస్తుండటంతో మాఫియా ఈ మార్గం ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఫిలిప్పైన్స్‌కు కూడా ముంబై పోర్టు నుంచే రవాణా జరుగుతున్న నేపథ్యంలో అక్కడికే ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి పీడీఎస్ బియ్యం తరలుతోంది. విజయవాడ నుంచి ఇప్పటి వరకు బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్, నైజీరియా, టాంజానియా వంటి దేశాలకు రేషన్ బియ్యం తరలింపు జరగ్గా.. కొద్దిరోజులుగా ఆ రూటు మార్చారు. దీనికి ప్రత్యేక కారణం ఉంది. తెలంగాణ ప్రభుత్వం తమ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుల్లో ఆడించిన తర్వాత ఫిలిప్పైన్స్‌కు అధికారికంగా ఎగుమతి చేస్తోంది. గతంలో మిల్లుల్లో ఆడించిన తర్వాత ఆ బియ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థకు అందించేది. ప్రజలు ఈ బియ్యాన్ని 30 శాతం మించి తినడం లేదన్న ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మార్కెట్‌లో సన్నబియ్యాన్ని కొనుగోలు చేసి కార్డుదారులకు అందిస్తోంది. ఇదే సమయంలో రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని మిల్లు ఆడించి ఫిలిప్పైన్స్‌కు ఎగుమతి చేస్తోంది. దీంతో తెలంగాణ నుంచి విజయవాడకు రేషన్ బియ్యం అక్రమ రవాణా తగ్గిపోయింది. దీంతో ఇక్కడి రేషన్ మాఫియా సిండికేట్ ఫిలిప్పైన్స్‌లో బియ్యానికి ఉన్న డిమాండ్‌ను సొమ్ము చేసుకోవాలన్న ఉద్దేశంతో తమ రూటును టాంజానియా నుంచి ఫిలిప్పైన్స్‌కు మార్చింది. అక్కడకు ఎగుమతి చేసేందుకు మాస్టర్ ఆపరేటర్లతో సంప్రదింపులు జరిపింది. రేషన్ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేయటంలో వీరిదే కీలకపాత్ర. ఆయా దేశాల్లో కొనుగోలు చేసే మాస్టర్ ట్రేడర్లతో వీరికి సంబంధాలు ఉంటాయి. ఫిలిప్పైన్స్‌లోని మాస్టర్ ట్రేడర్లతో ఒప్పందం చేసుకుని రేషన్ బియ్యాన్ని తరలించే ఏర్పాట్లు చేపట్టారు.

### ప్రధానంగా రెండు మార్గాల్లో..

తెలంగాణ ప్రభుత్వం మార్కెట్ కంటే తక్కువ రేటుతోనే బియ్యం ఎగుమతి చేస్తోంది. ఆ రేటు కంటే కూడా ఉమ్మడి కృష్ణా జిల్లా రేషన్ మాఫియా సిండికేట్ తక్కువ ధరకు అంతే నాణ్యమైన రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేస్తోంది. దీంతో తక్కువ ధరకు వస్తుండటంతో సహజంగా ఫిలిప్పైన్స్‌లో మన రేషన్ బియ్యానికి మొగ్గు చూపుతున్నారు. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా కొనుగోలు చేసిన బియ్యంలో సింహభాగం ముంబై పోర్టుకు తరలిస్తున్నారు. మిగిలిన వాటిని కాకినాడ పోర్టుకు తీసుకుపోతున్నారు. రూట్లు మార్చి, నిఘాను ఏమార్చి మరీ ఈ అక్రమ రవాణా సాగుతోంది. విజిలెన్స్ బృందాల నుంచి తప్పించుకోవటానికి ఉమ్మడి కృష్ణా జిల్లా రేషన్ మాఫియా బెజవాడ సిండికేట్‌కు రేషన్ బియ్యాన్ని తరలిస్తోంది. గతంలో మాదిరిగా గోడౌన్లలో నిల్వ ఉంచట్లేదు. డైరెక్టుగా చిన్న వ్యాన్లలో విజయవాడకు రవాణా చేసి, రోడ్డుపైనే ఆ వాహనాలను నిర్ణీత ప్రాంతాల్లో స్వాధీనం చేసుకుని తిరిగి అవే వాహనాలపై ముంబైకు తరలిస్తున్నారు. ఈ వాహనాలను ముంబై చేర్చేందుకు ప్రధానంగా రెండు మార్గాలు వినియోగిస్తున్నారు. ఎన్‌హెచ్-30 మీదుగా ఛత్తీస్‌గఢ్‌కు రవాణా చేస్తున్నారు. నందిగామ-జగ్గయ్యపేట మార్గం నుంచి కూడా అడ్డదారిలో ఎన్‌హెచ్-30కు చేరుకునేలా రవాణా చేస్తున్నారు. సదాశివపేట మీదుగా నాగపూర్‌కు బియ్యాన్ని రవాణా చేశాక, అక్కడి నుంచి సుదీర్ఘ ప్రయాణం చేస్తూ ఆ వాహనాలు ముంబైకు చేరుకుంటాయి. అక్కడి నుంచి ఫిలిప్పైన్స్‌కు నేరుగా ఓడల ద్వారా ఎగుమతి జరుగుతోంది. కాకినాడ పోర్టు నుంచి కూడా ఫిలిప్పైన్స్‌కు ఎగుమతి జరుగుతోంది. ఈ రూట్‌లో నిఘా ఎక్కువగా ఉండటం వల్ల చాలా తక్కువగానే విజయవాడ నుంచి అక్రమ రవాణా జరుగుతోంది. చింతలపూడి మార్గం, గణపవరం, రావులపాలెం మీదుగా కాకినాడ పోర్టుకు రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్నారు.



బాలయ్య



అశోక్

## పిడుగుపాటుకు ముగ్గురు బలి



రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో కొబ్బరి చెట్టుపై పిడుగుపడి చెలరేగిన మంటలు

### కర్నూలు జిల్లాలో విషాదం

కౌతాళం, అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పిడుగుపాటుకు ముగ్గురు మృతి చెందారు. వీరిలో ఇద్దరు యువకులు కాగా, ఒక రైతు ఉన్నారు. మరో ఇద్దరు బాలురు గాయపడ్డారు. కౌతాళం మండలం కాత్రికి గ్రామంలో ఆదివారం తెలుగు అశోక్(21), తలారి బాలయ్య(22)తో పాటు మరో 8 మంది యువకులు, చిన్నారులు సమీప పొలాల్లో క్రికెట్ ఆడడానికి వెళ్లారు. ఈదురుగాలులతో వర్షం ప్రారంభమవడంతో సమీపంలోని చెట్టు కిందకు చేరుకున్నారు. ఆ సమయంలో పిడుగు పడటంతో అశోక్, బాలయ్య అక్కడే స్పృహ కోల్పోగా.. ఇద్దరు బాలురు నిరుపాది, గంగాధర్ గాయపడ్డారు. గంగాధర్‌ను చికిత్స కోసం హాల్వి గ్రామానికి తీసుకెళ్లారు. మిగతా ముగ్గురిని కౌతాళం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి ఆదోని వైద్యశాలకు తీసుకెళ్లారు. అయితే అప్పటికే యువకులు అశోక్, బాలయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలయ్యకు గతేడాది వివాహం కాగా భార్య మీనాక్షి ప్రస్తుతం గర్భిణి. అలాగే, క్రిష్ణగిరి మండలంలోని కటారుకొండ గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు(52) పొలంలో పనులు చేసుకుంటుండగా వర్షం కురవడంతో చెట్టు కిందకు వెళ్లారు. పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలతో కూడిన వర్షం పడింది. రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలోని ఎస్సీ కాలనీలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో మంటలు ఎగసిపడ్డాయి. గుమ్మఘట్ట మండలం రంగచేడు గ్రామంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామానికి చెందిన ఆనందరెడ్డి తోటలోని చీనీ చెట్టుపై పిడుగు పడడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి.

## భూవివాదంలో.. రెచ్చిపోయిన వైసీపీ కార్యకర్తలు

- పెద్దాపురంలో టీడీపీ కార్యకర్తపై కత్తులతో దాడి
- జార్జి పరిస్థితి విషమం.. కాకినాడ జీజీహెచ్‌కు తరలింపు

పెద్దాపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. టీడీపీ కార్యకర్తకు చెందిన 2.54 ఎకరాల భూమిని నకిలీ పత్రాలు సృష్టించి కొట్టేసేందుకు స్కెచ్ వేశారు. పెద్దాపురానికి చెందిన తొగు జార్జ్ చక్రవర్తి 2010లో పాత పెద్దాపురంలో సర్వే నంబరు 234/2లోని 2.54 ఎకరాల భూమిని కట్టమూరుకు చెందిన విశ్వేశ్వరరావు వద్ద కొనుగోలుచేసి వరి సాగు చేస్తున్నారు. అయితే ఆ భూమి తమదంటూ ఓ మహిళతో కొందరు వైసీపీ కార్యకర్తలు కోర్టులో కేసు వేయించారు. కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ జార్జ్ సాగు చేసుకుంటున్నారు. శనివారం రాత్రి తన పొలంలో వరి కోత మిషన్‌తో పనులు చేయిస్తుండగా పెద్దాపురం వైసీపీ కార్యకర్తలు విన్నా విజయచక్రవర్తి, ఎ.వీర్రాఘవరావు, పెదిరెడ్ల నాని, ఐతి మేరి, కొత్తపల్లి సాయికుమార్, మరికొందరు ఆయనపై కత్తులతో దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన జార్జిని అక్కడ పనిచేస్తున్నవారు హుటాహుటిన పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజుతో ఫోన్లో మాట్లాడారు. జార్జ్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆయనపై దాడిచేసిన వైసీపీ కార్యకర్తలపై గతంలోనూ దౌర్జన్యాలు, కొట్లాట కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.



వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన జార్జ్ చక్రవర్తి


# ఆక్వా సాగుకు విరామం!

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా సాగుకు రైతులు పంట విరామం ప్రకటించాలని తీర్మానాలు చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టులో మూడు నెలలు సాగుకు స్వస్తి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలువురు రైతులు జిల్లాలో చెరువుల వద్ద పంట విరామ బోర్డులు పెట్టేశారు. రొయ్య కౌంట్‌కు గిట్టుబాటు ధర రావడం లేదన్న కారణంతో విరామానికి ముందుకొస్తున్నారు. మేత ధరలు తగ్గడం లేదంటూ మరో వాదన వినిపిస్తున్నారు. పాలకొల్లు పరిధిలోని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం పంట విరామానికి పూనుకుంది. మరోవైపు రైతులకు ప్రోత్సాహకాలు కల్పిస్తామని, సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా అధికార యంత్రాంగం రైతులతో సమావేశమై చైతన్య పరుస్తోంది. వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంద కౌంట్ రొయ్య ధర రూ.270లకు చేరింది. గత ప్రభుత్వంలో రూ.240 ఇవ్వనున్నట్టు ప్రకటించారు. వ్యాపారులు మాత్రం అంత ధరతో కొనుగోలు చేయలేదు. వంద కౌంట్ రొయ్య ధర రూ.200లకు పరిమితమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు పెరిగాయి. విదేశాలకు ఎగుమతి చేసే 30-40 కౌంట్ రొయ్య ధర ఏకంగా రూ.470లకు చేరింది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన పన్నులతో ఇక్కడ రొయ్య ధరలు మళ్లీ పడిపోయాయి. ఉద్దేశపూర్వకంగానే వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారంటూ ఇటీవల జిల్లాలో రొయ్య రైతులు ధర్నాలు నిర్వహించారు.

### పశ్చిమ ఆయువు పట్టు..!

పశ్చిమ గోదావరి జిల్లాలోనే 1.13 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. దానిని ఈ ఏడాది 1.30 లక్షల ఎకరాలకు విస్తరించాలని జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక వేసింది. ఆక్వా సాగు మొత్తంలోని 80వేల ఎకరాల్లో రొయ్య ఉత్పత్తి జరుగుతోంది. మిగిలిన విస్తీర్ణంలో చేపలు సాగు చేస్తున్నారు. ఏటా మూడు లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తవుతున్నాయి. అమెరికా, యూరప్ దేశాలకు అత్యధికంగా ఎగుమతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ధరలు పెరిగినప్పుడు రైతులు ఒకింత సంతోష పడ్డారు. ఇటీవల మళ్లీ ధరలు పడిపోవడంతో పంట విరామానికి ముందుకొస్తున్నారు.




పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలో పంట విరామం బోర్డు



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.